తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

జూలై 2025
వెల రూ. 20/-
పుటలు - 56

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 02
July - 2025, Price Rs.20/-.




తిరుమల శ్రీవారి ఆణివరఆస్థానం (పుష్పపల్లకి సేవ)
(16-07-2025)

# తిరుపతి, శ్రీ గోవిందరాజస్వామివారికి 02-06-2025 నుండి 10-06-2025 వరకు జరిగిన బ్రహ్మోత్సవ దృశ్యాలు







# గీతాశ్లోకార్థసారం

**శ్లో : దేహీ నిత్యమవధ్యోయం దేహే సర్వస్య భారత ।**
**తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-30వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** భారత= ఓ అర్జునా; సర్వస్య= సమస్తప్రాణులయొక్కయు; దేహే= దేహము నందు (ఉన్న); అయమ్ దేహీ= ఈ ఆత్మ; నిత్యమ్= ఎల్లప్పుడును; అవధ్యః= చంపబడని వాడు; తస్మాత్= అందువలన; సర్వాణి= సమస్తములైన; భూతాని= ప్రాణులనుగురించి; త్వమ్= నీవు; శోచితుమ్= దుఃఖించుటకు; న అర్హసి= తగవు.

**భావం:** ఓ అర్జునా! సమస్త ప్రాణికోట్లయొక్కయు, దేహములయందు వసించియున్న ఈ ఆత్మ ఎన్నడును చంపబడదు. కావున, ఏ ప్రాణిని గూర్చియు నీవు శోకింప తగదు.

---

## శ్రీవేంకటాద్రి విభునిఁ గొల్చి

సంసారమే మేలు సకలజనులకును
కంసాంతకుని భక్తి గలిగితే మేలు

వినయపు మాటల విద్య సాధించితే మేలు
తనిపి యప్పులలోన దాఁగకుంటే మేలు
మునుపనె భూమి దన్ను (ను!) మోచిదించకుంటే మేలు
వెనుకొన్న కోపము విడిచితే మేలు

కోరి వొకరి నడిగి కొంచపడకుంటే మేలు
సారె సారె జీవులను చంపకుంటే మేలు
భారపుటిడుమలను పడకుండితే మేలు
కారించి తిట్లకొడి గట్టకుంటే మేలు

పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకని కెళవులు దొక్కకుంటే మేలు
అరుదైన శ్రీ వేంకటాద్రి విభునిఁ గొల్చి
యిరవై నిశ్చింతుఁడైతే నిన్నిటాను మేలు

ఆధ్యాత్మ సంకీర్తన సంపుటం 03- సంకీర్తన 447



సోమరితనానికి తావివ్వక ఆనందమయమైన సాంసారికజీవితాన్ని గడుపుతూ కూడా భగవంతునిపై భక్తిని కల్గి ఉండాలి.


గురుముఖతః వినయంతో కూడిన విద్యను అభ్యసించినపుడు, క్షయవ్యాధిలాంటి అప్పలఊబిలో కూరుకుపోకుండా ఉన్నదాంతో తృప్తిపడినప్పుడు. నా ఈ జన్మ భూమికి భారంగా ఉన్నది కదా అని అనుకోకుండా తనకు చేతనైనంతలో పదిమందికి సహాయపడినప్పుడు, తన కోపమే తన శత్రువు అనే నానుడిని విస్మరించక శాంతాన్ని అలవరచుకొన్నపుడు సాంసారికజీవితం సుఖప్రదమౌతుంది.



ఒకరిని యాచించి లేదనిపించుకోకుండా, అడగకుండా ఉండటమే శ్రేయస్కరమని భావించినపుడు, ఇతరజీవులను చంపక అహింసాధర్మమును పాటించినపుడు, ఇతరులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి గౌరవంగ ఉన్నప్పుడు సాంసారికజీవితం సుఖప్రదమౌతుంది.

పరస్త్రీలను అవమానించడం సర్వనాశనానికి మూలహేతువని తెలుసుకొన్నప్పుడు, నీతి, నిజాయితీలను వదిలిపెట్టక సక్రమమార్గంలో ప్రయాణించినపుడు, ఎన్ని అవరోధాలు ఎదురైనా ఆ శ్రీవేంకటేశ్వరుని సేవించినప్పడే సాంసారికజీవితం శుభప్రదమౌతుందని అన్నమయ్య పై సంకీర్తనలో మానవుడు సాంసారికజీవితంలో ఎలా ఉండాలో అని మనసుకు హత్తుకునేలా వర్ణించాడు.

# ఉత్సవం



**జూలై 28, 2025న ఆండాళ్ తిరువాడిప్పూరం శాత్తుమొఱ మరియు పురిశైవారి తోటోత్సవం సందర్భంగా....**

"కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవమ్
పాండ్యే విశ్వంభరాం దేవీం వందే శ్రీరంగనాయకీమ్"

పాండ్యదేశంనందు శ్రీవిష్ణుచిత్తులవారి తులసీవనంలో ఆషాఢశుక్లచతుర్థీ మంగళవారం, పూర్వఫల్గునీనక్షత్రం, తులాలగ్నంనందు తులసీవనంలో భూదేవిఅంశతో ఆండాళ్ (గోదాదేవి) ఆవిర్భవించింది. అందుకే కటకమాసం పూర్వఫల్గునీనక్షత్రంనందు శాత్తుమొఱ నిర్ణయించి ఆ దినానికి పదిరోజులముందునుంచి ఉత్సవాలు జరుపుతూ, పూర్వ ఫల్గునీదినంనందు శాత్తుమొఱ తిరుపతి దేవస్థానంలో జరుగుతుంది. దీనికే తిరువాడిప్పూరం శాత్తుమొఱ అనిపేరు.

## పురిశైవారితోటోత్సవం

తిరువాడిప్పూరం శాత్తుమొఱనాడే తిరుమలశ్రీవారు పురిశైవారితోటకు వేంచేస్తారు. కటకమాసం పూర్వఫల్గునీనక్షత్రంనాటి సాయంకాలం శ్రీ మలయప్పస్వామివారు తిరుచ్చియందు వేంచేసి మహాప్రదక్షిణంగా పురిశైవారితోటలోని మండపానికి వేంచేస్తారు. అక్కడ తళిహలు నివేదనం జరిగి గోష్ఠీవినియోగం జరుగుతుంది. పిమ్మట శ్రీవారు బయలుదేరి పొగడచెట్టువద్దకు రాగానే శ్రీవారికి హారతి అయి ఆ శేషహారతి, పుష్పసరము, శ్రీశఠారి ఆ పొగడచెట్టుకు సాయిస్తారు. అర్చకులు ఆ శఠారిని తిరుచ్చిలో పెట్టకుండా తీసుకొస్తారు. శ్రీవారు గజేంద్రమోక్షమండపం దాటి వీధిలోనికిరాగానే శ్రీవారికి హారతిఅయి శ్రీశఠారికి ప్రోక్షణరూపంగా అభిషేకం జరుగుతుంది. తిరిగి శ్రీవారికి హారతిచేసి ఆ శఠారిని తిరుచ్చిలో ఉంచుతారు. పిమ్మట శ్రీవారు క్రమంగా సన్నిధిలోనికి వేంచేస్తారు. ఇదీ తిరుమలలో జరిగే పురిశైవారితోటోత్సవం.

ఇలా ప్రతిసంవత్సరం ఆడిమాసం (కర్కాటక నెల)లో పూర్వఫల్గునీనక్షత్రం "తిరువాడిప్పూరం" ఉత్సవంరోజున శ్రీస్వామివారు శ్రీదేవీభూదేవులతో కూడి ఆలయానికి ప్రదక్షిణంగా ఊరేగుతూ తోటకేతెంచి యథాప్రకారం పూజలందుకొన్నపిదప పుష్పమాలలు, శఠారితో అనంతార్యుల బృందావనం లోని పొగడచెట్టును సత్కరించినపిదప ప్రదక్షిణంగా ఊరేగుతూ ఆలయం ప్రవేశిస్తారు. ఈ రోజునే అనంతాళ్వారు పరమపదం చెందినదినమనీ, ఆ బృందావనంలోని పొగడచెట్టుగా అనంతార్యులే



ఉద్భవించారనీ పెద్దలమాట. ఈ రోజే గోదాదేవి పుట్టినరోజు తిరువాడిప్పూరం కావడం కూడ విశేషంగా చెప్పుకోవచ్చు.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 జూలై, 2025 సంచిక : 02



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥

గౌరవ సంపాదకులు
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉప సంపాదకులు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఉత్సవం | | 04 |
| గురుస్సాక్షాత్పరబ్రహ్మ!! | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 07 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 09 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 10 |
| దేవగురువు | శ్రీమతి ఎన్.సిహెచ్.శ్రీలక్ష్మి | 11 |
| పద్మఏకాదశి | శ్రీమతి ప్రవీణ గంగరాజు | 13 |
| గరుడమేరుపచ్చ | శ్రీ దేవులపల్లి భాస్కరరామశర్మ | 15 |
| మహాభారతంలో నాగులు | డా॥ పి.వి.ఉమాశశి | 17 |
| గురుశిష్యులు | డా॥ యస్.పద్మావతి | 19 |
| మానవుని మనీషిగా తీర్చిదిద్దే ఏకాదశ ప్రకాశిత లక్షణములు | శ్రీ వద్దిరాజు జనార్దనరావు | 21 |
| విద్యారంభం కరిష్యామి!! | డా॥ మైలవరపు లలితకుమారి | 23 |
| శ్రీవైకుంఠం (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీగరుడాష్టోత్తర శతనామావళిః | | 28 |
| చక్రధారి | శ్రీమతి బండారు శాయి ప్రసన్నలక్ష్మి | 31 |
| గుణం ప్రధానం (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 32 |
| గురుదక్షిణ | శ్రీ లక్కరాజు గోయెంకా సాయి | 33 |
| నవ్వు! నవ్వించు!! | శ్రీ యం.రవితేజ | 34 |
| అభివాదఫలం!! | శ్రీ పింగళి పొందురంగారావు | 36 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 37 |
| మురుగన్ ఆలయం - పళముదిర్చోలై | శ్రీ అనంతాత్మకుల రంగారావు | 38 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన-కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య | 40 |
| శుక్రాచార్యుడు | శ్రీ ఐనవోలు మోహనాచార్యులు | 41 |
| గురుసేవాఫలం | శ్రీ యం.వి.యస్.రామశేషు | 43 |
| విజయసూత్రం | డా॥ డి.ఊర్మిళాదేవి | 45 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 46 |
| ఉద్యోగప్రదాత | శ్రీ బిట్రా వెంకటేశ్వరరావు | 47 |
| తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థాన మహోత్సవం | | 47 |
| బాల్యంలో బాగుందాం!! (చిత్రకథ) | కథ: శ్రీమతి వావిలాల నాగవల్లి<br>చిత్రాలు: డా॥ శ్రీధరన్ కౌలికి | 48 |
| నల్లజీలకర్ర | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, తిరుమల
వెనుకచిత్రం: శ్రీఆండాళ్ (వర్ణచిత్రం- శ్రీ మణియమ్ శెల్వన్)



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# పరమపావనం గురుస్మరణం!!

**'శబ్దే పరే చ నిష్ణాతమ్ బ్రహ్మణి ఉపసంశ్రయమ్'** పరబ్రహ్మతత్త్వాన్ని పరిపూర్ణంగా తెలుసుకున్నవాడు ఆ పరబ్రహ్మంలోనే పూర్తిగా లీనమైనవాడు సద్గురువు. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నట్లుగా బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మమే ఔతాడు. కనుక సద్గురువు దైవస్వరూపుడు. అటువంటి గురువుకు గురుపూర్ణిమనాడు పూజలు జరుగుతాయి. జరగాలి కూడ. ఆధ్యాత్మికసాధకులకు మరొక కారణంవల్లకూడా గురుపూర్ణిమ ఒక మహత్తరదినం. తమ సాధన తీవ్రతను, తమ తప్పొప్పులను గురువుకు సమర్పించి, మళ్లీ సాధనాపథంలో ముందుకు సాగడానికి అత్యంత ప్రశస్తమైన దినమిది.

గురుశిష్యపరంపర అనేది జ్ఞానగంగయొక్క గంగోత్రివంటిది. మన భారతదేశం గొప్పపీఠాలనుండి అత్యంత ప్రాచీనపరంపరలద్వారా గురువులు ఆనాటినుండి ఈనాటివరకు నిరాటంకంగా జ్ఞానాన్ని అందిస్తూనే ఉన్నారు. అందుకే ఈ గురుపూర్ణిమనాడు వేదవ్యాసులకు, ఋషిపరంపరలకు, దాని తర్వాత అనూచానంగా వృద్ధిచెందిన గురుపరంపరకు మన భక్తిపూర్వకమైన, వినమ్రమైన నమస్సులను సమర్పించుకుందాం. గురువుపట్ల వినయవిధేయతలతో మెలగి అంతా భగవంతుడే, గురువు కూడా భగవంతుడే అనే భావనతో మనం సాగినప్పుడు మాత్రమే మనకు గురువుయొక్క అనుగ్రహం అనుభవానికి వస్తుంది. ఇదే గురుశిష్యసంబంధంలోని వైశిష్ట్యం. ఇలా గురుశిష్యపరంపర జీవనదిలా యుగయుగాలుగా కొనసాగుతూంది.

సంస్కృతంలో క్షరం అంటే నశించేది. అక్షరం అంటే నాశనం లేనిది అని అర్థం. ఈ జగత్తులో జననమరణాలున్నాయి. ఈ జగత్తులో ఎందరో గురుశిష్యులు పుట్టారు. మరణించారు. కొందరు మాత్రం ఉత్తమగ్రంథాలను రచించి ప్రపంచానికి అంకితం చేశారు. అదే మహాభారతం, రామాయణం, మహాభాగవతం, ఉపనిషత్తులు, పురాణాలు మొదలైనవి. ఇదే మన గొప్ప సంపద.


ఈ దైనందినజీవితంలోని కష్టనష్టాలనుండి, దుఃఖంనుండి మనకు విమోచనం దొరకాలంటే అందుకు కావలసిన జ్ఞానం సంపాదించుకోవాలి. అజ్ఞానాన్ని నివారించి, జ్ఞానాన్ని ప్రసాదించే జ్ఞానులే 'గురువు' అన్న పేరుకి పాత్రులౌతారు. ఇహపరాలు రెండింటిలోనూ సుఖసాధనకు గురువు ఉపదేశం, అనుగ్రహం రెండూ చాలా అవసరం.

గురువు పాదాలకు 'చరణములు' అని అర్థం. చరణం అంటే నడత అనికూడా అర్థం. శిష్యుడు గురువుపాదాలను పట్టుకుంటే గురువు నడిచినదారిలో తానుకూడా నడవడం అని అర్థం. అలాంటి గురువు చరణాలను ఈ గురుపౌర్ణిమనాడు భజిద్దాం. వారి ఆశీర్వాదాలు పొంది ధన్యులమౌదాం.

# గురుస్సాక్షాత్పరబ్రహ్మ!!

- డా॥ పుల్లిగడ్డ విజయలక్ష్మి,
99890 63761

2025,
జూలై 10న
గురుపూర్ణిమ
సందర్భంగా...



"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః"

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులైన త్రిమూర్తులే కాదు సాక్షాత్తూ, ఆ పరబ్రహ్మయే గురువు అని ఉపనిషత్తు చెప్తోంది. గురువే దేవుడు. "గురువు, దేవుడు ఒక్కసారే సాక్షాత్కరిస్తే- ముందుగా ఎవరికి నమస్కరిస్తావు"- అని అడిగితే గురువుకే అన్నది సమాధానం. ఎందుకంటే- ఆ దేవుని సాక్షాత్కరింప చేసింది ఆ గురువే కదా అన్నది- తిరుగులేని మహావిషయం.

గు = చీకటి
రు = తొలగించుట

మనలోని అజ్ఞానమనే చీకటిని పారద్రోలి జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడే గురువు. పూర్వం పాఠశాలలు- అరణ్యప్రాంతాల్లో గురుకులాలనేపేరుతో విలసిల్లాయి. ఎంతటి రాజాధిరాజుల, చక్రవర్తుల పుత్రులుకూడా దూరంగా ఉన్న గురుకులాల్లో చేరి, చదువుకోవలసిందే. ఏ విద్యార్థిలో ఏ గుణం ఉన్నదో, ఏ అంశంపై ఆసక్తి ఉన్నదో, ఏ శాస్త్రం అబ్బుతుందో గురువే పరీక్షించి, గ్రహించి ఆ శాస్త్రాన్నే బోధించేవాడు. అన్ని విషయాలపైనా తగినంత జ్ఞానాన్ని కలగచేసేవాడు.

అందుకే పూర్వం- ఆధ్యాత్మికగురువునే గురువన్నారు. ఇప్పుడు గురువంటే- కేవలం పాఠ్యపుస్తకాలలోని పాఠాలను మాత్రమే బోధించేవాడు. ఇప్పుడు మనం చదువుకోడానికి, పాఠశాలల్లో చేరడానికి ముందే డబ్బులివ్వాలి (ఫీజ్). పూర్వం అలా కాదు. చదువంతా పూర్తయినతరువాత- గురువు కోరిన దానిని గురుదక్షిణగా ఇచ్చేవారు. మరణించిన గురుపుత్రుని బ్రతికించి గురుదక్షిణగా ఇచ్చాడు శ్రీకృష్ణుడు. తమ గురువుని పరాభవించిన ద్రుపదుని బంధించి తెచ్చి- గురువుపాదాలపై పడవేసి, గురుదక్షిణ చెల్లించుకున్నారు పాండవులు. గురుపత్ని కోరిన మహిమోపేతమైన కుండలాలను తెచ్చిచ్చాడు ఉదంకుడు.

దేవదేవుళ్ళుకూడా గురువులకు విధేయులే. శ్రీరాముడు- వశిష్ఠవిశ్వామిత్రులకు వినమ్రుడే. శ్రీకృష్ణుడు- సాందీపునికి వినయసంపన్నుడే. శ్రీకృష్ణపరమాత్మ- శిష్యపుంగవుడే కాదు- తానూ గురువై మానవలోకానికి గీతోపదేశం చేసి, సకల ధర్మాలను బోధించి "కృష్ణం వందే జగద్గురుం" అని స్తుతుల నందుకుంటున్నాడు. "వ్యాసో నారాయణో హరిః" అనిపించు కున్న శ్రీహరి అపరావతారుడైన వేదవ్యాసునికి వేలాదిమంది శిష్యులున్నారు. వారందరూ తపశ్శక్తిమంతులే. ఆషాఢశుద్ధ పూర్ణిమ-వ్యాసపూర్ణిమ. ఏనాటినుండో ఈనాటిదాకా వ్యాసుల వారి శిష్యులు- తరతరాలుగా గురుపరంపరగా కొనసాగు తున్నారు. ఆ గురువులందరికీ గుర్తుగా నేడు వ్యాసపూర్ణిమ- "గురుపూర్ణిమ"గా పేరు పొందింది. గురువులందరూ శిష్యులను తీర్చిదిద్దడమేకాక వారికి వరాలందించారు. విశ్వవిఖ్యాతులను చేశారు. అంతేకాదు, శిష్యుడు తప్పుచేస్తే, అబద్ధమాడితే- అనుగ్రహానికి మారుగా ఆగ్రహం చెంది, శపించిన సందర్భాలూ ఉన్నాయి. భీష్మ, ద్రోణులకు గురువై అనుగ్రహించిన పరశు రాముడు- మోసం చేసిన కర్ణుని సహించలేక శపించాడు. లోకకంటకులైన కౌరవులపక్షాన చేరి, దుర్మార్గాలను చేస్తున్న కర్ణుడు కారణజన్ముడని తెలిసినా- ధర్మం నిలపడానికే ఆతనిని

## ఎనిమిదిరకాల గురువులున్నారన్నది ఉపనిషద్వాక్కు

**బోధకగురువు** – వేదవేదాంగాలను బోధించేవాడు. "గృణాతి ఉపదిశతి గాయత్ర్యాదికం గురుః"– గాయత్రీమంత్రాదులను ఉపదేశించేవాడు.

**తత్త్వబోధకగురువు** – తత్త్వాన్ని బోధించేవాడు.

**నిషిద్ధగురువు** – ఏవి బోధించకూడదో తెలిసి, వాటిని బోధించకుండా– శిష్యులను సన్మార్గంలో నిలిపి, పరలోకసౌఖ్యాన్ని కలిగించేవాడు.

**కామ్యకగురువు** – పుణ్యకార్యాలు చేయించి, పాపరహితుని చేసి, శిష్యులను ఉత్తములుగా తీర్చిదిద్దేవాడు.

**సూచకగురువు** – శమ, దమ, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సందేహనివృత్తి సమాధానం అనే షడ్గుణాలను ప్రసాదించి– ఆత్మావలోకనం చేసుకోవడానికి అవకాశం కలిగించేవాడు. అటువంటి శిష్యుడు ఆత్మావలోకనంతో ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు.

**వాచకగురువు** – పంచజ్ఞానేంద్రియాల, పంచకర్మేంద్రియాల, బుద్ధి, మనసులగుణాలను తెలియచేసి, శిష్యుని అంతరంగాన్ని విషయరహితం చేసి, నిర్విషయమయంగా చేసేవాడు.

**కారణగురువు** – "అహం బ్రహ్మాస్మి" అనే తత్త్వాన్ని కలిగించి, జీవన్ముక్తికి అర్హుని చేసే పరమపురుషుడు.

**విహితగురువు** – లౌకికవాంఛారహితుని చేసి, సందేహనివృత్తితో కైవల్యాన్ని ప్రసాదించేవాడు.

శపించి ఒక గురువుగా లోకశాంతిని కలిగించాడు. ఇది గురువుకర్తవ్యం.

ఉత్తమశిష్యులు ఇప్పటికీ ఉన్నారు. పద్మపాద, మండనమిశ్రాది శిష్య ప్రకాండులను పొంది శంకరభగవత్పాదులు జగద్గురువుగా ప్రశస్తి చెందారు.

లోకం మొత్తానికి మొదటి పూజ్యురాలు తల్లి. తరువాత తండ్రి. తల్లి దండ్రులతో సర్వసముడు గురువు. తల్లిని భూమాతతోను, తండ్రిని ఆకాశంతోను పోల్చి గురువును దేవునితో పోల్చారు. ముగ్గురూ దైవసములే.

"మాతృ దేవో భవ
పితృ దేవో భవ
ఆచార్య దేవో భవ"

గ్రహదేవతలలోకూడా గురువున్నాడు. రాక్షసజాతి గురువు శుక్రాచార్యుడైతే– దేవతాజాతికి గురువు బృహస్పతి. ముల్లోకాధినాథుడైన దేవేంద్రునికే గురువు– బృహస్పతి. మాంధాత, శనిదేవుడు, బృహస్పతికి శిష్యోత్తములు. బృహస్పతికే గురువు అని పేరున్నది. గ్రహదేవతలకు చెందిన వారాలలో గురువారమున్నది. గురువారానికి అధిపతి బృహస్పతి. బుద్ధికి అధినేత బృహస్పతి.

అంటే గురువు. గురువు చలువ ఉంటేనే బుద్ధి వికసిస్తుంది. గురుగ్రహదేవతా స్తుతిలో రెండర్థాలూ ఇమిడి ఉన్నాయి. ఒకటి– బృహస్పతిస్తోత్రం. రెండు– గురుస్తుతి.

"దేవానాంచ ఋషీనాంచ
గురుం కాంచన సన్నిభం
బుద్ధిమంతం త్రిలోకేశం
తం నమామి బృహస్పతిం"

రాక్షసకులగురువైన శుక్రాచార్యుడు తన శిష్యుడైన బలిచక్రవర్తిని కాపాడ డానికి శ్రీహరిని ఎదిరించి తన కన్నునే కోల్పోయి – ఒంటికంటివాడయ్యాడు. గురువుల అనుగ్రహం ఆ స్థాయిలో ఉంటుంది మరి. శుక్రుని– పరమగురువు అన్నారు కదా!

"హిమకుంద మృణాలాభం
దైత్యానాం పరమం గురుం
సర్వశాస్త్ర ప్రవక్తారం
భార్గవం ప్రణమామ్యహం"

శుక్రుడుకూడా గ్రహదేవత. ఒక వారానికి అధినేత (శుక్రవారం).

నిర్మలత్వం, శాంతం, సాధన చతుష్టయసంపత్తి, మితభాషణం, కామక్రోధాదిరాహిత్యం, సదాచార ప్రవర్తనం, జితేంద్రియత్వం– కలవాడే గురువు. గురూత్తముడు.

"గురవే నిర్మలాశ్శాంతాః
సాధనో మితభాషిణః
కామక్రోధ వినిర్ముక్తాః
సదాచార జితేంద్రియాః"

సమస్తసృష్టికి ఆదిగురువు– ఆది శంకరుడు. మానవలోకానికి ఆదిగురువు– అమ్మ.

*శ్రీ గురుభ్యో నమః*

# సందేహాలు సమాధానాలు



- శ్రీమతి యం.గీతాకుమారి

**ప్ర) స్వర్గం స్వర్గం అని అర్రులు చాస్తారు. దానికంటే జన్మ రాహిత్యం మెరుగు కదా! వివరణ ఇవ్వండి?**

**జ)** మనిషి తనకున్నదాంతో తృప్తిపడడు. లేనిదానికోసం అర్రులు చాచటం మనిషి నైజం. స్వర్గంలాంటి భూలోకాన్ని వదిలి కంటికి కనబడనిదానికోసం పరుగులుపెడతారు. సంయమీంద్రులు అయిన మునీశ్వరులు సైతం తాము చేసిన తపస్సు అంతా స్వర్గంకోసమే ధారపోశారు. స్వర్గం అంటే సుఖాలు, అమృతమైన ఆనందాల సమాహారం అని మనిషి ఆలోచన. ఈ సృష్టిలో "జంతూనాం నరజన్మ దుర్లభం" అంటారు. అంత గొప్పదైన మానవజన్మని సార్థకం చేసుకోక స్వర్గంకోసం తపిస్తారు. స్వర్గం ఎక్కడో లేదు. నీవుచేసే పనిలో, మానవసేవలో మనసుకు కలిగే తృప్తి, ఆనందమే స్వర్గం. పరమాత్మే భూలోకంలో దశావతారాలు ఎత్తి భూలోకాన్ని మించిన ఆనందం మరెక్కడా లేదన్నాడు. పరమాత్మ నడిచిన ఈ భూమ్మీద మనిషిగా పుట్టడం, తిరగడం, జీవించడాన్ని మించిన ఆనందస్వర్గం మరొకటి లేదు. అలాంటి ఈ భూమిమీద నలుగురిలో ఒకడిగా కాక నలుగురికోసం బ్రతుకుతూ జన్మరాహిత్యాన్ని పొందటమే ఉత్తమమైనమార్గం. మనంచేసే పాపపుణ్యాలను అనుసరించి స్వర్గనరకాలు కలుగుతాయి. పుణ్యంచేస్తే స్వర్గంలో సుఖాలను అనుభవించి "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" పుణ్యం క్షీణించినతరువాత తిరిగి భూలోకాన జన్మను పొందుతారు. మళ్ళీ కష్టాలు మొదలు. అలాకాకుండా శాశ్వతమైన భగవత్ సాన్నిధ్యసుఖాన్ని, జన్మరాహిత్యాన్ని మించిన మార్గం మరొకటి లేదు. భూలోకాన్ని మించిన స్వర్గం లేదు. పరమాత్మసేవతో జన్మరాహిత్యాన్ని పొందటమే లక్ష్యంగా చేసుకుంటే మనిషికి అంతకుమించిన స్వర్గం లేదు.

**ప్ర) పెళ్లిలో జీలకర్ర బెల్లం పెట్టడంలో ఆంతర్యమేమిటి?**

**జ)**పెళ్లిలో ముహూర్తసమయంలో వధూవరులిద్దరు జీలకర్ర బెల్లం కలిపి నూరిన ముద్దని ఒకరి శిరస్సుపై మరొకరు పెట్టుకుంటారు. ఆ తరువాత వారిద్దరిమధ్య గల తెరను తొలగిస్తారు. ఇద్దరు ఒకేసారి ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటారు. అదే సుముహూర్తసమయం. జీలకర్ర బెల్లం కలిపి నూరినందువలన ఒకరకమైన "పాజిటివ్ ఎలక్ట్రికల్ చార్జ్" ధనసంజ్ఞకమైన విద్యుత్తు ఉత్పన్నమవుతుందని పదార్థవిజ్ఞానశాస్త్రవేత్తలు ఉద్ఘాటించారు. దానిని శిరస్సున ఉంచినందున ఇరువురిమధ్య ఒకరకమైన అనుకూలత కలుగుతుంది అని నమ్మకం. తల్లిగర్భంలోనుంచి శిశువు బయటకు వచ్చేటప్పుడు ముందుగా శిరస్సు అంటే మాడుభాగం కనిపిస్తుంది. ఆ భాగంలో సహస్రారచక్రం, బ్రహ్మరంధ్రం ఉంటుందంటారు. వివాహసమయంలో వధూవరులిద్దరు పెట్టుకునే జీలకర్ర బెల్లం ఆ సహస్రారచక్రంనందుంచినందు వల్ల కలిగిన (పాజిటివ్‌శక్తి)తో అనుకూలత కలిగి ఉంటారని ఒక నమ్మకం. జీలకర్ర ముసలితనాన్ని రానివ్వదు. బెల్లం అమృతత్వాన్ని కలిగిస్తుంది. అంతేకాక జీలకర్ర తన ఆకారాన్ని మార్చుకోకుండా ప్రతివంటకంలో కలిసి ఒక అద్భుతమైన సువాసన, రుచిని ఇస్తుంది. బెల్లం నీటిలో మిగలకుండా పూర్తిగా కరిగిపోతుంది. భార్యాభర్తలిద్దరు నీరు, బెల్లంలాగా ఒకరిలో ఒకరు పూర్తిగా లీనమైపోయి, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ జీలకర్రలా తమ అస్తిత్వాన్ని కోల్పోకుండా కలకాలం కలిసి ఉండాలని "ధ్రువంతే రాజా వరుణో ధ్రువందేవో బృహస్పతిః!" అనే వేదమంత్రోచ్చరణములతో, ముక్కోటిదేవతల ఆశీర్వచనములతో మంగళకరమైన జీలకర్ర, బెల్లం పెట్టడంలోని ఆంతర్యమిదే.


**ప్ర) జాతకంలో గురువు బలంగా ఉంటే పనులు సక్రమంగా అవుతాయంటారు నిజమేనా?**

**జ)** జ్యోతిషశాస్త్రంప్రకారం దేవతలగురువైన బృహస్పతిని నవగ్రహాలలో ఒకటైన గురుగ్రహంగా పరిగణిస్తారు. గురువు విద్య, జ్ఞానం, క్రమశిక్షణ, అదృష్టానికి సంకేతం అంటారు. ఆరోగ్యాన్నికూడా సూచిస్తాడు. జాతకంలో గోచారరీత్యా గురువు స్థానం అనుకూలంగా లేకపోతే సంపద కోల్పోతారు. గురువు ఉన్నతస్థానంలో ఉంటే వృత్తి, ఉద్యోగం కలిసి రావటమేకాకుండా జీవితంలో ఎదురైన ఎంతటి జటిల సమస్యలనైనా సులభంగా అధిగమిస్తారు. గురుబలంకోసం విష్ణుసహస్రనామస్తోత్రాన్ని పఠించాలి.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



## గతసంచిక తరువాయి..

చంద్రరేఖ కనుమరుగు కావడంతో మాధవుడు నదీతీరంలోని చండాలస్త్రీవైపు అడుగులు వేశాడు. తనకేసి వస్తున్న మాధవుని పరిశీలనగా ఆ కన్యక చూసింది. అతని వర్చస్సు, వేషం అన్నీ చూసి, తనకేసి వస్తున్నవాడు బ్రాహ్మణుడని గుర్తించి, ఎదురుగా నిలబడడమెందుకని ప్రక్కకు తప్పుకొంది. అయినా మాధవుడు చండాలస్త్రీవైపే రావడంచూసి "భూసురా! నీవెవరవో నేను గుర్తించాను. నీవు బ్రాహ్మణుడివిగా కనిపిస్తున్నావు. అంచేత నీకు ఎదురుపడకుండా వెనక్కి వెనక్కి నడుస్తు న్నాను. నేనెవరో అని నీవు ఆలోచించినట్లు కనబడదు." అన్నది.

"నీ పేరేమిటి?" అని బ్రాహ్మణుడు తన వలపు ప్రదర్శితమయ్యేలా ప్రశ్నించాడు.

"నేను కుంతలను. మీలాంటివారు నాకేసి రావడం, ఒళ్లంతా కళ్లు చేసుకుని ముందడుగు వేయడం బాగు కాదు. అయినా, నేను నీచజాతిస్త్రీని" అని తన గురించి పరిచయం చేసుకుంది. అపుడా బ్రాహ్మణుడు "కుంతలా! నీవు సుందరాంగివి. నీలాంటి స్త్రీని బ్రహ్మ అంత్యజాతిలో పుట్టించడమేమిటి? నీ యవ్వనమంతా అడవిలో వెన్నెల కాచినట్లుగా ఉంది. కుంతలా! సాగరగర్భంలోని రత్నాలను దేవాదిదేవతలు తలపై శిరోమణులుగా పెట్టుకునేలాగా నేను నిన్ను పెళ్లాడ దలచుకున్నాను. నీ పొందు నాకు కావాలి" అని తన కోరికను బహిర్గతం చేశాడు.

ఈ రకం ఎదురుచూడని చండాలస్త్రీ ఖంగుతిన్నది. అయినా, తమాయించుకుంటూ "బ్రాహ్మణోత్తమా! నేను జారకాంతను. మహావిషసర్పమని తెలిసికూడా నీవు కాముకుడవై నా జోలికి రావడం సబబు కాదు. నిన్నే నమ్మిన నీ భార్య ప్రస్తుతం నీకు గుర్తుకురాలేదా? నాతో వియ్యమాడాలనుకుంటున్నావా? నీచస్త్రీతో పొందుకోరితే ఇహానికీ, పరానికీ చెడ్డవాడ వౌతావు. అంచేత మాటలు చాలించి, తొందరగా ఇంటికేసి వెళ్లమని సలహా ఇచ్చింది. అయినా మాధవుడు ఆ చోటు నుండి కదల్లేదు. చివరకు కుంతల మరో ప్రయత్నం చేద్దామనుకుంది.

"మహాత్మా! సృష్టికోసం ప్రాణులతో దేవుడు స్త్రీ, పురుష విభాగం చేశాడు. మానవసమాజం సక్రమంగా ఉండడాని కోసం నాలుగువర్ణాల వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఏ జాతి పురుషుడు ఆ జాతి స్త్రీలను పెళ్లాడితే ఆలాంటివారి సంతానం ఆనందంగా ఉంటుందని ఒక చక్కటి వ్యవస్థకూడా ఏర్పాటు చేశాడు. అంతేకాదు. ఏ జాతివారికైనా పరస్త్రీసంగమం, పరపురుషసంగమం ధర్మవిరుద్ధమే అవుతుంది. నీవు బ్రాహ్మణుడివి. ఇతరులకంటే ధర్మాధర్మాలు బాగా తెలిసినవాడివి. చండాలస్త్రీ సంగమం తగదని నీకు బాగా తెలుసు. అయినా ఒక మాట. జన్మచేత నీవు ప్రథమవర్ణంలో పుట్టినవాడవు. నీ దేహం వేదపూతం. సత్క్రియలకారణంగా నీవు పరమపవిత్రుడివి. మరి నేనేమో పంచమకులానికి సంబంధించినదానిని. అపవిత్రురాలిని. ఎన్నివిధాలా చూసినా నా తోడి సమాగమం తగదు తగదు" అని బ్రతిమాలింది.

కుంతల మాటలన్నీ మాధవునిలో ఏ పరివర్తనం తీసుకురాలేకపోయింది. నదీతీరం కావడంతో మాధవుడు ఆమెను లోబరచుకోవాలనే ముందడుగు వేశాడు. అక్కడి ఏకాంతం మాధవునికి కొండంత ధైర్యమిచ్చింది. ఇవన్నీ చూస్తున్న కుంతల చివరగా "దిగ్దేవతలారా! శిష్ట బ్రాహ్మణుడొకడు కర్మవశాన నా పొందు కోరుతున్నాడు. తెలిసి తెలిసి నరక కూపంలో పడడానికి సిద్ధమౌతున్నాడు. నా వలన ఎలాంటి దోషం లేదు. ఇందుకు మీరే సాక్షులని నివేదించుకుంది. అయినా మాధవుడు "భామా! నా తపస్సు ఈనాడు ఫలించింది." *(ఇంకా ఉంది)*

# దేవగురువు

- శ్రీమతి ఎన్.సి.హెచ్.శ్రీలక్ష్మి

**గురువు శిష్యుడికి జ్ఞానోదయం చేసి, అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానకాంతులను పంచి, జీవితవిలువలను నేర్పుతాడు. శిష్యుడి ప్రత్యేక బలాలను, బలహీనతలను గుర్తించి, ఆచరణాత్మకసలహాలు, ఆధ్యాత్మికసాధనలు, నైతికబలాన్ని అందిస్తాడు. గురువు శిష్యుడిని మోక్షానికి నడిపిస్తాడు. అర్థవంతమైన జీవితాన్ని గడపడానికి మార్గం చూపిస్తాడు. గురువు శిష్యుడికి నిజమైన వెలుగును చూడటానికి సహాయం చేస్తాడు. మరి సామాన్యమైన గురువే ఇంతటి ఘనతను కలిగి ఉంటే జనులంతా పూజించే దేవతలయొక్క గురువు ఇంకెంతటి విశిష్టతను కలిగి ఉంటాడో కదా. అలాంటి దేవగురువు అయిన బృహస్పతిని గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

'బృహద్' అంటే పెద్ద లేదా గొప్ప మరియు 'పతి' అంటే రక్షకుడు. అందుకే బృహస్పతి అంటే గొప్ప రక్షకుడు. అతణ్ణి గురువు, జీవ, దైవ, సుర గురువు మరియు దేవగురువు అనికూడా పిలుస్తారు. బృహస్పతిని వేద జ్యోతిషశాస్త్రంలో అత్యంత శుభప్రదమైన గ్రహంగా భావిస్తారు. మానవుల ప్రవర్తనను నిర్ధారించే నవగ్రహాలలో బృహస్పతి ఒకడు. బృహస్పతిని గురువు లేదా వాచస్పతి అనికూడా పిలుస్తారు. బృహస్పతి- వేదాలలో, అరవైనాలుగు కళలలో నేర్పరి. జ్ఞానం, ఆధ్యాత్మికత, సంపద, నైతికవిలువలకు ప్రతీకగా బృహస్పతిని కీర్తిస్తారు. నవగ్రహమండలానికి చెందిన పవిత్రమైన ప్రధాన గ్రహంగా; జ్ఞానాన్ని, పాండిత్యాన్నీ అందించే దైవంగా దర్శనమిస్తాడు.

దేవతలు తాము ఎంత శక్తివంతులు, ప్రజ్ఞావంతులు అయినా వారికి గురువు లేకపోతే తమ శక్తి పాటవాలు రాణించవని వారికి గురువుగా ఉండమని బృహస్పతిని అర్థించారు. బృహస్పతి తనకన్నా శుక్రాచార్యుడు లేదా తన సోదరుడు సంవర్తనుడు లేదా ఇతర పెద్దలు ఎందరో ఆ పదవికి తగినవారు అని సవినయంగా చెప్పాడు. కానీ దేవతలు ముక్తకంఠంతో మాకు గురువుగా ఉండాలి అని తీర్మానించారు. ఇంద్రుడు ఐరావతంమీద బృహస్పతిని తన ప్రక్కన కూర్చోబెట్టుకొని అప్సరసలందరూ నాట్యం చేస్తుండగా, దేవతలందరు స్వాగతసత్కారాలు చేస్తుండగా దేవేంద్రుడు బృహస్పతిని గురుపీఠంపై కూర్చుండబెట్టి దేవగురువుగా పట్టాభిషేకం చేశారు.

అప్పటినుండి బృహస్పతి దేవతలకు శిక్షణ, రక్షణ అందిస్తూ వారుచేసే యజ్ఞయాగాదులకు అసురులనుండి రక్షణ కల్పిస్తూ ఉన్నాడు. అందుచేతనే బృహస్పతి దేవతలకు గురువు, పురోహితుడుగా వ్యవహరించేవాడు. దేవతలు తనయందు ఉంచిన గౌరవానికి ప్రతిగా బృహస్పతి వారిని కంటికి రెప్పలా చూసుకుంటూ ఉండేవాడు.



**బృహస్పతి స్వర్ణమకుటం, సుందరమైన పూమాల ధరించి ఉంటాడు. పసుపుపచ్చని వస్త్రాలు ధరించి పద్మాసనంలో ఆసీనుడై ఉంటాడు. ఇతనికి నాలుగుచేతులు ఉంటాయి. బంగారురంగులో ఉంటాడు. నవగ్రహాల్లో ఐదవవాడు. గురువారం ప్రశస్తి. బృహస్పతి అత్యంత సౌందర్యవంతుడని ప్రాచీనఋగ్వేదంలో తెలుపబడింది. స్వర్ణంతో నిర్మించబడిన గృహంలో నివసిస్తాడు. ఇతని రథము కూడా స్వర్ణంతోనే నిర్మించబడి ఉంటుంది. అది సూర్యునితో సమానంగా కాంతిని విరజిమ్ముతుంటుంది. అందులో అన్నిరకాల సౌకర్యాలు ఉంటాయి. అది వాయువేగంతో పరుగులు పెట్టగలిగే ఎనిమిదిగుర్రాలచే నడుపబడుతుంది. ఇదేకాక ఏనుగుకూడా బృహస్పతి వాహనమే.**

విష్ణుభక్తుడైన ఉపరిచరవసువు అనే రాజు ఇంద్రుడికి మిత్రుడు. ఆయన బృహస్పతికి శిష్యుడై ధర్మశాస్త్రాలు నేర్చుకొని సుపరిపాలన చేస్తూ గురువుగారి అనుమతితో అశ్వమేధ యాగం చేశాడు. ఇంద్రుడుకూడా బృహస్పతిద్వారా సర్వధర్మాలు నేర్చుకున్నాడు. వసుమనుడనే రాజు బృహస్పతిని అడిగి రాజధర్మాలు తెలుసుకున్నాడు. రాజుకు ప్రజలే శరీరమని, ప్రజలకు రాజే ఆత్మ అని, రాజు లేకపోతే ఏమియూ లేనట్లే అని బృహస్పతి బోధించాడు. రక్షించటంలోను, అర్పించటంలోనూ రాజు, ప్రజలు ఇద్దరు ఒకరికొకరు సహకరించుకుంటేనే రాజ్యం శోభిస్తుందనీ, అలా చేయనప్పుడు ఆ రాజ్యం శోకిస్తుందని బృహస్పతి బోధించాడు. బృహస్పతిద్వారా మాంధాత గోదాన ఫలితాన్ని తెలుసుకున్నాడు. మాంధాతకు బృహస్పతి గోదానాన్ని ఎలా చేయాలో చెప్పాడు. ఒకరోజు ఉపవాసము ఉండి గోవులున్న ప్రదేశానికి చేరి ఒక రాత్రి, ఒక పగలు అక్కడ గడిపి మరునాడు ఉదయమే గోవును పేరుపెట్టి పిలిచి తన పాపాలన్నీ తొలిగేవిధంగా బ్రాహ్మణునిచేతిలో ఉదకాన్ని వదిలి గోదానాన్ని ఇవ్వాలి. కోపము విడిచినవాడే ఈ దానాన్ని తీసుకోవడానికి అర్హుడని తెలిపాడు. మాంధాత బృహస్పతి చెప్పినట్లుగా చేసి మోక్షాన్ని పొందాడు.

మంచి చేయటం, నిష్ఠగా ఉండటంవలన జ్ఞానయోగం కలుగుతుందని బృహస్పతి మనువుకు చెప్పాడు. ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే భగవంతుని చూడగలం. అలాగని మనస్సుకు పట్టుబడనంత మాత్రాన భగవంతుడు లేనట్టు కాదు అని బృహస్పతి అనేకవిధాలుగా జ్ఞానయోగంగురించి మనువుకు బోధించాడు. ఇంద్రాదిదేవతలకు కష్టనష్టాలు వచ్చినపుడు వారికి సరి అయిన సలహాలు ఇచ్చి వారి కష్టాలను బృహస్పతి తీర్చేవాడు.

జ్యోతిషశాస్త్రంప్రకారం దేవతల గురువుగా బృహస్పతి లేదా గురుడిని పరిగణిస్తారు. ఎందుకంటే గురుడు జ్ఞానం, క్రమశిక్షణ, అదృష్టానికి సంకేతం. అంతేకాకుండా బృహస్పతి ఆరోగ్యాన్నికూడా సూచిస్తాడు. జాతకంలో గురుడి స్థానం అనుకూలంగా లేకపోయినట్లయితే గౌరవంతోపాటుగా సంపదను కూడా కోల్పోవలసి వస్తుంది. నవగ్రహాల గురువుగా భావించే గురుడు.. విద్య, సంపద, జీవితం మొదలైన విషయాలను ప్రభావితం చేస్తాడు. జీవితంలో జరిగే ప్రతి శుభకార్యానికి బృహస్పతి ఉన్నతస్థానంలో ఉండాలి. వైదిక జ్యోతిషశాస్త్రంలో వారికి అనుకూలంగా ఉండటానికి మార్గాలు ఉన్నాయి. వీటిద్వారా జీవితంలో సమస్యలు ముగిసి పనిలో విజయం సాధిస్తారు. అంతేకాకుండా బృహస్పతిస్తోత్రం శుభఫలితాలను ఇస్తుంది.

జాతకంలో గురుబలం పెంచుకోడానికి, అదృష్టయోగం పట్టడానికి గురువారంరోజు సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం, ధ్యానం చేసి సూర్యభగవానునికి అర్ఘ్యం సమర్పించాలి. విష్ణుసహస్రనామస్తోత్రాన్ని పఠించాలి. ఇలా చేయడంవలన చేసేపనుల్లో విజయం లభిస్తుంది. జన్మజన్మల పాపం నశిస్తుంది. అంతేకాకుండా మరణం తర్వాత మోక్షం లభిస్తుంది. దీంతోపాటు జీవితంలో సమస్యలుకూడా అంతమవుతాయి. ఇలా పఠించడంద్వారా గురుస్థానం బలోపేతం అవుతుంది. ఫలితంగా సానుకూలఫలితాలు అందుకుంటాం.

## 2025, ఆగష్టు నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 02 | తరిగొండవెంగమాంబ వర్ధంతి |
| 04- 07 | శ్రీవారి పవిత్రోత్సవం, తిరుమల |
| 08 | ఆళవందార్ల వర్షతిరునక్షత్రం, వరలక్ష్మీవ్రతం |
| 09 | శ్రావణపూర్ణిమ, జంధ్యాలపూర్ణిమ, రాఖీపండుగ, శ్రీహయగ్రీవజయంతి, విఖనసమహాముని జయంతి |
| 10 | గాయత్రీజపం |
| 15 | భారతస్వాతంత్ర్యదినోత్సవం |
| 16 | కృష్ణాష్టమి, గోకులాష్టమి, ఆడికృత్తిక |
| 23 | పోలాల అమావాస్య |
| 25 | బలరామజయంతి, వరాహజయంతి |
| 27 | వినాయకచవితి |
| 28 | ఋషిపంచమి |

# పద్మ ఏకాదశి



– శ్రీమతి ప్రవీణ గంగరాజు

**చాతుర్మాస్యవ్రతం- వ్రతాలలో విశిష్టమైనది మరియు శ్రేయోదాయకమైనది. ఆషాఢశుద్ధఏకాదశితో ఈ వ్రతం మొదలై కార్తికశుద్ధఏకాదశితో పూర్తి అవుతుంది. ఈ రోజుల్లో విష్ణుమూర్తి పాలకడలిలో శేషశయనుడై యోగనిద్రలో ఉంటాడు. ఆషాఢశుద్ధఏకాదశిరోజున విష్ణువు యోగనిద్రకు ఉపక్రమిస్తాడు. ఈ ఏకాదశిని శయనఏకాదశి లేదా తొలిఏకాదశి అని పిలుస్తారు. నాలుగునెలల తరువాత యోగనిద్రనుండి విష్ణువు మేల్కొనే కార్తికశుద్ధఏకాదశిరోజును ఉత్థానఏకాదశి లేదా పద్మఏకాదశి అని అంటారు.**

చాతుర్మాస్యరోజులలో సూర్యభగవానుడు ఉత్తరాయణం నుంచి దక్షిణాయనానికి పయనిస్తూంటాడు. పగటివేళలు తగ్గి రాత్రివేళలు పెరుగుతూంటాయి. వర్షాకాలం అవడంవల్ల పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వ్యవసాయపనులు అంతగాలేక ప్రజలు ఎక్కువసమయం ఇళ్ళకే పరిమితమవుతారు. జనజీవనం కుంటుపడి, జీర్ణశక్తితగ్గి, వాతావరణంలో వచ్చేమార్పులవల్ల అనారోగ్యాలబారిన పడకుండా ఉండడానికి విజ్ఞులైన మన పూర్వీకులు మనకు చాతుర్మాస్యవ్రతాన్ని చెప్పారు. ఈ చాతుర్మాస్యరోజుల్లో ఊరి పొలిమేరలు దాటరాదని, ఏ ఊరివారు ఆ ఊరిలోనే ఉండాలని; శ్రావణ మాసంలో వంకాయ, ఆకుకూరలు; భాద్రపదంలో పెరుగు, పులుపు పదార్థాలు; ఆశ్వీయుజంలో పాలు-సంబంధిత పదార్థాలు; కార్తికంలో పప్పుదినుసులు ఉపయోగించరాదన్నది ఒక నియమం.

ఆషాఢశుద్ధఏకాదశినుండి కార్తికశుద్ధద్వాదశివరకు గల చాతుర్మాస్యరోజులలో స్త్రీలు విశేషఫలప్రదమైన గోపద్మవ్రతాన్ని చేసుకోవడం కద్దు. ఈ వ్రతాన్ని చేసుకునే సుమంగళీస్త్రీలు తెల్లవారకమునుపే నిద్రలేచి వారి వారి గోశాలలను పరిశుభ్రపరిచి, కళ్ళాపితో నీళ్ళుజల్లి ముగ్గులతో అలంకరిస్తారు. గోశాల ఉన్నవారు గోశాలలోనే పూజ చేసుకుంటారు. గోశాల లేనివారు తమ గృహంలో ఒక గదిని గోమేథంతో శుభ్రంగా అలికి ముగ్గులతో గోవు, గో దూడ చిత్రాలను వేస్తారు. గోశాలలో/ ఆ ఇంటిగదిలో రంగవల్లులతో 33 పద్మాలను తీర్చిదిద్దుతారు. ముగ్గులోని గోవుశరీరంపై మోహినీదేవతలకు ప్రతీకగా 6 పద్మాలను వేస్తారు. పూజాప్రదేశంలో గ్రద్ద, విష్ణుపాదం, శంఖచక్రాలు, గద, పద్మములు, స్వస్తిక్, బృందావనం, వేణువు, వీణ, తబలా, రామునిఊయల, సీత చీరఅంచు, తులసిఆకు, ఏనుగు, భటులు, చెఋవులు, నదులు, వివిధదేవుళ్ళచిత్రాలుకూడా గోశాలలో లేదా ఇంటిగదిలో ముగ్గులతో వేస్తారు. ముక్కోటిదేవతలూ ఆవులో కొలువై ఉంటారని హిందువులనమ్మకం.

పూజ ప్రారంభించి గోవురూపమునకు 33సార్లు అర్ఘ్యం ఇస్తారు. మోహినీదేవతలప్రతిరూపంగా గోవు శరీరం మీద వేసిన 6పద్మాలకు నమస్కరిస్తూ 6సార్లు ప్రదక్షిణం చేస్తారు. ఈ మోహినీదేవతలకు 6సార్లు అర్ఘ్యం ఇస్తారు. ముగ్గులతో వేసిన 33 పద్మాలచుట్టూ 33సార్లు ప్రదక్షిణలు చేసి గోమాతకు నమస్కరిస్తారు. 33సార్లు హారతి ఇస్తారు. ముగ్గులకు పుష్పాలతో అర్చనచేసి చక్కెర, ఇతర తీపిపదార్థాలను నైవేద్యం పెడతారు. గోపద్మవ్రతంకథను చదువుకొని తలపై అక్షతలు వేసుకుంటారు. తీపిపదార్థాలను ముందుగా సోదరులకు, ఆ తరువాత ఇతరులకు వాయనంగా ఇస్తారు. ఈ విశిష్టమైనవ్రతాన్ని చాతుర్మాస్యదినాలలో ప్రతిరోజూ చేస్తే విశిష్టమైనఫలం ఉంటుందని అంటారు. ఈ వ్రతం 5 సంవత్సరములు క్రమం తప్పకుండా చేస్తారు. గోపద్మవ్రతం చేసుకున్న తరువాత ఈ క్రిందికథను చెప్పుకుంటారు.

ఒకసారి అప్సరస రంభ నృత్యం చేస్తూండగా సంగీత వాద్యమైన తబలా బ్రద్దలై అపస్వరం వచ్చింది. అప్పుడు దేవేంద్రుడు గోపద్మవ్రతం చెయ్యని స్త్రీ ఎవరైనా ఉంటే ఆమె చర్మాన్ని తెచ్చి తబలాకు అమర్చమని యమధర్మరాజుకు చెప్పాడు. యమభటులు లోకమంతా వెతికి తిరిగివచ్చి యముడితో గౌరి, సావిత్రి, అనసూయ, ద్రౌపది, అరుంధతి, సరస్వతి మొదలైనవారందరూ గోపద్మవ్రతం చేసుకున్నారని.





ఒక్క శ్రీకృష్ణుని సోదరి సుభద్రఇంటిలో గోపద్మవ్రతం ముగ్గు లేదని చెప్పారు. అదివిన్న యమధర్మరాజు సుభద్రచర్మాన్ని తెచ్చి తబలాకు అతికించమని చెప్పాడు. నారదుడిద్వారా ఈ సమాచారం విన్న శ్రీకృష్ణుడు 'గో పద్మ ముగ్గు' ఎందుకు వెయ్యలేదని సుభద్రను అడిగాడు. సుభద్ర తనకు "సూర్యచంద్రులవంటి ఇద్దరుసోదరులు, మహావీరుడైన భర్త, దేవకీ వసుదేవులైన తల్లిదండ్రులు ఉండగా దేనికోసం నేను ఈ వ్రతం చేయాలి? అని శ్రీకృష్ణుణ్ణి ప్రశ్నించింది. అదివిన్న శ్రీకృష్ణుడు సుభద్రతో "ఇప్పుడు అన్నీ ఉన్నప్పటికీ భవిష్యత్తుకోసం చేయాలి" అని ఆమెకు చెప్పి వ్రతముగ్గులను వేయించి ఆమెచేత గోపద్మవ్రతం చేయించాడు. యమభటులు సుభద్రను విడిచిపెట్టి ఉత్తరదిక్కుగా తలపెట్టి పడుకొనిఉన్న ఒకఏనుగు చర్మం తెచ్చి తబలావాద్యానికి అమర్చారు. ఆ విధంగా సుభద్ర మృత్యుపాశంనుండి తప్పించుకుంది.

గోపద్మవ్రతవిశిష్టతగురించి 'నారేళ్ళనాచి' కథ ఒకటి జనబాహుళ్యంలో వాడుకలో ఉంది. ఒకానొకసారి కైలాసంలో పార్వతీదేవి ఒకరోజున శివునిచెయ్యి మృదువుగా ఉండటం చూచి కారణమేమి? అని అడిగింది. పరోపకారం చేసేవారిచేతులు మృదువుగా ఉంటాయని శివుడు చెప్పాడు. అదివిని పార్వతి తానుకూడా పరోపకారం చెయ్యాలని మారురూపంలో భూలోకానికి వచ్చింది. అక్కడ ప్రసవవేదన పడుతున్న నారేళ్ళనాచి అనే గర్భిణికి చేయూతనిచ్చి ఆమెకు సేవచేసి పదకొండురోజుల తరువాత ఆమెకు సకలైశ్వర్యాలు ప్రసాదించి ఆమెను గోపద్మవ్రతం ఆచరించమని చెప్పి అంతర్ధానమైంది.

ఐదుసంవత్సరాలతరువాత పార్వతీదేవి ఒక వృద్ధురాలి రూపంలో నారేళ్ళనాచిఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఆమె గోపద్మవ్రతం చేసుకుంటోంది. వృద్ధురాలిరూపంలో ఉన్న పార్వతీదేవి ఆమెను త్రాగడానికి నీరు ఇమ్మని అడిగింది. తన పూజకు అంతరాయం కలిగించినందుకు కోపించిన నారేళ్ళనాచి అక్కడే ఉన్న తొట్టెలోని నీరు తాగమని కోపంతో కసురుకుంది. పార్వతీదేవి అవమానంతో శివుడివద్దకు వెళ్ళి నారేళ్ళనాచ్చికి ఐశ్వర్యం లేకుండా చెయ్యమని కోరింది. ఆమె గోపద్మవ్రతం చేయడంవలన ఆమెను శిక్షించలేనని శివుడు చెప్పాడు. విష్ణువుకూడా అదేమాట చెప్పాడు. అప్పుడు నారదుడు వెళ్ళి నారేళ్ళనాచికి ఆమెవల్ల జరిగిన అపరాధంగురించి చెప్పాడు. ఆ భక్తురాలు తనతప్పును తెలుసుకొని పూజచేసి గణపతికి ఉండ్రాళ్ళు, శివపార్వతులకు పాయసం నైవేద్యం సమర్పించి వారిని క్షమాపణలు కోరింది; వారి అనుగ్రహాన్ని పొందింది.

గోపద్మవ్రతం 5 సంవత్సరాలు క్రమంతప్పకుండా చెయ్యాలి. ప్రతిసంవత్సరం ఆషాఢశుద్ధఏకాదశిరోజున ప్రారంభించి కార్తికశుద్ధఏకాదశివరకు ప్రతీరోజూ పూజలుచేసి. ముగింపురోజైన ద్వాదశినాడు మొదటిసంవత్సరం పాయసం, రెండవసంవత్సరం 33 అతిరసములు, మూడవసంవత్సరం 33 అప్పములు, నాల్గవసంవత్సరం 33 మిఠాయిలు, ఐదవసంవత్సరం 33 హోళిగెలు (బొబ్బట్లు) శ్రీకృష్ణుడికి ముందుగా నివేదించి ఆ తరువాత 33 నాణెముల దక్షిణ తాంబూలములతో సోదరుడికి వాయనం ఇచ్చినట్లైతే గోవు ఆశీస్సులు పొందుతారని భక్తుల నమ్మకం.



2025, జూలై 29న
గరుడపంచమి సందర్భంగా...



# గరుడమేరుపచ్చ

- శ్రీ దేవులపల్లి భాస్కరరామశర్మ,
92907 30792

మహాలక్ష్మి, మహాగౌరీ, మహాసరస్వతి సమష్టిరూపం శక్తి కొలువై ఉండేది మరకతమణితో తయారుచేసిన మణిద్వీపంలోనే.

ప్రపంచవ్యాప్తంగా మరకతాలు భారతదేశంతో పాటు అనేక దేశాలలో లభిస్తాయి.

వేదాలలో మరకతంగురించి రెండు కథలు ఉన్నాయి. గరుడపురాణంప్రకారం సర్పరాజైన వాసుకి అను సర్పం బకాసురుని పిత్తాశయాన్ని సంగ్రహించి ఆకాశంనందు ఎగురుతున్నసమయంలో అదిచూసిన గరుత్మంతుడు వాసుకితో యుద్ధం చేశాడు. ఆ సమయంలో వాసుకి నోటిలోంచి పిత్తకోశం మలయపర్వతప్రాంతంపై పడిపోయింది. ఆ భాగాలు విడిపోయి పడిన ప్రదేశాలలో అంతా ఆకుపచ్చగా ప్రకాశించింది. అందులోని కొంతభాగాన్ని గరుత్మంతుడు స్వీకరించాడు. దాంతో గరుడుడు మూర్ఛపోయాడు. తిరిగి లేచిన వెంటనే ఆ భాగాలను బయటికి విడిచి పెట్టగా అవి పడిన ప్రదేశంలో పుట్టిన పచ్చలనే గరుడపచ్చలని అంటారు.

మరొకకథ ప్రకారం నలమహారాజుకు శనిగ్రహపీడ విముక్తి కలిగిన తదుపరి విష్ణుమూర్తిని ప్రార్థించి శివలింగమును ప్రసాదించమని కోరగా విష్ణుమూర్తి మరకతమును ఇవ్వడం జరిగింది. దానిని నలుడు ప్రస్తుత పాండిచ్చేరిలో ప్రతిష్ఠించినట్లుగా తెలుస్తోంది. అది ఇప్పటికీ పూజలందుకొంటున్నది.



మధురైలోని మీనాక్షి అమ్మవారివిగ్రహం మరకతంతో చేయబడింది. అంతేగాక విజయవాడ, పటమటలో గల మరకత రాజరాజేశ్వరి దేవాలయం అపురూపమైన శిల్పకళతో తయారైన దేవస్థానం. అమ్మవారి మూర్తి అపురూపమైన మరకతశిలతో (పచ్చ) చెక్కబడింది.



శ్రీకృష్ణదేవరాయులు శ్రీవారి ఆలయాన్ని సందర్శించి కెంపులు, పచ్చలు, వజ్రాలు, నీలాలు, మాణిక్యాలు, వైడూర్యాలు, గోమేధికాలతో పొదిగిన వజ్రకిరీటాన్ని కానుకగా సమర్పించారు. స్వామివారికి ఉన్న విశేషఆభరణాల్లో 500 గ్రాముల గరుడమేరుపచ్చ ప్రధానమైనది. ఉత్సవాల్లో శ్రీవారికి దీన్ని అలంకరిస్తారు.

శ్రీవేంకటేశ్వరసుప్రభాతస్తోత్రంలో స్వామివారు ధరించిన నవరత్నముల కాంతిగురించి వర్ణన కనబడుతుంది.

ప్రతిదినము నమస్కరించుచున్న శివుడు మున్నగు దేవతల కిరీటముల అగ్రభాగమునందు ఉన్నవియు, మిక్కిలి ప్రకాశించుచునట్టివియు ఐన నవరత్నముల కాంతిసమూహము వలన నీరాజనమును పొందుచున్నవేమో





మరకతమణి రత్నజాతిలో ప్రధాన భూమిక వహిస్తోంది. ప్రధానంగా ఈ మణి బుధగ్రహశాంతికి దోహదకారిగా ఉంటుంది. జ్యోతిషశాస్త్రమునననుసరించి విష్ణుమూర్తి బుధగ్రహానికి అధిష్ఠానదేవత. మరకతము ధరించిన శ్రీవిష్ణువును ధ్యానించినవారికి సకలసంపదలు, శుభాలు కలుగుతాయనటంలో ఎటువంటి సందేహం లేదు.

అనునట్లు శ్రీవేంకటేశ్వరుని పాదములను శరణు వేడుకుంటు న్నాను అని ఒక శ్లోకానికి అర్థం కూడా ఈ విధంగా చెప్పబడింది.

శ్రీవేంకటేశ్వరుడి మరకతము అని రచించిన అన్నమయ్య కీర్తనకూడా ఒకటి మనకు కనిపిస్తుంది.

ఆపద్బంధుడు వారి మాకు గలడు
దూపిలి తలచినా దోషహరము
గరుడుని నెక్కిన ఘనరేవంతుడు
గరుడకితనముగల రథుడు
గరుడడి తనకును గరియగు బాణము
గరమ నితడెపి ఘనగారుడము....

ఇతడు గరుత్మంతునిపై నెక్కిన రేవంతుడు, గరుడ ధ్వజము కలిగిన రథము నధిరోహించు దేవదేవుడు, తనకు గరుడుడే గురియగు బాణము, మహిమలో ఇతడే ఘనగారుడము (మరకతము) అని అర్థం.

సౌందర్యలహరిలోని 94వశ్లోకంలో అమ్మవారి మరకతమయ తాంబూల చర్వణ పేటిక వర్ణన కనబడుతుంది.

కలంకః కస్తూరీ రజనికర బింబం జలమయం
కళాభిః కర్పూరై ర్మరకత కరండం, నిబిడితమ్
అతస్య ద్భోగిన ప్రతిదినమిదం, రక్తకుహరం
విధిర్భూయో, భూయో నిబడయతినూనం, తపకృతే! ॥

“ఓ జగన్మాతా! లోకములలోని జనమంతా తమ అజ్ఞానమువలన, చంద్రమండలమని దేనిని భావించుచున్నారో, నిజమునకది చంద్రమండలము కాదని భావం. మరకత మణులచే చేయబడి తాంబూల చర్వణానికిగాను పచ్చకర్పూరం, ఏలకులు, లవంగాలు మొదలైన ద్రవ్యాలు దాచుకొనే భరిణె!” అని అర్థం.

మరకతము (పచ్చ) విలువైన ఆకుపచ్చని రత్నం. మరకతము నవరత్నములలో ఒకటి. అమరకోశంలో “గారుత్మతం మరకత వళ్ళీ గర్భోహరిస్మణి” అని వివరణ ఉంది. గరుత్మంతునివలన ఉద్భవించినది కావున “గారుత్మతం”, ‘రాయి’ నుండి ఉద్భవించినది కావున ఇది అశ్మగర్భ, పచ్చని రంగును కలిగి ఉన్నది కావున దీనికి హరిన్మణి, “పచ్చ”. “పచ్చలు” అన్న పేర్లు ఉన్నాయి.

## బుధగ్రహ స్తోత్రం

శ్లో॥ ప్రియంగు కళికాశ్యామం।
రూపేణ ప్రతిమం బుధం।
సౌమ్యం సత్వగుణోపేతం।
తం బుధం ప్రణమామ్యహం॥




"నాగ కాద్రవేయ శబ్దౌ మానుషాకారేషు ఫణా
లాంగూలాది యుక్తేషు దేవ యోనిషు భోగిషు వర్తతే"

పడగలు, తోకలు కలిగి, మానవరూపులుగా ఉన్నవారు పాములు. కావలసిన రూపం ధరించగలిగిన దివ్యశక్తి యుతులు, చందనవృక్షవాసులు, పర్వతప్రాంతనివాసులు, దేవయోనులు, శక్తివంతులు, ఇచ్ఛాగమనులు. ఇవి సాధారణంగా పాకే జంతువులు.

బ్రహ్మ ఆజ్ఞానుసారం కశ్యపప్రజాపతి- సర్వప్రాణులకు అంటే అన్నిరకాల జంతుజాతులకు జనకుడయ్యాడు. దేవతలు, దానవులు, దైత్యులు, పాములు, పక్షులు- ఇలా అన్నిటికీ పితృదేవుడు కశ్యపబ్రహ్మ. అన్నిజాతులలో 'సర్పం' కూడా ఒకటి.

"విషానికి విషమే విరుగుడు" అన్నట్లు పాములు ప్రాణాలు తీసేవే కావు- ప్రాణాలు పోసేవి కూడా. సర్పాలు విషజంతువులే కాదు- వరప్రదాతలు కూడా.

మహావిష్ణువుకి పానుపు ఒకరు. మహాశివునికి ఆభరణం ఒకరు. సూర్యభగవానుని కాలగమనరథానికి రజ్జువు ఒకరు. మహేంద్రునికి మిత్రుడు ఒకరు. కలిప్రభావనాశకుడు ఒకరు. సాగరమథనానికి యోక్త్రము ఒకరు. సర్పజాతి సంరక్షకులు ఒకరు. అందరూ దేవతామూర్తులే. ముల్లోకవాసులందరికీ ఆరాధ్యులే.

**ఆదిశేషుడు-** అమోఘమైన తపమాచరించి శ్రీమహావిష్ణువుకు పానుపుగా అమరి, వైకుంఠంలో శాశ్వతస్థానాన్ని సముపార్జించుకున్నాడు. నిత్యం శ్రీహరిసేవలో నిమగ్నమయ్యాడు. శ్రీవేంకటేశుని ఏడుకొండలలో ఒక "కొండ" అయ్యాడు. అఖండ తపశ్శక్తిసంపన్నుడు. నిరంతర ధర్మనిరతుడు. దైవసముడు.

**వాసుకి-** అనన్యసాధ్యమైన తపస్సుచేసి వాసుకి పరమశివుని మెడలో ఆభరణంగా మెరిసి, జన్మను ధన్యం చేసుకున్నాడు. సాగరమథనంలో సర్వసంపదను సంపాదించడానికి కవ్వపు త్రాడుగా నిలిచిన వాసుకి- లోకోపకారి. సర్పకులాన్ని రక్షించిన ఉదారుడు. స్వర్గలక్ష్మీవైభవ సముపార్జనకు తఱచబడే త్రాడుగా సహకరించిన త్యాగమూర్తి. సర్పరాజు, ప్రజారంజకుడు, కుటుంబ ప్రేమైకమూర్తి వాసుకి.

**తక్షకుడు-** మహావిషనాగుడు. "తక్షకుని విషానికి విరుగుడు లేదు" అని ప్రతీతి. "మద్విష నిహతుల కగునే బ్రదుకన్"- అని తక్షకుడే అన్నాడు. ఆ మాటే నిజమయింది.

నిజానికి తక్షకుడు సాధారణమైన పాము కాదు. కులపర్వతాల పొదరిళ్ళలోను, అడవులలోను, కురుక్షేత్రంలోను సంచరిస్తుంటాడు. బలదర్పపరాక్రమదక్షుడు. ఆగ్రహానుగ్రహ సంపన్నుడు. అభేద్యుడు. వాసుకి శేషాదులంతటి దివ్యశక్తి పరుడు. వారికి సముడు. ముల్లోకారాధ్యుడు. మానవాళిచేత నిత్యం పూజింపబడుతున్నాడు.

**కర్కోటకుడు-** మహా విషనాగుడు. తల్లి శాపానికి భీతిల్లి, అగ్నికాహుతి కాకూడదని తలచి, నీతిరహితమైనా- తెల్లనిగుర్రంతోకకు నల్లనిమచ్చలాగా కనబడేటట్లు- ఆ తోకకు చుట్టుకొని, తల్లికోరిక తీర్చి, శాపదూరుడై, చిరంజీవి అయ్యాడు. దివ్యనాగుడు. వరప్రదాత. కర్కోటకుని కీర్తిస్తే కలిభయాలు తొలగిపోతాయి.

**అశ్వసేనుడు-** అశ్వసేనుడు పాము. తక్షకుడి కొడుకే అయినా తపశ్శక్తిసంపన్నుడు కాదు. మాయాదక్షుడు కాదు. మహిమోపేతుడు కాదు. కేవలం పగతోనే జీవించినవాడు.

సర్పం కనుక సర్పముఖుడై- బాణరూపంగా మారి- అర్జునునిపై ప్రతీకారంతో అతని బద్ధశత్రువైన కర్ణుని ఆశ్రయించి, అర్జునుని తుదముట్టించాలని ప్రయత్నించి, చివరికి తానే అర్జునుడిచేతిలో హతుడయ్యాడు. పగ ఎప్పటికీ, ఎవరికీ క్షేమం కాదు. పామే అయినా కూడా పగ మంచిది కాదు. “పగ అడగించుటెంతయు శుభంబు అది లెస్స” - అన్నాడు ధర్మమూర్తి యుధిష్ఠిరుడు. అందుకు విరుద్ధంగా మనసులో పగతో రగిలిపోయేవారు- ఏనాటికైనా ఆ పగకే ఆహుతైపోతారు. అందుకు ప్రబల ఉదాహరణ ఆ అశ్వసేనుడు.

**నహుషుడు-** ఈ అజగరంవల్లనే ఎన్నో పరమార్థాలు ధర్మజునిద్వారా మనకందాయి. దానం, పరోపకారం, సత్యం, అహింస- అనే నాలుగూ సమానమైన మహాధర్మాలు. అయినా వాటిలో అహింస మరీ గొప్పది. సద్గుణాలు కలిగి అహింసను ఆచరించినవాడు దేవజన్మను పొందుతాడు. హింసాపరుడు జంతువుగానో, రాక్షసుడుగానో జన్మిస్తాడు. ఇంకా ఇంకా హింస చేస్తూనే ఉంటాడు. పాపాలు పెంచుకుంటూనే ఉంటాడు. అందుకే ఎప్పుడూ పుణ్యకార్యాలే చేస్తూ, హింసకు దూరంగా ఉంటూ, తనను తాను అదుపులో పెట్టుకుంటూ ఉండాలి. అదుపు తప్పి ప్రవర్తించినందుకే దేవేంద్రనిభుడైన నహుషుడంతటివాడుకూడా భయంకరమైన కొండచిలువగా మారి ఎంతోకాలం అరణ్యంలోనే పడి ఉన్నాడు. అమరలోక పాలకుడిగా ఉండవలసినవాడు అడవిజంతువులను పట్టి తింటూ గడపవలసి వచ్చింది. మనసును నిగ్రహించుకుంటే చాలు- పాపకృత్యాలు చేయలేము- అన్న మహావిషయానికి నిదర్శనం ఈ (నహుషుడు) కొండచిలువ.

**పద్ముడు-** పద్ముడనే సర్పరాజు ఇంటికి భృగువనే విప్రుడొకడు ఆత్మసందర్శనా మార్గాన్ని తెలుసుకోవడానికి వచ్చాడు.

భృగువు “సృష్టిలోని ఆశ్చర్యాల”ను తెలుపుమని అడిగాడు. అందుకు ఉప్పొంగిన పద్ముడు....

మహాద్భుతమైన సృష్టిరహస్యాలు, ఎంతకూ అంతుపట్టని పరమార్థాలు, సృష్టి లక్షణాలు అనేకానేక అద్భుతాలను వివరించాడు.




ఒక తపశ్శాలిని కేవలం తన వాక్కులతోనే తత్త్వజ్ఞుని చేసిన పరమ తత్త్వవేత్త. పరమ భక్తాగ్రగణ్యుడు. (సృష్టి) కాలగమనానికి పరమాత్ముని చేతిలోని తాడు. ఉత్తముడు. ఉదాత్తుడు. ధర్మవేత్త. దయాశాలి. సజ్జన సంకీర్తనాపరుడు. నిత్య పుణ్య కార్యాచరణుడు. అతిథిసత్కారప్రియుడు. అతిథి ప్రియుడు. నిరంతర దేవతార్చనాపరుడు. అంతటి మహోదాత్త సుగుణశీలి “ఒక పాము”.

**జరత్కారువు-** తనవారికోసం తపించిన వాసుకికి తగిన చెల్లెలు జరత్కారువు. వినయసంపన్న. సకల సద్గుణోపేత. సర్పకుల రక్షణకోసం వాసుకి నిర్ణయించిన జరత్కారుడనే సనామ్నుని, మునీంద్రుని వివాహమాడింది. నిజగుణసంపత్తితో పతిని అహర్నిశం సేవించి, పతివ్రతామతల్లిగా భర్త అనుగ్రహాన్ని పొందింది. సర్పయాగాగ్నిలో పడి తన సోదరులంతా దగ్ధమై పోతూంటే- అన్న వాసుకి కోరికను తెలిపి- ఆ యాగాన్ని మాన్పించమని పుత్రుని ఆదేశించింది. జీవితాంతం భర్తతో ఉండలేకపోయినా, సహోదరులను చావకుండా బ్రతికించి మాతృవంశఋణం తీర్చుకున్నది జరత్కారువు. సర్పజాతిలో పుట్టి, మహర్షివంశంలో మెట్టి ధర్మం తప్పకుండా చరించి ఇరువంశాలవారికీ కీర్తి తెచ్చిపెట్టింది.

**ఉలూచి-** ఐరావతవంశంలోని కౌరవ్యుడనే నాగుని పుత్రిక ఉలూచి. జగదేకవీరుడు, మనోహరాకారుడు అయిన అర్జునుని రూపలావణ్యాలకు మురిసి, గంగానదిఒడ్డున ఉన్న అతనిని ప్రేమించిన పతిచేతనే ప్రశంసలందుకున్న సాధ్వీమణి ఉలూచి. శత్రుమూర్తి అయిన ధృతరాష్ట్రునిచేతకూడా ఉలూచివంటి ఒక్కకోడలికికూడా నేను నోచుకోలేదు అంటూ ప్రశంసించబడింది. ఉలూచిది ప్రణయ దాంపత్యం. ఇంతటి పతిప్రేమ, పతిసేవ, పతిప్రణయం కలిగిన ఉత్తమ ఇల్లాలు మానవకాంత కాదు. నాగిని.

నిజానికి నాగులకు, మానవులకు జాతివైరంకూడా ఉంది. మానవులే కాదు మానవేతరాలుకూడా ఎంత ద్వేషిస్తాయో అంత ప్రేమిస్తాయి అని చెప్పుకోవడానికి ఉలూచి ప్రణయమే ప్రబల తార్కాణం.

# గురుశిష్యులు

- డా॥ యస్.పద్మావతి, 96762 69300

**లోకంలో గురుశిష్యులు ఎందరో ఉంటారు. ఆదర్శవంతమైన గురుశిష్యులు కొందరే ఉంటారు. అలాంటి ఆదర్శవంతమైన ఉత్తమ గురుశిష్యులలో ముఖ్యులు దైత్యగురువు శుక్రాచార్యుడు, వారి శిష్యుడు కచుడు.**

శుక్రుడు బ్రహ్మమానసపుత్రుడైన భృగుమహర్షి సుతుడు. తల్లి ఉశనల. శుక్రాచార్యుని భార్య ఇంద్రుని కుమార్తె జయంతి. వీరి కుమార్తె దేవయాని. దైత్యరాజైన వృషపర్వుని ఆస్థానంలో కులగురువుగా ఉండేవాడు శుక్రాచార్యుడు.

పూర్వం దేవదానవులమధ్య పోరు నిరంతరం కొనసాగేది. దేవతలచేతుల్లో దానవులు అనేకులు మరణిస్తూండేవారు. అప్పుడు దైత్యగురువు శుక్రాచార్యుడు దైత్యుల క్షేమం కోసం తపస్సుచేసి శివునిమెప్పించి మృతసంజీవనివిద్యను పొందాడు. ఆ విద్యతో మరణించిన దైత్యులను బ్రతికించ




సాగాడు శుక్రాచార్యుడు. ఆ ఆనందంతో రాక్షసులు దేవతలను విచ్చలవిడిగా వధించేవారు. దాంతో దేవతలసంఖ్య నానాటికి తగ్గిపోసాగింది. రాక్షసులసంఖ్య మాత్రం స్థిరంగా ఉంది.

అప్పుడు దేవతలు తాముకూడా మృతసంజీవని విద్యను పొందితేనేగాని రాక్షసులబారినుండి తప్పించుకోలేము, బ్రతికి బయటపడలేము కాబట్టి ఎలాగైనా శుక్రునినుండి మృతసంజీవనివిద్యను నేర్చుకొనితీరాలి అని భావించి శుక్రాచార్యునినుండి ఆ విద్యను నేర్చుకొని రావడానికి దేవగురువు బృహస్పతి కుమారుడైన కచుడిని నియోగించారు.

కచుడు వినయవిధేయతలు కల్గినవాడు, గొప్ప సంస్కారవంతుడు, శాంతస్వభావుడు, ధర్మాధర్మవిచక్షణ తెలిసినవాడు, స్ఫురద్రూపి, మృదువుగా మాట్లాడేవాడు. దేవతల సూచనమేరకు కచుడు శుక్రునివద్దకు వెళ్ళి ఆయనకు నమస్కరించి వినయవిధేయతలతో, మృదుభాషణంతో శుక్రుని మెప్పించి అతనివద్ద శిష్యుడుగా చేరాడు.

తమకు బద్ధశత్రువులైన దేవతలగురువైన బృహస్పతి పుత్రుడే ఈ కచుడు అని శుక్రాచార్యునికి తెలుసు. అయినా అతడు శత్రుపక్షంవాడని శంకించకుండా కచుడిని శిష్యునిగా స్వీకరించాడు శుక్రాచార్యుడు. తన శిష్యులందరికీ నేర్పుతున్న విద్యలను కచునికి నేర్పించసాగాడు. కచునిపై ఎలాంటి శత్రుభావమూ చూపలేదు శుక్రాచార్యుడు. కచుడుకూడా ఏ శత్రుభావమూ లేకుండా గురువును సేవించేవాడు. సపర్యలు చేసేవాడు. గురుపుత్రియైన దేవయానికికూడా సాయం చేసేవాడు. క్రమేణా తన మంచితనంతో, మృదుభాషణంతో గురువుతోపాటు గురుపుత్రి దేవయాని మనసుకుకూడా దగ్గరయ్యాడు. స్ఫురద్రూపి, మృదుభాషి అయిన కచునిపట్ల అనురాగం పెంచుకుంది దేవయాని. ఇది ఆ రాక్షసపిల్లలకు

## శ్రీగురుప్రార్థన

శ్లో॥ నిత్యానందైక కందాయ।
నిర్మలాయ చిదాత్మనే।
జ్ఞానోత్తమాయ గురవే।
సాక్షిణే బ్రహ్మణే నమః॥

సుతరామూ నచ్చేది కాదు. వీడివల్ల గరువుగారివద్ద ఉన్న మృతసంజీవనివిద్య దేవలోకం చేరుతుందేమోనని భావించి కచునిపై ద్వేషం పెంచుకున్నారు ఆ రాక్షసపిల్లలు.

ఆ ద్వేషంతోనే వారు ఒకనాడు సమిథలకోసం అడవికి వెళ్ళిన కచుడిని అడవిలోనే వధించి చెట్టుకు వేలాడదీశారు. దేవయాని అభ్యర్థనమేరకు దివ్యదృష్టితో పరికించి విషయం తెలుసుకున్న శుక్రాచార్యుడు మృతసంజీవనివిద్యతో కచుడిని బ్రతికించాడు. కచుడిని తిరిగి దేవలోకానికి వెళ్ళనివ్వకూడదు. వానిని ఇక్కడే అంతం చేయాలి అని భావించిన ఆ రాక్షసులు కచుడిని మళ్ళీ వధించారు. వాడిని అలాగే వదిలేస్తే గురువుగారు మళ్ళీ బ్రతికించేస్తారు. కాబట్టి వీడిని ఇలా వదలకూడదు అనుకొని వాళ్ళు కచుని కళేబరాన్ని కాల్చి బూడిద చేసి సురతో కలిపి శుక్రునితో త్రాగించారు.

మరలా దేవయాని అభ్యర్థనమేరకు శుక్రాచార్యుడు మళ్ళీ తన దివ్యదృష్టితో చూసి సురతో కలిసి కచుడు తన

### మే నెల క్విజ్-34 సమాధానాలు

| | |
|---|---|
| 01) మాధవమాసం | 08) సరస్వతీనది స్నానం |
| 02) ప్రహ్లాదుడు | 09) మార్కండేయుడు |
| 03) చండుడు, అమర్కుడు | 10) శ్రీవేదాంతదేశికులు |
| 04) శ్రీసత్యనారాయణ వ్రతం | 11) తాళ్లపాక గంగమ్మ |
| 05) డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 12) కొవ్వు పదార్థాలు |
| 06) శివానందలహరి | 13) కుబేరుడు |
| 07) మూడు | 14) సర్పరాజైన వాసుకి |
| | 15) కన్నడహరిదాసులు |

ఎవ్వరూ సరైన సమాధానాలు వ్రాయలేదు

ఉదరంలో ఉన్నాడని తెలుసుకున్నాడు. తన ఉదరంలో ఉన్న కచుడిని మృతసంజీవనితో బ్రతికిస్తే తన ఉదరాన్ని చీల్చుకొంటూ అతడు బయటకు రావలసి ఉంటుంది. అలా తాను మరణిస్తే అప్పుడు తనను బ్రతికించాలంటే కచుడికి మృతసంజీవనివిద్యను నేర్పించడం ఒక్కటే మార్గం. అంతకుమించి వేరే దారి లేదు.. ఇప్పుడు కచుడికి మృతసంజీవనివిద్యను నేర్పడం శుక్రాచార్యుని అవసరమయ్యింది.

కనుక శుక్రుడు తన ఉదరంలో ఉన్న కచుడిని మృత సంజీవనివిద్యతో బ్రతికించి తన ఉదరం చీల్చుకొని బయటకు రాగానే తనను మృతసంజీవనివిద్యతో బ్రతికించేలా కచుని వద్ద మాట తీసుకొని కచునికి ఆ విద్యను నేర్పించాడు శుక్రాచార్యుడు.

వెంటనే కచుడు శుక్రుని ఉదరం చీల్చుకొని బయటకు వచ్చాడు. ఉదరం చీల్చబడి విగతజీవుడై పడిఉన్న గురువు గారిని మృతసంజీవనివిద్యతో బ్రతికించాడు కచుడు. అలా శుక్రుడు సజీవుడయ్యాడు. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లు కచునికి మృతసంజీవనివిద్య అయాచితంగా లభించింది. నేర్చిన విద్యను పరీక్షించుకునే అవకాశంకూడా అప్రయత్నంగానే దొరికింది. లోకకల్యాణంకోసం చేసేపనికి పరిస్థితులు అలా అనుకూలిస్తాయి మరి.

ఒక ఉత్తమశిష్యుడు ఉత్తమగురువువద్ద విద్యాభ్యాసం చేస్తే అనతికాలంలోనే గురువనుగ్రహం పొందగలుగుతాడు ఆ శిష్యుడు. శిష్యుడు బుద్ధిమంతుడు, ఉత్తముడు అయి ఉండి, గురువూ ఉత్తముడైతే గురువనుగ్రహం శిష్యుడు పొందగలిగితే ఆ గురువు నేర్పలేనిదేముంటుంది? శిష్యుడు నేర్వలేనిదే ముంటుంది?

వినయశీలుడై విద్యార్థి విద్యార్థి
కూర్మి విద్య నేర్పు గురువు గురువు

అన్న మహాకవులమాటకు నిజమైన, విలువైన నిదర్శనం ఈ గురుశిష్యులు. నేటి సమాజంలోకూడా ఇలాంటి ఉత్తమ గురుశిష్యులు ఉద్భవించి ఉత్తమపౌరులను అందివ్వాలని ఆశిద్దాం.



మనం నిజాయితీగా ఉన్నంతవరకు ఇతరుల ముందు నటించాల్సిన అవసరం లేదు

వ్యక్తిత్వ వికాసం

- శ్రీ వద్దిరాజు జనార్దనరావు,
99893 50596

# మానవుని మనీషిగా తీర్చిదిద్దే ఏకాదశ ప్రకాశిత లక్షణములు

**జీవితాలకి వెలుగులు పంచే మంచి లక్షణాలు కలిగి ఉండటం తెలుసుకోవాలి. వాటిని ఎలా అభ్యసించాలో, జీవితంలో ఎలా మెలగాలో అన్నవి అనేక కోణాల్లో ప్రబోధించే ఉపయుక్తమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఏకాదశ ప్రకాశిత లక్షణములగురించి తెలుసుకొని మనజీవితాల్ని సుసంపన్నం చేసుకుందాం.**

**1) అధికారంచేత సామర్థ్యం-** అధికారం గలవాడు రాజర్షులుగా ఉండాలి. రాజగుణంలో పాలనాసామర్థ్యం, ఋషిగుణంలో శాంతస్వభావం, భోగరాహిత్యం, సౌమ్యత్వం కలిగిఉండాలి. అటువంటివారే నిజానికి నాయకత్వశక్తిని కలిగిఉంటారు. ప్రజల్లో శాశ్వతంగా హృదయాల్లో నాయకులుగా నిలిచి ఉంటారన్నది లోకవిదితం.

ఇంద్రియాల్ని సమతుల్యంగా ఎలా ఉంచాలో నేర్చుకోవడం తెలిసినవాడు జీవితంలో విజయాన్ని సాధిస్తాడు. నాయకుడై అందరిలో నిలుస్తాడు.

**2) వస్త్రాభరణాలచేత సౌందర్యం-** శరీరానికి వేసే అభరణాలు, అలంకరణలు భౌతికంగా సౌందర్యాన్ని కలిగిస్తాయి. కానీ అవి కాలానుగుణంగా మారుతూ ఉంటాయి. అంటే అవి తాత్కాలికమే అని తెలుసుకుంటాం. నిజమైన వస్త్రాలు అంటే ఏమిటో తెలుసుకోవాలి. వీటి సౌందర్యంతో చిరస్థాయిగా ఎలా ఉండగలమో తెలుసుకోవాలి. సత్ప్రవర్తన, సత్యవాక్కు, ధర్మనిరతి మొదలైన సద్గుణాలు అనే వస్త్రాలద్వారా మనిషి స్వభావం తెలుస్తుంది. ఈ స్వభావం పోతే మనిషి అందవిహీనుడవుతాడు.

**3) సంపదలచేత మర్యాద-** సంపదలు ఒకటి లౌకికము. రెండు పారమార్థికమని చెప్పవచ్చు. లౌకికసంపదలు అశాశ్వతమైనవి. పారమార్థికసంపదలు శాశ్వతమైనవిగా ఉంటాయని సద్గుణసంపన్నుడు ఈ రెంటినీ తెలుసుకుని ప్రవర్తిస్తుంటాడు.

సద్గుణాలు అనే సంపదద్వారా వచ్చే మర్యాద అనలైనది. జ్ఞానం, సత్యం, ధర్మం, సత్ప్రవర్తన, పరోపకారపరాయణం, పెద్దలను గౌరవించడం, తల్లిదండ్రులను, గురువులను పూజించడం, బంధువులు, మిత్రులు, తోబుట్టువులను కలిగి ఉండడం, శాంతం, భూతదయ మొదలైన సద్గుణాలన్నీ సంపదలే. వీటివల్లే మర్యాద, గౌరవం వస్తాయి.

**4) దాతృత్వంచేత కీర్తి-** చేసిన పని శాశ్వతంగా నిలిచిఉండేలా చేయమని పెద్దలు చెబుతారు. అది మంచిపని అయి ఉండాలి. సమాజశ్రేయస్సు ఉన్నవి, పర్యావరణహితాన్ని కోరి ఉండాలి. అపుడే శాశ్వతమైన కీర్తి లభిస్తుంది.

**5) వినయంచేత గొప్పదనం-** ఎన్ని విజయాలు సాధించినా, ఎన్ని ఆస్తులున్నా, సంపాదించినా, విద్య ఉన్నా, అధికారం ఉన్నా, వినయం అనే సంపద ఉంటేనే గొప్పదనం చేకూరుతుంది. వినయానికి మారుపేరు వృక్షాలు అని చెప్పవచ్చు. అవి ఎంత ఎత్తు ఎదిగినా, ఎన్ని ఫలాలు, కాయలతో నిండి ఉన్నా అవి ఒదిగే ఉంటాయి. తమ ధర్మాన్ని అవి చేసుకుంటూపోతాయి. ఒకింత గర్వం ఉండదు వాటికి. వృక్షాలయొక్క గొప్పదనం తెలుసుకున్న మన ఋషులు వృక్షాలను గొప్ప నేస్తాలుగాను, ఔషధులు ఇచ్చే దేవతా మూర్తులుగాను తెలిపారు.

**6) వైరాగ్యంచేత జ్ఞానం-** వైరాగ్యం అనే గొడ్డలి సంసార వృక్షాన్ని ఛేదించడానికి పనిచేస్తుంది. జీవులను కర్మానుసారంగా

బంధించే మమకార, అహంకారాలనే వేళ్ళు, ఊడలు లోలోపల వ్యాపించి ఉన్నాయి. వీటి శాఖలు, ఆకులు, చిగుళ్ళు ఈ సంసారవృక్షానికి దట్టంగా ఉండి పురుషోత్తముని చూసే మార్గాన్ని కనబడకుండా చేస్తున్నాయి. జ్ఞానం అంటే భగవానుని తెలుసుకోవడమే. ఆ మార్గంలో పయనించడమే.

**7) భక్తిచేత భగవదనుగ్రహం-** పరిపూర్ణభక్తికి నిదర్శనంగా ఎటువంటి అనుమానము లేకుండా భగవంతుడు శ్రీమన్నారాయణుడు అన్నింటా వ్యాపించి ఉన్నాడన్న సత్యాన్ని చెప్పాడు తండ్రియైన దైత్యరాజు హిరణ్యకశిపునికి భయపడకుండా.

హరిభక్తి పుట్టుకతో వచ్చేదేగాని ఒకరు బోధిస్తేనో లేక తాను శాస్త్రాలన్నింటినీ స్వయంగా వల్లిస్తేనో లభించేది కాదని అన్నాడు. కొందరు విష్ణువును చూడలేరని తెలిపాడు. భయంకర ఈ సంసారసంద్రాన్ని దాటాలంటే శ్రీహరి పాదసేవ ఉండాలని ప్రబోధించాడు. ప్రహ్లాదబాలుని భక్తికి నారాయణుడే దిగివచ్చాడు నారసింహరూపం దాల్చి. తన భక్తిచేత ప్రహ్లాదుడు భగవదనుగ్రహం పొందాడు.

**8) ప్రియవాక్యంచేత వశ్యత-** ఇతరులు ఏమేమి చేస్తే తన మనస్సుకు అప్రియంగా ఉంటుందో ఆ పనులను తాను ఇతరులకు చేయకుండా ఉండటమే ఉత్తమమైన ధర్మం అని అర్థం. వాక్కు బలమైన ఆయుధంలాంటిది. దీనికి రెండు వైపులా పదును ఉంటుంది. మనం వాడే దానిపై ఆధారపడి ఉంటుంది. ఒక మంచిమాట ఎందరినో మిత్రులను చేస్తుంది. అందుకే "భాషణమ్ వాక్‌భూషణమ్" అని పండితులు ఉటంకించారు. ఒక మంచిమాట అమృతతుల్యమైంది. అదే చెడువాక్యం విషతుల్యమై శతృత్వం పెంచుతుంది. ఒకసారి వదిలిన వాక్కు బాణంలా దూసుకుపోతుందేగానీ మళ్ళీ వెనక్కురాదు. అందుకే ఆచితూచి మాట్లాడాలని పెద్దల ఉవాచ.

**9) సుగుణంచేత ధనసంపద-** కన్న తల్లిదండ్రులను పోషించినవాడునూ, విద్య జెప్పినవాడునూ, మంత్రము ఉపదేశించినవాడునూ, ఆపదలనమయుమునందు రక్షించినవాడునూ, దారిద్ర్యమును పోగొట్టినవాడునూ, భయమును పోగొట్టినవాడునూ, పడుచునిచ్చినవాడునూ, జ్ఞానమునుపదేశించినవాడునూ, రాజునూ, ఈశ్వరభక్తుడునూ మొదలగువారు దేవతలతో సమానమని శాస్త్రవచనం. అంతేకాదు ఈ సుగుణాలు ఐశ్వర్యంతో సమానమని తెలుపుతున్నారు. సుగుణాలు ఉంటే దేవతలుకూడా దీవిస్తారు. సమస్త భోగభాగ్యాలు ఇస్తారు.

**10) విద్యచేత సభామర్యాద-** విద్యయే రహస్యంగా దాచిన ధనం. ఎవరూ దొంగిలించలేనిది. విద్యాగరిమద్వారా పూజింపబడే మానవుడు ఎక్కడైనా రాణించగలుగుతాడు. విద్య అన్నింటికంటే గొప్ప ధనం అని పెద్దలు చెబుతారు. ఆ విద్యతో ఎక్కడైనా గెలుచుకు రాగలము. ఎందరో ఈరోజుల్లో దేశవిదేశాల్లో తమ విద్యాగరిమతో అత్యున్నతస్థానాల్లో ఉన్న సంగతి తెలిసిందే. తొలి గురువులు తల్లిదండ్రులే అని గ్రహించాలి. అందుకే మాతృదేవో భవ! పితృదేవో భవ!



ఆచార్యదేవో భవ! అని కీర్తించారు. వారు ప్రసాదించిన విద్యతోనే జ్ఞానం పొంది, విజ్ఞానంతో మర్యాదలందుకోవాలి.

**11) ఉపాయంచేత జయం-**ఉపాయం చేత అపాయముపై జయం పొందవచ్చు. బుద్ధిని ఉపయోగించి జయం పొందవచ్చు.



నీ ప్రవర్తనతో ఎంతమందిని ఏడిపించకుండా బ్రతుకుతావో అదే నీ నిజమైన జీవితం



# విద్యారంభం కరిష్యామి!!

- డా॥ మైలవరపు లలితకుమారి

ఆదిపరాశక్తి అంశతో జన్మించిన లక్ష్మీదేవి, పార్వతి, సరస్వతి మానవలోకంపై తమ దయాదృష్టులను ప్రసాదిస్తారు. లక్ష్మీదేవి ధనాన్ని, పార్వతి శక్తిని అందిస్తుంది. సరస్వతి మాత్రం వీటన్నింటినీ మించిన బుద్ధి, మేధ, కవిత, ప్రతిభ, స్మృతి, ధృతులను ప్రసాదించే విద్యాప్రదాత. విద్య లభించింది అంటే సమస్తము ఉన్నట్లే. కావలసిన ధైర్యస్థైర్యాలు సమకూరుతాయి. వాటివెంటే ప్రశాంతత, కీర్తిప్రతిష్ఠలు, ధనము, సుఖము, సంతోషము అన్నీ లభిస్తాయి. దేవగురువైన బృహస్పతినుండి నేటి గురువులదాకా ఆ సరస్వతీమాతను ప్రార్థించి జ్ఞానవంతులై కీర్తిప్రతిష్ఠలను పొంది ఆచంద్రతారార్కము చిరస్మరణీయులైనారు. అందుకే విద్యాభ్యాసానికి ముందు పిల్లలచేత -

**"సరస్వతీ నమస్తుభ్యం**
**వరదే కామరూపిణి!**
**విద్యారంభం కరిష్యామి**
**సిద్ధిర్భవతు మే సదా!!"**

అని సరస్వతీప్రార్థన చేయిస్తారు. ఆ తర్వాత నల్లని పలకమీద తెల్లనిబలపంతో "ఓం నమః శివాయః" అనే అక్షరాలను దిద్దిస్తారు. అయితే పలకలు లేని కాలంలో ఇసుకలో అక్షరాలు వ్రాసి దిద్దించేవారు. తర్వాత పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, కలాలు వచ్చాయి.

నల్లనిపలక అజ్ఞానానికి గుర్తు. దానిమీద తెల్లని బలపంతో రాసే అక్షరాలు జ్ఞానప్రదీపకాలు. అందుకని ముందుగా నల్లపలకమీద తెల్లని బలపంతో వ్రాయిస్తారు. అక్షరాలన్నీ వచ్చేదాకా చెరిపి మళ్ళీ వ్రాయటానికి వీలుగా గురువు పలకమీదనే వ్రాయిస్తారు. అందుకే-

**గుకారో అంధకారశ్చ**
**రుకారో స్తన్నిరోధః!**
**అంధకారవినాశిత్వ సాక్షాత్**
**గురురిత్యభిధీయతే!!**

అన్న ప్రమాణం వచ్చింది. ఆ తరువాత కాగితం, పెన్సిల్, కలం వచ్చి స్థిరంగారాసే అలవాటుని కలిగించాయి.

"ఓం నమః శివాయః" అన్న అక్షరాలలో కూడా ఎంతో అర్థం మిళితమై ఉంది. తల్లీ నీకు నమస్కారం. నాకు సంతోషాన్నివ్వు అని ప్రార్థించటమే. అక్షరాన్ని మించిన ఆనందం, చదువుని మించిన సంతోషం మరేమున్నది. మంచి చెడుల విచక్షణను తెలిపి మంచిమార్గాన నడిచేటట్లు చేసేది విద్య.

సరస్వతీదేవి వాహనము హంస. పాలను నీటిని వేరుచేసి పాలను మాత్రమే స్వీకరించే తెలివి కలిగినది హంస. అలాగే విద్యనేర్చిన వ్యక్తి మాత్రమే మంచిచెడుల వ్యత్యాసమును గ్రహించి మంచిని మాత్రమే స్వీకరించే జ్ఞానాన్ని ఇస్తుంది. మహాభారతంలో యక్షప్రశ్నలలో యక్షుడు ధర్మరాజును "ఉత్తమం కిమ్ స్యాత్" అని ప్రశ్నించగా, "ధనా ముత్తమ్ శ్రుతం" అని సమాధానం ఇచ్చాడు ధర్మరాజు. ధనానికన్నా ఉత్తమమైనది విద్య". ధనం ఇవాళ ఉండి రేపు పోవచ్చు. కానీ విద్య ఎప్పటికీ మనలోనే నిలిచి ఉండే ధనం. సరస్వతీమాత అనుగ్రహంవల్లనే విద్య లభిస్తుంది.

ఆ తల్లి అనుగ్రహంతో పూర్వము మహర్షులు సైతం సరస్వతీపుత్రులైనారు. బ్రహ్మముఖతః వెలువడిన వేదాలు ఆ

తరువాత ఒకరినుండి మరొకరికి ముఖతః సిద్ధించాయి. ఆ తరువాతయుగంలో కిరాతుడైన రత్నాకరుడు తపమాచరించి వాల్మీకిమహర్షిగా ఉద్భవించి శ్రీమద్రామాయణ రచన చేశాడు. ఆ కావ్యము–

**"యావత్ స్థాస్యంతిగిరయః సరితశ్చ మహీతలే!**
**తావద్రామాయణ కథా లోకేషు ప్రచురిష్యతి!!"**

సమస్తధర్మాలకు నెలవైన రామాయణము పంచ భూతాలు ఉన్నన్నాళ్ళు నిలిచి ఉంటుందన్నది మహర్షివాక్కు. ఆ తల్లి వాల్మీకినోట పలికించిన సత్యవాక్కు. అదే జ్ఞానవంతుడు, నిష్ణాతుడైన వాల్మీకిమహర్షి పలుకు. సరస్వతీనదీతీరాన ధ్యానమగ్నుడైయున్న వ్యాసమహర్షికి స్ఫురించగా దర్శించిన మహాకావ్యము మహాభారతం. భక్తి జ్ఞాన వైరాగ్యములు వెల్లివిరిసిన ఆధ్యాత్మికగ్రంథము శ్రీమద్ భాగవతము. అదీ తల్లి యొక్క గొప్పతనం. తలచినంతనే జ్ఞానాన్ని ప్రసాదించే జ్ఞానప్రదాయిని. అందుకే

**"తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా యుల్లంబునందుననిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దంబు శో భిల్ల బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్"**

అని ప్రార్థిస్తారు. అందుకే ఆ తల్లిని వాగ్దేవి అంటారు.

### వైకుంఠపాళి

### :: 114 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 తొ | లి | 2 ఏ | కా | ద | 3 శి | | 4 సు | | 5 వ్యా | |
| | | క | | | ష్టి | | 6 ప్ర | భా | స | ము |
| 7 ప్ర | మీ | ల | | 8 శ | | | భ | | పూ | |
| భా | | 9 వృ | షి | తా | శ్వ | డు | | 10 చూ | ర్ణి | క |
| క | | డు | | నం | | | | | మ | |
| 11 రు | మ | | 12 వి | దు | రు | డు | | 13 గ | | |
| డు | | 14 కా | | డు | | | 15 రు | రు | డు | |
| | 16 ప్ర | మి | ద | | | 17 మ | | డ | | |
| 18 సు | | క | | | 19 మ | ద | న | పం | చ | మి |
| 20 భ | య | | | | | ను | | చ | | |
| ద్ర | | 21 ము | చి | కుం | దు | డు | | 22 మి | థి | ల |

ధవళవస్త్రశోభితయై కుడి ఎడమల అక్షమాల, పుస్తకముల ధరించి, అభయహస్తముతో వీణాపాణియైన ఆ తల్లిని తలచినంతనే మనోవికాసము కలగటం తథ్యం. కావ్య రచనారంభకాలంలో చేసే ప్రార్థనచే కావ్యమాధుర్యం ఇనుమడిస్తుంది. వాల్మీకి, వ్యాస, నన్నయాదికవులందరూ ప్రార్థించినది ధవళవస్త్రశోభిత అయిన ఆ సరస్వతీమాతనే.

మన భారతదేశంలో కాశ్మీరం, బాసరా, శృంగేరీలలో సరస్వతీదేవి ఆలయాలు ఉన్నాయి. బాసరజ్ఞానసరస్వతిని అర్చించి వ్యాసుడు తపమాచరించిన వ్యాసగుహ నేటికీ అక్కడ ఉన్నదని ఒక ఐతిహ్యం. కాశ్మీరంలోగల సరస్వతీఆలయంలో వేదాంతగ్రంథాలు ఉన్నాయని ప్రతీతి. ఇవేకాక శంకరాచార్యులు సరస్వతిపీఠాన్ని ప్రతిష్ఠించి ఆ తల్లి దయను అందరికి అందించారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఆ తల్లిని నమ్ముకుంటే కీర్తిప్రతిష్ఠలకు, ధనసంపదలకు లోటు ఉండదని ఉవాచ. అందుకే

**"విద్వాన్ సర్వత్ర పూజ్యతే"**

అని అంటారు. విద్వాంసులైనవారు ఎక్కడికి వెళ్లినా పూజార్హులే కదా. భారతదేశం సకలసంపదలకు నిలయం. జ్ఞానం పుట్టింది ఇక్కడే. భగవంతుడు నరుడుగా అవతరించి నడయాడిన అవని. గురుశుశ్రూషచేస్తూ విద్యనేర్చుకున్న పుణ్యభూమి. అదీ సరస్వతీరూపమైన విద్యయొక్క గొప్పతనం. భగవంతుడు అన్నిచోట్ల తానుండలేక తల్లిని సృష్టించినట్లు, ప్రతి తావున తాను కనబడలేక మానవాళికి గురువును చూపించింది ఆ తల్లి. ఎక్కడో హిమాలయాలలో కొండలపైనుండి వేగంగా దూకుతూ ప్రవహించి చివరకు అంతర్వాహినిగా మారి దేశంలో ప్రవహిస్తున్నది. విద్య అంటే బయటకు కనిపించేది కాదు. అది మనిషి మేథ, జ్ఞానానికి సంబంధించింది కదా! విద్య పైకి కనిపించే భేషజరూపం కాదు. వేష భాషలకు కాక విద్వత్తుకు ప్రాధాన్యం ఇవ్వాలి. అపుడే ఆ తల్లి చల్లనిదృష్టితో మానవాళి పునీతులు కాగలరు.

**"ప్రణోదేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతి**
**ధీనామ విత్ర్యవతు"**

అని వేదములలో చదువులతల్లి సరస్వతిని స్తుతించారు. ఆ తల్లి దయయే మానవాళికి శ్రీరామరక్ష. అదే అభివృద్ధికి మూలం.

108 దివ్యదేశాలు

# నవతిరుప్పది నవతిరుపతులు


# శ్రీవైకుంఠం

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

పాండ్యరాజులు పరిపాలించిన మధురైనగరంనుండి తిరునల్వేలివరకు కనిపిస్తున్న దివ్యదేశాలను పాండ్యనాడు దివ్యదేశాలుగా వ్యవహరిస్తారు. తూత్తుకుడి జిల్లాకు చుట్టుప్రక్కల తొమ్మిదిక్షేత్రాలను కలిపి నవతిరుపతులు అంటారు. అందులో శ్రీవైకుంఠం అను ఈ దివ్యదేశం తిరునల్వేలినుండి తిరుచ్చెందూర్ వెళ్ళేమార్గంలో 26 కి.మీ.ల దూరంలో తామ్రబర్ణినదికి ఉత్తరదిక్కులో సుమారు 5 ఎకరాలస్థలంలో తూర్పుదిక్కును చూస్తూ, మూడుప్రాకారాలతో 110 అడుగుల ఎత్తైన తొమ్మిదిగదులున్న పెద్దరాజగోపురంతో, ప్రాకారాలతో విలసిల్లియున్నది. సంతానకృష్ణుడు, లక్ష్మీనృసింహుడు, తిరువేంకటముడయాన్, గరుత్మంతుడు, హనుమంతుడు మొదలగువారి ప్రత్యేక సన్నిధులతో ఈ ఆలయం శోభాయమానంగా విరాజిల్లుతున్నది.

ఈ ఆలయతీర్థం భృగుతీర్థం, తామ్రబర్ణితీర్థం మరియు కలశతీర్థం అని, సుందరవిమానం అని స్థలపురాణం చెప్తున్నది. సాధారణంగా ఆదిశేషునిపై భగవంతుడు పవళించి పలుదివ్యదేశాలలో దర్శనభాగ్యమును కలిగిస్తే, ఈ దివ్యదేశంలో మూలవర్లు ఆదిశేషుడు గొడుగుపట్టగా తూర్పుదిక్కును చూస్తూ, నిలచిఉన్నభంగిమలో వైకుంఠనాథుడు, కళ్ళపిరాన్ అనే తిరునామములతో సేవను ప్రసాదిస్తున్నారు.

చోరనాథః అని ఈ స్వామిని వ్యవహరిస్తారు. అట్లే అమ్మవారు వైకుంఠవల్లి, భూమిదేవి, చోరనాయకి అనే దివ్య నామములతో కూర్చున్నభంగిమలో భక్తులను అనుగ్రహిస్తున్నది. వైకుంఠనాథుడు అనేఅద్భుతమైన పేరును కల్గిన ఈ స్వామికి చోరనాథుడు అను పేరు ఎలా వచ్చింది అను విషయం చాలా ఆసక్తికరమైనది.



**స్థలపురాణం-** నమ్మాళ్వార్లు ఒక పాశురంలో ఈ స్వామిని స్తుతించారు. వైకుంఠనాథుడు కాలదూషకుడు అనే చోరుని అనుగ్రహించటానికి తానే ఒక చోరునిగా మారాడట. కాలదూషకుడు అనే ఒక దొంగ ప్రతిరోజూ దొంగతనాలు చేసే వాడు. అలా దొంగతనం చేసేముందు ఒకసారి ఈ స్వామిని స్మరించి తన బృందంతో చౌర్యంచేసి అందులో సగభాగం ఈ స్వామికి సమర్పించేవాడట. మిగిలిన సగభాగమే అతను తీసుకొనే వాడు. ఇలా కొన్నిరోజులు గడచిన తర్వాత ఒక సందర్భంలో కాలదూషకుడు రాజగృహంలోకెళ్ళి దొంగతనం చేశాడు.

దీనిని తెలుసుకున్న రాజసేవకులు అతనిని మరియు అనుచరులను అందరినీ పట్టుకోవటానికి ప్రయత్నించగా, అనుచరులందరూ పట్టుబడ్డారు. కానీ కాలదూషకుడు తప్పించు కొన్నాడు. అప్పుడు వారు కాలదూషకుడు ఎక్కడ ఉన్నాడో మేము చూపిస్తామంటూ రాజభటులను అక్కడకు తీసుకొని వెళ్లగా... ఈ లోపు కాలదూషకుడు శ్రీవైకుంఠనాథుని శరణాగతి





చేశాడు. భక్తపరాధీనుడైన శ్రీవైకుంఠనాథుడు కాలదూషకుని కాపాడే స్థితిలో తానే కాలదూషకునిగా వేషం వేసుకొని రాజుగారి ఎదుట నిలిచాడు. అప్పుడు రాజభటులు స్వామిని బంధించారు.

రాజుకు ఈ కాలదూషకుని చూస్తున్నప్పుడు ఒక సందేహం కలిగింది. ఈ చోరనాయకుడైన కాలదూషకుని చూస్తూ ఏమిటో విచిత్రంగా ఉన్నది. ఇతను కాలదూషకుడా? నాకు భగవంతునిలాగా కనిపిస్తున్నాడని మనసులో తలచాడు. భగవంతుడుకూడా, ఓ రాజా! నీ రాజ్యంలో సంపద మెండుగా ఉన్నది. కానీ, నీవు దానిని ప్రజలకు, రాజ్యంకొరకు వినియోగించడం లేదు. సంపద ఎప్పుడూ అలాగే ఉండిపోకూడదు. దాని వినియోగం ఉండాలి. కనుక నేనే కాలదూషకునిగా ఉండి ఈ పని చేశాను. కాలదూషకుడు పెద్ద

**భగవంతుడు, మూలవర్లు :** వైకుంఠనాథుడు, కళ్ళపిరాన్, చోరనాథః
ఆదిశేషుడు గొడుగుపట్టగా తూర్పు దిక్కునకు నిలుచున్న భంగిమలో వేంచేసిఉన్నారు..

**ఉత్సవర్లు :** శ్రీభూనీళాసమేత శ్రీవైకుంఠనాథ స్వామి-నిలుచున్న భంగిమ

**అమ్మవారు, మూలవర్లు :** వైకుంఠవల్లి, కూర్చున్న భంగిమ

**ఉత్సవర్లు :** చోరనాయకి

**తీర్థం :** కలశతీర్థం, భృగుతీర్థం, తామ్రబర్ణి తీర్థం

**విమానం :** చంద్రవిమానం

**విశేషం :** 1) మామిడిచెట్టు స్థలవృక్షం, 2) ఈ దేవాలయదర్శనం సూర్యదోషనివృత్తి

**మంగళాశాసనం :** నమ్మాళ్వార్లు

దొంగైనాకూడా ధర్మమార్గమును విడువక వినియోగింపబడనటువంటి ధనమును మాత్రమే అతను దొంగిలించాడు. అది మాత్రమే కాక ధర్మానికి చెందవలసిన ఆ సంపదను నా మూలంగా పలు ధర్మాచరణలు గావించాడు. అలాగే ప్రజలనుండి అపహరించిన ఆ ధనాన్ని మంచికార్యానికి ఈ క్షణంలోనే ప్రజలకు కావలసిన ప్రయోజనాలను చేయవలసినదిగా ఆజ్ఞాపించాడు. దానితోపాటు చోరునిగా తన ఎదుట నిలచి తనకు జ్ఞానోదయం కలిగించిన ఆ భగవంతుని చూచి ఇలా అన్నాడు. ఓ స్వామీ! నీవు మాకు ఈ చోరనాథునిలాగే దర్శనభాగ్యాన్ని కలిగించాలని ప్రార్థించగా, స్వామి ఆనాటినుండీ ఈనాటివరకు 'కళ్ళపిరాన్' అనగా చోరనాథునివలె దర్శనభాగ్యాన్ని కలిగిస్తూన్నారు.

### ధ్యానశ్లోకం

శ్రీవైకుంఠపురే హరిః విహరతే వైకుంఠవల్ల్యాన్వితః
దత్తో యః సురనాయకస్య వరదః శ్రీతామ్రపర్ణీతటే।
తత్రైవేందు విమానభూషణమణిః దివ్యైః సదా సూరిభిః
సేవ్య! స్వాంఘ్రిసరోరుహాశ్రిత భవప్రధ్వంసనైకవ్రతః॥


## 'సప్తగిరి' పాఠకులకు విజ్ఞప్తి

'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించి మీరు చందా దారులుగా చేరాలన్నా, మీ ఉత్తరప్రత్యుత్తరాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారాన్ని అంద జేయాలన్నా మీకు సంబంధించిన చిరునామాలో తదుపరి మార్పులు చేయాలన్నా వెంటనే chiefeditortpt@gmail.com ద్వారా తెలియజేయగలరు. అలా చేయలేనివారు "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517507" అని మారిన ప్రస్తుత ఈ చిరునామాను సంప్రదించగలరు.

# తిరుపతి, శ్రీ గోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేక మహోత్సవం

## (06-07-2025 నుండి 08-07-2025 వరకు)







# శ్రీ గరుడాష్టోత్తర శతనామావళిః

గరుడాష్టోత్తరస్తోత్ర పారాయణంవల్ల విశేషంగా సంతానప్రాప్తి కల్గుతుంది. వివాహంకానివారికి వివాహం జరుగుతుంది. ముఖ్యంగా ఆయుష్షు పెరుగుతుంది. అలాగే గరుడాష్టోత్తరస్తోత్రపారాయణంతోనే శుభసూచకాలు గోచరిస్తాయి. సకలపాపాలు నశిస్తాయి. భగవంతునియందు అచంచలమైన భక్తివిశ్వాసాలు పెరుగుతాయి. అంచేత గరుడాష్టోత్తరస్తోత్ర పఠనమనేది ఒక గొప్ప స్తోత్రపారాయణంగా చెప్పబడింది. కాబట్టి ఈ గరుడాష్టోత్తరస్తోత్రపారాయణకుగాను ప్రత్యేకంగా అందిస్తోంది 'సప్తగిరి' మీ కోసం...

నమః పన్నగనద్ధాయ వైకుణ్ఠ వశవర్తినే
శ్రుతిసిన్ధు సుధోత్పాద మన్దరాయ గరుత్మతే॥

ఓమ్ శ్రీవైనతేయాయ నమః
ఓమ్ ఖగపతయే నమః
ఓమ్ కాశ్యపాయయ నమః
ఓమ్ మహాబలాయ నమః
ఓమ్ తప్తకాంచనవర్ణాభాయ నమః
ఓమ్ సుపర్ణాయ నమః
ఓమ్ హరివాహనాయ నమః
ఓమ్ ఛందోమయాయ నమః
ఓమ్ మహాతేజసే నమః
ఓమ్ మహోత్సాహాయ నమః 10

ఓమ్ మహాబలాయ నమః
ఓమ్ బ్రహ్మణ్యాయ నమః
ఓమ్ విష్ణుభక్తాయ నమః
ఓమ్ కుందేందుధవళాననాయ నమః
ఓమ్ చక్రపాణిధరాయ నమః
ఓమ్ శ్రీమతే నమః
ఓమ్ నాగారయే నమః
ఓమ్ నాగభూషణాయ నమః
ఓమ్ విద్వన్మయాయ నమః
ఓమ్ విశేషజ్ఞాయ నమః 20

ఓమ్ విద్యానిధయే నమః
ఓమ్ అనామయాయ నమః
ఓమ్ భూతిదాయ నమః
ఓమ్ భువనదాత్రే నమః
ఓమ్ భయఘ్నే నమః
ఓమ్ భక్తవత్సలాయ నమః
ఓమ్ సప్తఛందోమయాయ నమః
ఓమ్ పక్షిరాజాయ నమః
ఓమ్ సురాసురపూజితాయ నమః
ఓమ్ భుజంగభుజే నమః 30

ఓమ్ కచ్ఛపాశినే నమః
ఓమ్ దైత్యహంత్రే నమః
ఓమ్ అరుణానుజాయ నమః
ఓమ్ నిగమాత్మనే నమః
ఓమ్ నిరాధారాయ నమః
ఓమ్ నిస్త్రైగుణ్యాయ నమః
ఓమ్ నిరంజనాయ నమః
ఓమ్ నిర్వికల్పాయ నమః
ఓమ్ పరంజ్యోతిషే నమః
ఓమ్ పరాత్పరతరాయ నమః 40

ఓమ్ పరస్మై నమః
ఓమ్ శుభాంగాయ నమః
ఓమ్ శుభదాయ నమః
ఓమ్ శూరాయ నమః
ఓమ్ సూక్ష్మరూపిణే నమః
ఓమ్ బృహత్తనవే నమః
ఓమ్ విషాశినే నమః
ఓమ్ విజితాత్మనే నమః
ఓమ్ విజయాయ నమః
ఓమ్ జయవర్ధనాయ నమః 50

ఓమ్ అజాస్యాయాయ నమః
ఓమ్ జగదీశాయ నమః
ఓమ్ జనార్ధనమహాధ్వజాయ నమః
ఓమ్ ఘనసంతాపనచ్ఛేత్రే నమః
ఓమ్ జరామరణవర్జితాయ నమః
ఓమ్ కల్యాణదాయ నమః
ఓమ్ కాలాతీతాయ నమః
ఓమ్ కళాధరసమప్రభాయ నమః

ఓమ్ సోమపాయ నమః
ఓమ్ సురసంఘేశాయ నమః 60

ఓమ్ యజ్ఞాంగాయ నమః
ఓమ్ యజ్ఞభూషణాయ నమః
ఓమ్ వజ్రాంగాయ నమః
ఓమ్ వరదాయ నమః
ఓమ్ వంద్యాయ నమః
ఓమ్ వాయువేగాయ నమః
ఓమ్ వరప్రదాయ నమః
ఓమ్ మహాజవాయ నమః
ఓమ్ విదారిణే నమః
ఓమ్ మన్మథప్రియబంధవాయ నమః 70

ఓమ్ యజుర్నామ్నే నమః
ఓమ్ అనుష్టుభజాయ నమః
ఓమ్ మారకాయ నమః
ఓమ్ కాలజ్ఞాయ నమః
ఓమ్ కమలేష్టాయ నమః
ఓమ్ కలిదోషనివారణాయ నమః
ఓమ్ స్తోమాత్మనే నమః
ఓమ్ త్రివృన్మూర్ధ్నే నమః
ఓమ్ భూమ్నే నమః
ఓమ్ గాయత్రితలోచనాయ నమః 80

ఓమ్ సామగానరతాయ నమః
ఓమ్ స్రగ్విణే నమః
ఓమ్ స్వచ్ఛందగతయే నమః
ఓమ్ అగ్రణ్యే నమః
ఓమ్ వినతానందనాయ నమః
ఓమ్ విజితారాతిసంకులాయ నమః
ఓమ్ పతద్వరిష్ఠాయ నమః
ఓమ్ సర్వేశాయ నమః
ఓమ్ పాపఘ్నే నమః
ఓమ్ పాపమోచకాయ నమః 90

ఓమ్ అమృతాంశవే నమః
ఓమ్ అమృతవపుషే నమః
ఓమ్ ఆనందగతయే నమః
ఓమ్ సుధాకుంభధరాయ నమః
ఓమ్ దుర్ధరాయ నమః
ఓమ్ అసురభంజనాయ నమః
ఓమ్ అగ్రజితే నమః
ఓమ్ జయగోపాయ నమః
ఓమ్ జగదాహ్లాదకారకాయ నమః
ఓమ్ భగవతే నమః 100

ఓమ్ స్తోత్రాయ నమః
ఓమ్ శోభాయ నమః
ఓమ్ స్వర్ణవపుషే నమః
ఓమ్ స్వరాజే నమః
ఓమ్ విద్యున్నిభాయ నమః
ఓమ్ విశాలాంగాయ నమః
ఓమ్ వినతాదాస్యవిమోచకాయ నమః
ఓమ్ శ్రీగరుడాయ నమః 108

సమస్త సన్మంగళాని సన్తు

వేగోత్తానం వితానం వ్యజన మమగుణం వైజయంతీ జయంతీ
మిత్రం నిత్యాభ్యమిత్రం యుధి విజయరథో యుగ్యయోగానపేక్షః।
దాసో నిష్పర్యదాసో దమతనయభిదో నిస్సహాయః సహాయః
దోధూయేతాస్మదీయం దురిత మధరితారాతిపక్షైః స్వపక్షైః॥

(ఆధారం: ఆచార్య కె.సర్వోత్తమరావు గారి
"పెరియతిరువడి-శిరియతిరువడి" గ్రంథం నుండి)





తిరుపతి, శ్రీ గోవిందరాజస్వామివారి పుష్పయాగ మహోత్సవం
(02-07-2025)



అప్పలాయగుంట, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి
పుష్పయాగ మహోత్సవం
(12-07-2025)

**జూలై 25, 2025న**
**చక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం సందర్భంగా....**

# చక్రధారి

- శ్రీమతి బండారు శాయి ప్రసన్నలక్ష్మి


విష్ణురూపాయ శాంతాయచ ఆయుధానాం ధరాయచ
విష్ణుశస్త్రాయ చక్రాయ నమో భూయో నమో నమః

ఈ అనంత సృష్టికి స్థితికారకుడు సుదర్శనచక్రధారి అయిన ఆ శ్రీమన్నారాయణుణ్ణి ఎల్లవేళలా స్మరించినంత మాత్రంచేత మన పాపాలు దహించబడి మన నిత్యజీవితం సుఖమయంగా ఉంటుంది అని వేదాలు ఘోషిస్తున్నాయి. ఆ పరంధాముని శక్తి తాను ధరించే ఆయుధాలలో నిక్షిప్తమై ఉంటుంది. వాటిలో అత్యంత శక్తివంతమైన ఆయుధం సుదర్శనచక్రం.

పంచమవేదంగా పిలువబడే వ్యాసభగవానుని విరచితమైన మహాభారతం మరియు మహాభాగవతంలో సాక్షాత్ ఆ భీష్మపితామహుడే రెండు ముఖ్యమైన సందర్భాలలో శ్రీచక్రధారి అయిన ఆ శ్రీకృష్ణపరమాత్మని ప్రార్థిస్తూ శరణు వేడుకున్నాడు.

మహాభారతంలో కౌరవేంద్రుడైన దుర్యోధనుడు మయసభలో అవమానానికిలోనై అధర్మజూదం శకునితో ఆడించి ధర్మరాజుని ఓడించాడు. పాండవులు తాను విధించిన షరతుప్రకారం 12 సంవత్సరాలు వనవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేసి తిరిగివచ్చిన తర్వాతకూడా, సూదిమొన మోపినంత స్థలాన్నికూడా ఇవ్వనని, రాజ్యం వీరభోజ్యమని, వారితో యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు.

యుద్ధంలో తమకు సహాయం చేయమని అటు దుర్యోధనుడు ముందుగా శ్రీకృష్ణుని ఇంటికి వచ్చాడు. తరువాత అర్జునుడూ పరమాత్మ సహాయార్థమై వచ్చాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు నిద్రపోతున్నాడు. అప్పుడు పరమాత్మ లేవగానే దర్శించుకునేందుకు శ్రీకృష్ణుని పాదాలచెంత ఎంతో వినయంగా అర్జునుడు కూర్చున్నాడు. కాని అభిమాన గర్విష్ఠి అయిన దుర్యోధనుడు, శ్రీకృష్ణుడు లీలామనుషస్వరూపమని తెలుసుకొనలేక, శ్రీకృష్ణుని శిరస్సువెనుక కూర్చున్నాడు.



కొద్దిసమయం తర్వాత శ్రీకృష్ణుడు మేల్కొని తన పాదాలచెంత శరణువేడుతున్నట్లుగా ఉన్న అర్జునుణ్ణి ముందుగా చూసి కుశలప్రశ్నలు వేశాడు. తర్వాత దుర్యోధనుణ్ణి పలుకరించాడు. వారు వచ్చిన విషయాన్ని గ్రహించిన పరమాత్మ, తన సహాయాన్ని రెండుభాగాలుగా చేశాడు. తాను ఒక్కడే ఒకవైపు, తన పదివేలమంది సైనికులు ఒకవైపు విభాగం చేసి, ముందుగా అర్జునుణ్ణి ఏది కావాలో కోరుకోమన్నాడు. దుర్యోధనుడు తనవద్దకు ముందుగా వచ్చినప్పటికీ, తాను ముందుగా అర్జునుణ్ణి చూశాను కనుక అని దుర్యోధనుణ్ణి సమాధానపరిచాడు. తాను ఆయుధాన్ని ధరించననికూడా ప్రతిజ్ఞ చేశాడు శ్రీకృష్ణుడు. వివేకవంతుడైన అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మని కోరుకున్నాడు, దుర్యోధనుడు మనస్సులో సంతోషపడి తాను కోరుకున్నదే తనకు వచ్చిందని పదివేలమంది సైనికులను తాను తీసుకుంటానని తెలిపి వెళ్లిపోయాడు. కురు పాండవులమధ్య పద్దెనిమిదిరోజుల కురుక్షేత్రసంగ్రామం మొదలయ్యింది,


కురుక్షేత్ర మహాసంగ్రామంలో 9వ రోజు యుద్ధంలో భీష్మపితామహుని యుద్ధధాటికి నిర్వీర్యమయ్యాడు అర్జునుడు.




రథసారథిగా మాత్రమే ఉన్న శ్రీకృష్ణుడు ధర్మానికి గ్లాని ఏర్పడుతున్నదని తెలుసుకుని అత్యంత ఆవేశంతో ఆయుధాన్ని పట్టనని తెలిపినా తన ప్రతిజ్ఞనికూడా భంగపరచి భీష్మునిపై సుదర్శనచక్రాన్ని తీసుకుని సంహరించటానికి రథంనుంచి ఒక్కసారి సింహంవలె దుమికాడు.

అప్పుడు భీష్ముడు తన రథం నుంచి దిగి పరమాత్మని శరణువేడి సంహరించమన్నాడు. శ్రీకృష్ణుడు లీలామానుష విగ్రహస్వరూపుడైన సాక్షాత్ ఆ నారాయణుడని తెలిసిన భీష్మ పితామహుడు, ధర్మానికి హాని కలిగితే తన ప్రతిజ్ఞనికూడా ఉల్లంఘిస్తాడని, సుదర్శనచక్రాన్ని అధర్మాన్ని రూపుమాపటానికి ఆ శ్రీకృష్ణభగవానుడు ప్రయోగించాడని ఈ సన్నివేశంద్వారా తెలిపాడు. ఈలోగా అర్జునుడు శ్రీకృష్ణునిపాదాలు పట్టుకుని తన ప్రతిజ్ఞని గుర్తుచేసి శ్రీకృష్ణుని వెనుకకు తీసుకుని రథంలోకి వచ్చాడు. తరువాతరోజు భీష్మునిద్వారానే తన మరణ రహస్యాన్ని తెలుసుకున్న పాండవులు, భీష్ముణ్ణి, తదుపరి సంగ్రామంలో కౌరవులందరినీ సంహరించి రాజ్యాన్ని దక్కించుకున్నారు ఆ శ్రీకృష్ణపరమాత్మ సహాయసంపత్తితో.

**విశ్వదాభిరామం** **వేమన పద్యసూక్తి**



## గుణం ప్రధానం

**ఒడ్డు పొడుగు గలిగి గడ్డంబు పొడుగైన**
**దానగుణము లేక దాత యగునె;**
**ఎనుము గొప్ప దైన ఏనుగు బోలునా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** ఒడ్డు, పొడుగు= వెడల్పు, పొడవు; దాత= దానం చేయువాడు; ఎనుము= బఱ్ఱె.

**భావం:** ఒడ్డూ పొడుగూ ఉండి పొడవాటి గడ్డం ఉన్నంత మాత్రాన దానగుణం లేకుండా దాత కాలేడు. ఎనుము గొప్పదైనంతమాత్రాన ఏనుగుతో సమానం కాదు కదా!

**వివరణ:** దానం చేస్తేనే దాత అవుతాడు కాని, లావుగా పొడుగ్గా రూపం గొప్పగా ఉన్నంతమాత్రంచేత దాత అనేపేరు రాదు. గేదెకూడా ఏనుగులాగా లావుగా, ఎత్తుగా ఉంటుంది. ఆకారం అలా ఉందని గేదెను ఏనుగు అనరు కదా. మంచి వాడు అనేకీర్తి కలగాలంటే మనిషిలో మంచి గుణాలు ఉండాలి. అంతేకాని మంచివేషం ఉంటే చాలదు.

బాహ్యమైనరూపం ప్రధానం కాదు. ఆంతరమయిన ఉత్తమగుణాలు మాత్రమే గొప్ప పేరును తెస్తాయి. జనులు రూపం చూసి భ్రమ పడగూడదు అని తాత్పర్యం.

*– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*


# గురుదక్షిణ

- శ్రీ లక్కరాజు గోయెంకా సాయి

ఈ లోకంలో అన్నిటికంటే విలువైనది ప్రాణం. అటువంటి ప్రాణం గురుదక్షిణగా ఇవ్వడం గొప్ప విషయమే. చనిపోయిన పుత్రుడిని తిరిగి బ్రతికించి గురుదక్షిణగా ఇచ్చిన ఘనత బలరామకృష్ణులకే దక్కుతుంది.

తమ విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత ఒకసారి బలరామకృష్ణులు తమ గురువు సాందీపనిమహర్షివద్దకు వెళ్లారు. తమకి విద్యాబోధన గావించిన సాందీపనిమునికి ఏదైనా గురుదక్షిణ ఇవ్వాలనుకున్నారు. అది గ్రహించిన సాందీపనిమునికి శ్రీకృష్ణుడు సాక్షాత్తు దేవదేవుడు అని తెలుసు. అందుకే వారిని ఒక ప్రత్యేక కోరిక కోరాడు. అదే ఈ గురుదక్షిణ.

తనకు గురుదక్షిణగా చాలాకాలంక్రితం సముద్రంలో మునిగి చనిపోయిన తన పుత్రుణ్ణి తిరిగి తీసుకురమ్మని సాందీపనిమహర్షి వారిని కోరాడు. అప్పుడు శ్రీకృష్ణుడు గురువు చెప్పిన విషయం విని తప్పకుండ మీ కోరిక నెరవేర్చడానికి సిద్ధం అంటూ నేరుగా సముద్రుడివద్దకు వెళ్లి శ్రీకృష్ణబలరాములు ఈ విషయం సముద్రుడికి వివరించారు. కొంతకాలం క్రితం మా గురుపుత్రుడు ఈ సముద్రంలో పడి మరణించాడు. అతణ్ణి వెంటనే వెనక్కి తీసుకురా! అని అడిగారు.




దానికి బదులుగా సముద్రుడు మీ గురుపుత్రుణ్ణి నేను తీసుకుపోలేదు. పంచజనుడు అనే రాక్షసుడు ఆ పిల్లవాడిని పట్టుకెళ్లాడు. వాడు శంఖం రూపంలో సముద్రం నీటిఅడుగున ఉండవచ్చు అని సమాధానం ఇచ్చాడు. శ్రీకృష్ణుడు వెంటనే సముద్రంలోకి వెళ్లి అక్కడ దాగున్న పంచజనుడు అనే రాక్షసుణ్ణి పట్టుకున్నాడు. వాడి కడుపులో గురుపుత్రుడు కనిపించలేదు. అప్పుడు రాక్షసుడి శరీరంనుండి పుట్టిన "పాంచజన్యం" అనే శంఖాన్ని తీసుకుని యమపురికి చేరుకున్నారు. అక్కడ ఈ శంఖం శ్రీకృష్ణుడు పూరించగా ఆ శబ్దానికి యమలోకం తలక్రిందులైంది. అది విని యమధర్మరాజు వెంటనే బయటకు వచ్చి శ్రీకృష్ణుడికి అభివాదం చేసి, "స్వామీ! ఆజ్ఞాపించండి" అని అడిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు యమరాజుతో "నా గురుపుత్రుణ్ణి వెంటనే తిరిగి బ్రతికించి ఇవ్వమని" అడిగాడు. వెంటనే ఆ గురుపుత్రుణ్ణి వారికి అప్పగించాడు యముడు.

ఆ పిల్లవాణ్ణి తీసుకుని సాందీపనిమునికి తమ గురుదక్షిణగా అప్పగించి ఋణం తీర్చుకున్నారు. ఈ లోకంలో చనిపోయినవారిని తిరిగి బ్రతికించడం చాలా కష్టం. బలరామకృష్ణులు గురుదక్షిణగా చేసిన మేలు మరువలేనిది అని సాందీపనిమహర్షికుటుంబం ఈ సందర్భంగా బలరామకృష్ణులకు ఆనందబాష్పాలతో కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

గురుదక్షిణ అనేది ఇలా ఉండాలి. తమ బిడ్డ బ్రతికివచ్చాడని తెలిసి ఆ మహర్షికుటుంబం ఎంతగానో సంతోషించింది. శ్రీకృష్ణుడికి వారు తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకున్నారు.

కళలు

హాస్య కళ



# నవ్వు! నవ్వించు!!

– శ్రీ యం. రవితేజ



"శృంగార హాస్య కరుణ రౌద్ర వీర
భయానక బీభత్స అద్భుత శాంతే రసాః"

అని భరతుడు నాట్యశాస్త్రంలో తొమ్మిదిరకాల రసాలను పేర్కొన్నాడు. ప్రధానరసం శృంగారంకాగా హాస్యం రెండవస్థానాన్ని ఆక్రమించింది. హాస్యానికి స్థాయీభావము నవ్వు. నవ్వు అనేది ప్రతి జీవి జీవితంలో ప్రధానమైన చర్య.

నవ్వడం ఒక యోగం
నవ్వించడం ఒక భోగం
నవ్వకపోవడం ఒక రోగం


అని తాత్వికుల అభిప్రాయం. భగవంతునిసృష్టిలో నవ్వగల ప్రాణి మనిషి ఒక్కడే. నవ్వే మనిషికి ఒక వరం. మందులతో పని లేకుండా సర్వరోగనివారిణి నవ్వు. నవ్వు ఒక దివ్య ఔషధం. మనసులోని బాధలన్నీ నవ్వుతో మాయమైపోతాయి అంటారు. మరే ఇతరప్రాణి నవ్వలేదు. అయితే వాటి చర్య ప్రతిచర్యలనుబట్టి అవి నవ్వుతున్నాయని మనం భ్రమపడతాం. ఎందుకంటే వాటి భావావేశాలకు అనుగుణంగా అవి చేసే పనులు, కేకలనుబట్టి మనం ఆవిధంగా భావిస్తాం.

"ఆనందో బ్రహ్మ" అంటారు. ఆనందం బ్రహ్మానంద సహోదరమని అర్థం. అంతటి ఆనందాన్నిచ్చే శక్తి, అనుభవించే శక్తి ఒక్క మానవుడికి మాత్రమే ఉన్నది. నవ్వు అనేది దైవత్వానికి చిహ్నం. నవ్వితే మదిలోని కల్మషాలన్నీ దూరం అవుతాయి. నిండైననవ్వుతో ముఖంలోని 32 కండరాలకు వ్యాయామం జరుగుతుంది అని అంటారు. మనసులోని బాధలు కూడా అంతమవుతాయని అంటారు. ఆధునిక కాలంలో హడావుడిజీవితంలోపడి నవ్వును మరచిపోయిన మనుషులు లాఫింగ్‌క్లబ్బులను ఏర్పరచుకొని ఉదయం సాయంకాలాలు అక్కడికి వెళ్లి హాస్యపుకబుర్లు చెప్పుకొని పడి పడి నవ్వుతూ ఆరోగ్యాన్ని చేకూర్చుకుంటున్నారు. నవ్వును వైద్యంగా పరిగణిస్తారు తత్వవేత్తలు. నవ్వులలో ఎన్నోరకాలు ఉన్నాయి. మందహాసం, చిరుమందహాసం, నవ్వు, అతిహసితం, వికటాట్టహాసం మొదలగునవి.



నవ్వును జంతువులు నరుడునవ్వును నవ్వులు చిత్తవృత్తికి
దివ్వెలు కొన్ని నవ్వులెటు తేలవు కొన్ని విష ప్రయుక్తముల్
పువ్వులు వోలే ప్రేమరసముల్ వెలిగక్క విశుద్ధమైనవే
నవ్వులు సర్వము దుఃఖదమనంబు
వ్యాధులకు మహోషధల్

అని మహాకవి గుర్రం జాషువా అన్నారు. అటువంటి సర్వరోగనివారిణి అయిన నవ్వును నవ్వాలా? వద్దా? అని ఆలోచించడం ఎందుకు? మనసారా నవ్వుదాం. మానసిక తృప్తిని పొందుదాం. ఆరోగ్యాన్ని పొందుదాం. నవ్వు ఇద్దరువ్యక్తులను కలుపుతుంది. శత్రువు ఎదురైనప్పుడు ఒక్క చిరునవ్వు శత్రుత్వాన్ని సైతం తొలగిస్తుంది.



రామాయణంలో రామచంద్రుడు "పూర్వస్మితభాషి"యని వాల్మీకి పేర్కొన్నాడు. శత్రువు ఎదురైన చిరునవ్వుతో పలకరించేవాడు అని అర్థం. నవ్వు రోగాలను మాత్రమే కాదు మనుషులమధ్య దూరాన్ని పోగొడుతుంది. నవ్వడంవలన శరీరంలోని "కోటి కోల్ అయాన్" అనే హార్మోన్లు విడుదలవుతాయి."ఎండార్ఫిన్" అనే హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. శారీరక మానసిక రుగ్మతలను దూరం చేసి ప్రశాంతతను ఇవ్వడంలో ఈ హార్మోన్లు ఎంతో పాత్రను వహిస్తాయి. నవ్వునుగురించి తెలిపే శాస్త్రాన్ని "జెలోటాలజీ" అంటారు.



మనస్ఫూర్తిగా నవ్వే వ్యక్తుల జీవితకాలంకూడా పెరుగుతుందని ఉవాచ. ఆరోగ్యవంతమైనజీవితాన్ని కూడా గడుపుతారు. మనసారా నవ్వ గలిగితే శారీరకఆరోగ్యమే కాదు మానసికప్రశాంతతకూడా దొరుకు తుంది. నవ్వుతూ మాట్లాడేవారితో స్నేహం చేయటానికి ప్రతివారు ఆసక్తి చూపుతారు. అంతేకాదు ఎంతటి బాధలనైనా తట్టుకునే శక్తినికూడా ఇస్తుంది. మనసారా నవ్వితే కోపంకూడా దూరమవుతుంది. నవ్వుకూడా సందర్భాన్నిబట్టి మారుతుంది. ద్రౌపదినవ్వు కురుక్షేత్రసంగ్రామానికి హేతువైంది. లక్ష్మణునినవ్వుగురించి జానపదులు ఎన్నో రకాలుగా వర్ణించి పాటల రూపంలో పాడుకున్నారు. "లక్ష్మణుడినవ్వు కొలువులో కలకలం రేపింది. ద్రౌపదినవ్వు కురుక్షేత్రసంగ్రామానికి హేతువైంది. మధురవాణినవ్వు కన్యాశుల్కానికి ఊపిరి అయింది". ఇలా మహాకవులు నవ్వుగురించి అనేకవిధాలుగా వర్ణించి చెప్పారు.. అంతేగాక నవ్వు నాలుగువిధాల చేటని, నవ్విన నాపచేనే పండుతుందని, నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు మొదలుగా గల ఎన్నో సామెతలు నవ్వులగురించి పుట్టాయి. తిక్కనమహాకవి మహాభారతంలో నవ్వు 32 రకాలని చెప్పారు. కానీ నేటి యాంత్రికయుగంలో, యాంత్రికజీవితంలో మనిషి నవ్వటమే మరచిపోతున్నాడు. నేటి విద్యార్థులకు చదువులు, మార్కులు, ర్యాంకులతో నైరాశ్యం, నేటి ఉద్యోగస్తులు ప్రధానంగా అంతర్జాలంలో ఇంటినుండి పనిచేస్తూ తోటివారితో, స్నేహితులతో కలిసే సమయం లేకుండాపోయింది. ఒంటరితనంతో వారిలో మానసికఒత్తిడి పెరిగి పోతున్నది. దానితో యువత అధికసంఖ్యలో డిప్రెషన్లబారిన పడు తున్నారు. కుంగుబాటుకు లోనవుతున్నారు. యువత మానసికంగా ఆనందంగా ఉన్నప్పుడు మాత్రమే దేశభవిత శోభాయమానంగా ఉంటుంది.



నవ్వుతూ ఉన్న మనిషి మాత్రమే పదుగురికి సహాయం చేయగలుగుతాడు. అందుకే మనిషి ఎప్పుడూ నవ్వుతూ బతకాలి. అప్పుడే తనలోని బాధలను మరచిపోగలుగుతాడు. నలుగురు ఒకచోట కలిసినప్పుడు మాత్రమే నవ్వుతూ ఆనందంగా ఉండగలుగుతారు. "నవ్వుతూ బతకాలిరా" అన్నారు కదా ఒక సినీకవి. ఎర్రంశెట్టిసాయి, ముళ్ళపూడి వెంకట రమణ, జంధ్యాలవంటి కవులు హాస్యాన్ని ప్రధానంగా తీసుకొని మనసారా నవ్వ గలిగే చిత్రాలను సృష్టించారు.

నేడు జోక్స్‌పేరుతో హాస్యాన్ని అందించే ఎన్నోరకాల పుస్తకాలు అంగళ్ళలో దొరుకుతున్నాయి. కనీసం వాటిని చదివినా హాయిగా మనసారా నవ్వగలుగుతాం. అప్పుడా నవ్వే ఆరోగ్యాన్ని అందజేస్తుంది. మనసారా నవ్వేవారికి రక్తపోటు, గుండెపోటు వంటి వికూడా దూరమవుతాయని వైద్యశాస్త్రం చెబుతున్నది. పాపాయి బోసినవ్వులో భగవంతుడు కనిపిస్తాడు.

మనసారా నిండుగా నవ్వే మనిషిలో అమృతహృదయముంటుంది. అందుకే జీవితానికి నవ్వే ప్రధానం.

ఆరోగ్యానికి ఔషధం, కోపానికి విరుగుడు, స్నేహానికి వెలుగు, డబ్బుతో కొనలేనిది, జీవితాన్ని ఆనందంగా ఉంచ గలిగేది, ఆరోగ్యాన్ని అందించగలిగేది అయిన నవ్వును ఆహ్వానిద్దాం. జీవితాన్ని హాయిగా ఆనందంగా ఆస్వాదిద్దాం. ఆయువును పెంచుకుందాం.




# అభివాదఫలం!!

- శ్రీ పింగళి పాండురంగారావు,
94405 54114

మార్కండేయుని వయసు ఐదు సంవత్సరాలు. ఒకరోజు తండ్రి మృకండమహర్షిఒడిలో కూర్చుని ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ఓ సిద్ధపురుషుడు ఆవైపు వచ్చి మృకండ మహర్షితో 'నీ కుమారుడు దైవగుణసంపన్నుడు, కారణ జన్ముడు, కానీ అల్పాయుష్కుడు. అందుచేత ఏదో ఒక మేలైన మార్గాన్ని ఆలోచించు' అని చెప్పి వెళ్లిపోయాడు.

మహాత్ములమాటలు అసత్యం కావని తెలిసిన మృకండుడు మార్కండేయునకు ఉపనయనం చేసి సకల ధర్మ మార్గాల్ని బోధించాడు. చివరిగా కుమారుని ప్రేమతో దగ్గరకు పిలిచి, ఎదురుగా కూర్చుండబెట్టుకుని, "నాయనా! నీకు ఎప్పుడైనా, ఎక్కడైనా మహాత్ములు, జ్ఞానులు, పెద్దలు ఎదురు పడినప్పుడు వారిని సమీపించి వినయవిధేయతలతో నమస్క రించు. వారి ఆశీర్వాదబలంవల్ల నీకు శుభం కల్గుతుంది అని చెప్పాడు.

తండ్రి ఆజ్ఞానుసారంగా జ్ఞానులు, మహాత్ములు, సిద్ధులు ఎదురుపడినప్పుడు వారికి వినయపూర్వకంగా మార్కండేయుడు నమస్కరిస్తూ ఉండేవాడు. కాని అతని ఆయువు మూడురోజులకు చేరింది. దైవయోగంగా అటువైపే సప్తఋషులు విచ్చేయడం గమనించిన మార్కండేయుడు వారికందరికీ భక్తిశ్రద్ధలతో సవినయనమస్కారం చేశాడు. ఋషులందరు ప్రసన్నులై 'దీర్ఘాయుష్మాన్ భవ' అని ఆశీర్వదించారు. కాని వశిష్ఠమహాముని తపోశక్తిచేత ధ్యానముద్రలో ఆ బాలుని అల్పాయువును గుర్తించాడు. అప్పుడు వశిష్ఠుడు మిగతాఋషులతో "ఈ బాలునికి మూడుదినములే ఆయువు ఉంది. మన ఆశీస్సులు వ్యర్థం కాకుండా ఈ బాలుడు చిరంజీవి కావాలంటే మనం ఏదైనా ఉపాయం ఆలోచించాలి" అన్నాడు.

ఋషులందరు ఆలోచించి, బ్రహ్మదేవునివల్లనే ఈ బాలుడు చిరంజీవి కాగలడని నిశ్చయించుకున్నారు. ఋషులు బాలునితో బ్రహ్మలోకానికి వెళ్లారు. సప్తఋషులు బ్రహ్మ దేవునితో, "ప్రభూ! ఈ బాలుని వినయవిధేయతలకు సంతోషపడి మేము 'దీర్ఘాయుష్మాన్ భవ' అని ఆశీర్వదించాం. మీరూ అలాగే ఆశీర్వదించారు. కానీ వీని ఆయువు మూడు రోజులు మాత్రమే ఉందని" సవినయంగా చెప్పారు.


ఋషులమాటలు విన్న బ్రహ్మదేవుడు చిద్విలాసంగా చిరునవ్వుతో, వినయసంపన్నుడైన మార్కండేయునివైపు చూస్తూ, "మునీశ్వరులారా! మీరు చింతింప పనిలేదు. ఈ బాలుడు తన వినయవిధేయతలతో కూడిన అభివాదముతో కాలుణ్ణి జయించాడు. ఇప్పుడు ఈ బాలుడు అజరామరుడు" అని పలుకగా ఋషులందరు మిక్కిలిగా ఆనందించారు.



**నీతి**

**మహాత్ములకు, జ్ఞానులకు, పెద్దలకు, తల్లిదండ్రులకు వినయపూర్వకంగా భక్తిశ్రద్ధలతో యువకులు, పిన్నలు అభివాదం చేయడంవల్ల కలిగే అఖండశుభము ఎలాంటిదో ఈ కథ వల్ల తెలుస్తుంది. మానవతావిలువలు పతనమవుతున్న నేటి సమాజంలో పిల్లలు ఈ శుభప్రదమైన సదాచారమును మరువక ఆచరించినట్లైతే అన్నింటా శుభఫలితాలే కల్గుతాయి.**

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్
97388 59553

*గత సంచిక తరువాయి భాగం....*

త్రేతాయుగంలో దత్తాత్రేయభగవానునిగా అవతరించాడు. ఆయన నలుగురువిద్యార్థులకు (వేదపురుషుడు అని చెప్పవచ్చు) గురువు. ఆచార్యుని అవతారంలో వారికి వేదాలు బోధించాడు. ఒక్కొక్కరిని ఋగ్, యజుర్, సామ, అథర్వణ వేదాలలో నిష్ణాతులను చేసి, వారికి బాధ్యతలు అప్పగించాడు.

ఈ కార్యక్రమాలన్నీ ఈ పవిత్రపుష్కరిణిఒడ్డున జరిగాయి కాబట్టి దీనికి వేదపుష్కరిణి అనే పేరొచ్చింది. ఈ ప్రాంతాన్ని పరిధానశిలాక్షేత్రం అనికూడా అంటారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా, దత్తాత్రేయభగవానుడు తన నలుగురు శిష్యులకు బోధించిన ఈ ప్రదేశాన్ని స్మరించుకోవడానికి ఇక్కడ మంటపం వెలిసింది. మంటపంలో నలుగురుశిష్యులతో దత్తాత్రేయుని శిల్పం చెక్కిఉంది. అక్కడ దత్తపాదాలు ఉన్నాయి. అది భగవద్రామానుజులకు ఇష్టమైన ప్రదేశం అని నారదుడు గంధర్వులకు చెప్పాడు.

చోళరాజు దురాగతాలకారణంగా, రామానుజులు చోళరాజ్యాన్ని విడిచిపెట్టాల్సొచ్చింది. ఆయన కావేరినదిని అనుసరిస్తూ మేల్నాడుకు ప్రయాణించి తిరునారాయణపురం చేరుకున్నాడని తెలుసుకదా. రామానుజులు చాలా శక్తిమంతుడని, చోళరాజును నాశనం చేయగలడని ముందే చెప్పినట్లు, ఆయన రామచంద్రప్రభువుమార్గాన్ని అనుసరించాడని తెలుసుకున్నాం.

భగవంతుడు శ్రీమన్నారాయణుడు మానవునిగా అవతరించి, రామచంద్రునిగా జన్మించాడని, తన తండ్రి ఆజ్ఞను అనుసరించి 14సంవత్సరాలు వనవాసానికెళ్లి ఇతర సాధారణమానవులవలె బాధపడ్డాడని తెలుసుకదా. ఈ ప్రక్రియలో రాక్షసుడు రావణుడు రామచంద్రప్రభువు సహధర్మిణి సీతామాతను అపహరించాడు. అత్యంత శక్తిమంతుడైన శ్రీరాముడు లంకకు చేరి రాక్షసుణ్ణి సంహరించి, సీతామాతను తిరిగి తీసుకురాగలడు.

కానీ ధర్మస్థాపనకు, మానవవిలువలు, స్నేహం మొదలైన వాటిగురించి ప్రజలకు తెలియజేయడానికి ఆయన సాధారణమానవుడిలాగే అన్ని కష్టాలను ఎదుర్కొన్నాడు. అలాగే మన భగవత్‌రామానుజులు ఆదిశేషుని అవతారమైనప్పటికీ, హింసించిన చోళరాజును సులభంగా నాశనం చేయగలిగినా మేల్నాడుకు ప్రయాణించి అక్కడకూడా విశిష్టాద్వైతసిద్ధాంతాన్ని వ్యాప్తిచేశాడు.

ఈ ప్రక్రియలో రామానుజులు కాషాయవస్త్రాన్ని విడిచి, శ్వేతవస్త్రాన్ని ధరించాల్సొచ్చింది; సంప్రదాయ శ్రీవైష్ణవ పరిభాషలో ఉడయవర్ ధరించిన తెల్లనివస్త్రాన్ని "వెల్లై సత్తుపడి" అంటారు.

యదుగిరి అనేది మేల్కోటేకు మరోపేరు. రామానుజులు మేల్కోటేకు వచ్చి మరోసారి కాషాయవస్త్రాన్ని ధరించాలని నిర్ణయించుకున్నారు. దత్తాత్రేయఅవతారంలో నారాయణుడు శిష్యులకు వేదాలను బోధించిన పవిత్రస్థలానికి, దత్తాత్రేయుని శ్రీపాదం ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ ఆయన కాషాయవస్త్రాన్ని, త్రిదండాన్ని పవిత్రశ్రీపాదంపై ఉంచి, వేదపుష్కరిణిలో పుణ్యస్నానంచేసి, శ్రీపాదంపైనుండి కాషాయవస్త్రాన్ని ధరించి, త్రిదండాన్ని చేత ధరించారు.

*(ఇంకా ఉంది)*

# మురుగన్ ఆలయం - పళముదిర్చోలై

- శ్రీ అనంతాత్మకుల రంగారావు, 79894 62679

సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో తమిళనాడులోని "పళముదిర్చోలై" ప్రసిద్ధి చెందింది. దక్షిణభారతదేశంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాలు తమిళనాడురాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి. సుబ్రహ్మణ్యస్వామిని కుమారస్వామి, షణ్ముఖుడు, కార్తికేయుడు, స్కందుడు, మురుగన్ అని పిలుస్తారు. తమిళనాడులోని ఆరు ప్రసిద్ధ దేవాలయాలను "ఆరుపడైవీడు" క్షేత్రాలు అని అంటారు. అవి 1)పళని 2)తిరుత్తణి 3)స్వామిమలై 4)పళముదిర్చోలై 5)తిరుప్పరకుంద్రం 6)తిరుచెందూర్. వీటిలో నాల్గవది అయిన పళముదిర్చోలై దేవాలయం మధురైకి దగ్గరగా సుమారు 25 కి.మీ.ల దూరంలో ఉంది.

ఈ దేవాలయం అళగిరికొండలలో ఉంది. చుట్టూ చెట్లు, ఫలవృక్షాలతో, పక్షుల కిలకిలారావాలతో, జలపాతాలతో పర్యాటకులను, భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ దేవాలయానికి మరోపేరు "సోలైమలై".

## స్థలపురాణం

ఇక్కడ ఉన్న అళగిరికొండలమీద ఆడుకొనే నిమిత్తం తన చిన్నవయసులో స్వామి వచ్చేవారు. మూడవశతాబ్దంలో అవ్వయ్యార్ అనే కవయిత్రి మురుగన్ భక్తురాలు. ఆమె స్వామి గురించి వ్రాసిన కవితలు ప్రజాధారణ పొందాయి.దాంతో 7వ శతాబ్దంలో కేరళప్రభువు అయిన "చీమన్ పెరుమాళ్" ఈ ప్రాంతాన్ని సందర్శించి, కొండలమీద సుబ్రహ్మణ్యస్వామి వేలాయుధం ఉండడం గమనించారు. ఆయన వెంటనే దేవాలయం నిర్మాణం చేశారు. అప్పట్లో ఆ వేలాయుధం (త్రిశూలం)నకే పూజలు చేసేవారు. ప్రజలుకూడా దర్శించు కొనేవారు. కొంతకాలానికి ఆ గుడి శిథిలావస్థకు చేరడంతో, 13వ శతాబ్దంలో మధురైపాలకులు పాండ్యరాజుచేత పున ర్నిర్మాణం చేయడం జరిగింది. గుడి పునఃనిర్మాణం జరిగిన పిమ్మట మురుగన్‌శిల్పాన్ని ప్రతిష్ఠించి, పై కొండమీద ఉన్న ఆయన వేలాయుధాన్ని ఈ గుడిలో ఆయనకు అమర్చారు. తదుపరికాలంలో చెక్కతో చేయబడిన వల్లీ-దేవసేన ప్రతిమలనుకూడా ప్రతిష్ఠించారు. భార్యలతో కూడిఉన్న దేవాలయం ఇక్కడే ఉంది. అందుకే విశేషమైన ఆదరణ లభించింది. ఇక్కడ ఉన్న సుబ్రహ్మణ్యస్వామిని వరాలిచ్చేస్వామిగా భక్తిప్రపత్తులతో కొలుస్తుంటారు. ఆ త్రిమూర్తులలో జ్ఞానశక్తిగా స్వామి, క్రియాశక్తిగా దేవసేన, ఇచ్ఛాశక్తిగా వల్లీదేవిలోను నిక్షిప్తం అయ్యిందని ప్రజలు విశ్వసిస్తున్నారు. పైన అంటే అళగిరికొండలమధ్య నీరు పారుతూ ఉంటుంది. ఆ నీటిని "నూపుర గంగ" అని పిలుస్తారు. ఈ నీటితోనే స్వామివారికి







భయపడుతూ కూర్చుంటే బ్రతకలేవు. తప్పో ఒప్పో చేసిచూడు. గెలుపోటములు అవే వస్తాయి

అభిషేకం చేస్తారు. గుడిలో ప్రతీదానికీ ఈ నీటినే ఉపయోగిస్తారు.

అంతేకాకుండా హనుమాన్‌తీర్థం, గరుడతీర్థం అనే రెండుకుండలాలు ఉన్నాయి. దర్శనానికి వచ్చిన భక్తులు ఈ నీటిని ముఖ్యంగా నూపురగంగజలాన్ని తీసుకొని వెడతారు. చర్మవ్యాధులున్నవారు ఈ కుండలాల్లో కాని, గంగజలంక్రింద కాని నలభైరోజులు స్నానంచేస్తే రోగాలు మాయమైపోతాయి అని విశ్వాసం. గరుడకుండంలో నీటిని కొద్దిరోజులపాటు తీర్థంగా తీసుకొంటే సర్వరోగనివారిణిగా పనిచేస్తుందని, మృత్యుభయం లేకుండా ఉంటుందని విశ్వాసం. అలాగే హనుమాన్ తీర్థంలో జలం ధైర్యానికి, ఆరోగ్యానికి వాడతారు. అగస్త్య మహర్షి, మరికొంతమంది ఋషులు ఈ స్వామిని కొలిచినట్లు చెపుతున్నారు. అడవిప్రాంతంలో ఉన్నందున ఆలయం ఉదయం ఆరుగంటలనుంచి సాయంత్రం ఆరుగంటలవరకు మాత్రమే తెరిచి ఉంటుంది.

## మురుగన్ తన భక్తురాలికి పెట్టిన పరీక్ష

స్వామి పరమభక్తురాలు అవ్వయ్యార్ అని పైన చెప్పుకొన్నాం. ఆమె గొప్ప కవయిత్రి. ఆమె ఈ కొండకు వచ్చి స్వామి నడయాడిన స్థలం చూద్దామని దూరంనుంచి నడచి వచ్చింది.దాంతో అలసట వచ్చి, ఆమె కొండపైకి వెళ్ళేదారిలో ఒక పండ్లచెట్టుక్రింద కూర్చుని ఏదో తలచుకుంటోంది.

ఇంతలో ఒక గొల్లకుర్రవానివేషంలో స్వామి ఆ చెట్టుపైకి ఎక్కి, అవ్వయ్యార్‌ను చూసి, "మామ్మా! ఆయాస పడుతూ వస్తున్నావెందుకు?" అని అడిగాడు. ఆమె "నాయనా! నా దైవం మురుగన్ కొండమీద ఆడుకొనేవాడంట. ఆ ప్రదేశం దర్శిద్దామని" అనగానే, "సరే! నువ్వు అలసిపోయావు పళ్ళు తింటావా? నీకు వేయించినపళ్ళు కావాలా? వేయించని పళ్ళు కావాలా?" అని అడిగాడు. అందుకు అవ్వయ్యార్ "పళ్ళు ఎక్కడైనా వేయిస్తారా? ఏమిటి?" అని అడిగింది. అపుడు స్వామి "చెప్పు! ఇంతకీ నీకు ఏ పండ్లు కావాలి?" అంటే "ఆమె వేయించిన పళ్ళు ఇవ్వు" అని కోరింది. చెట్టు ఒకసారి దులిపాడు. చాలా పళ్ళు రాలాయి.

ఆమె ఏరుకొని ఇసుకలో పడినందుకు ఊదుతూ, ఉంటే పళ్ళు వేడిగా ఉన్నట్లు అనిపించింది.. "నువ్వు ఎవరివో? సామాన్యుడవు కావు" అని తల పైకెత్తి చూడగానే, సుబ్రహ్మణ్య స్వామి ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు. ఆ స్వామిని చూచి ఆమె జ్ఞానభిక్ష పెట్టమని కోరింది.



## దేవాలయంలో జరుగు ఉత్సవాలు

దేవాలయంలో స్కందషష్ఠినాడు విశేషమైన పూజలు, ఊరేగింపు భజనలువంటివాటితోపాటు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం చేస్తారు. అంతేకాక ప్రతీ మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేస్తారు. ప్రజలు సంతానంకోసం, ఆరోగ్యం కోసం, ముఖ్యంగా చిన్నపిల్లల ఆరోగ్యంవిషయంలో, ఇతర మనోభీష్టాలను నెరవేర్చుకొనేందుకు ఆలయసందర్శనం చేస్తారు. ఈ దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామితోపాటు ఉపదేవాలయాల్లో గణపతి, శివుడు కొలువై ఉన్నారు. ఇటువంటి ప్రాచీనదేవాలయం ఇప్పటికీ ఉనికిలో ఉందంటే, స్వామివారి మహిమలవల్ల, భక్తుల మనోభీష్టాలు నెరవేరడంవల్లనే. అటువంటి దేవాలయాన్ని సందర్శించడానికి ఒక ప్రణాళిక వేసుకుని, చుట్టూఉన్న దగ్గరలోఉన్న ఇతర పుణ్యక్షేత్రాలసందర్శనకూడా చేయడంవల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది.

## ఎలా వెళ్ళాలి?

మధురై బస్టాండ్‌నుండి 44 నెంబరుగల బస్సు ఈ పళముదిర్చోలై గుడికి కొంచెందూరంలో 108 వైష్ణవ దేవాలయాల్లో ఒకటైన అళగర్‌కోయిల్ ఉంది. అక్కడవరకు ఈ బస్సు వెళ్తుంది. అక్కడ మురుగన్‌గుడి కొంచెం కొండమీద ఉన్నందున అక్కడికి వేరే చిన్నబస్సులు కూడా తిరుగుతూ ఉంటాయి.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

**పాఠం-37(అ)**

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

## अकारन्तपुलिङ्ग नामवाचकानि
(అకారాంత పుంలింగ నామవాచకములు)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| रामः | = | రాముడు | नकुलः | = | ముంగిస | वृषभ | = | ఎద్దు |
| घरट्टः | = | తిరుగలి | वृश्चिकः | = | తేలు | अश्व | = | గుఱ్ఱము |
| नागदन्तः | = | చిలుక్కొయ్య | रक्तपुच्छः | = | నల్లికళపాము | मेषः | = | మేకపోతు |
| कटः | = | చాప | चिक्रोडः | = | ఉడుత | मत्कुणः | = | నల్లి |
| मन्थानः | = | కవ్వము | खरः | = | గాడిద | मशकः | = | దోమ |
| मुसलः | = | రోకలి | सूकरः | = | పంది | ढक्कः | = | ఆంబోతు |
| कटाहः | = | గోలెము | मूषकः | = | ఎలుక | फलकः | = | బల్ల |
| मण्टपः | = | పంది | बिडालः | = | పిల్లి | कंसः | = | కంచము |
| कुशः | = | నులక | शशः | = | కుందేలు | वलः | = | వల |
| घटमञ्चः | = | గడమంచె | वानरः | = | కోతి | सर्पः | = | పాము |
| खनकः | = | పందికొక్కు | | | | | | |

## अकारन्तनपुंसकलिङ्ग नामवाचकानि
(అకారాంత నపుంసకలింగ నామవాచకములు)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| वस्त्रं | = | వస్త్రం | चूर्णं | = | పొడము | पुष्पं | = | పూవు |
| चीरं | = | చీర | उपधात्वं | = | దిండు | गोमयं | = | ఆవుపేడ |
| उलूखलः | = | రోలు | लवित्रं | = | కొడవలి | वार्ताकं | = | వంకాయ |
| शूर्पं | = | చేట | खनित्रं | = | ఉడుత | उर्वारुकं | = | దోసకాయ |
| अरण्यं | = | అడవి | वनं | = | అడవి | तक्रं | = | మజ్జిగ |
| कुसूलं | = | గాదె | आवरणं | = | స్థలం | नवनीतं | = | వెన్న |
| वानं | = | పరుగు | पर्णं | = | ఆకు | कुड्यं | = | గోడ |
| ऋजीषं | = | బాణలి | पात्रं | = | గిన్నె | पिष्टं | = | పిండి |
| अम्बरीषं | = | మంగలము | तैलं | = | నూనె | वाहनं | = | వాహనము |
| शिक्यं | = | ఉట్టె | गृहं | = | ఇల్లు | कम्बकं | = | కంబళి |
| चोलं | = | రవికె | | | | कवाटं | = | తలుపు |

# శుక్రాచార్యుడు

- శ్రీ ఐనవోలు మోహనాచార్యులు

శుక్రాచార్యుడు రాక్షసగురువు, భృగుపుత్రుడు. మనోహరశరీరం, నల్లనిజుట్టు, సౌందర్యవంతులకు ప్రతీక. శ్లేష్మ, వాత ప్రకృతిని సూచిస్తాడు. శరీరంలో సంతానోత్పత్తి వ్యవస్థకు శుక్రుడు కారకుడు. శారీరకసుఖం, భార్య, యవ్వనం, రాజసం, సౌందర్యం, వినోదం, చతుష్షష్టికళలకు కారకుడు.

పురాణాలపరంగా శుక్రుడు ధవళవర్ణపు శరీరకాంతి కలవాడు. నాలుగుభుజములు కలిగి చేతిలో రుద్రాక్షమాల, కమండలం, దండములను ధరించి ఉంటాడు. రథమును అధిరోహిస్తాడు. ఇతనికి కావ్యుడు, సితుడు, భృగుసుతుడు, దానవాచార్యుడు, ఉశనుడు అని పేర్లున్నాయి. హిరణ్యకశిపుని కుమార్తె ఉషను భృగుమహర్షి పెండ్లాడాడు. ఆ భృగుమహర్షికీ, ఉషకూ జన్మించినవాడే ఉశనుడు. ఈ ఉశనుడు శ్రీకృష్ణునిచే అనుగ్రహించబడిన కుచేలుడికి అపార ధనసంపత్తులు ప్రాప్తించడంతో వాటిని అపహరించాడు. అది పరమేశ్వరునికి



కోపం కలిగించడంతో శివుడాతనిని చంపటానికి ఉద్యుక్తుడయ్యాడు. దీంతో ఉశనుడు తన తపశ్శక్తితో సాక్షాత్తూ పరమశివుని ఉదరంలో తిష్ఠవేసి ఈశ్వరుని స్తుతించసాగాడు. బోళాశంకరునకు ఏమి చెయ్యడానికీ పాలుబోక, శుక్రుడికి అభయమిచ్చి బయటకు రమ్మన్నాడు. అలా శివుని శిశ్నంలోనుంచి ఉశనుడు బయటకు రావడంతో ఈ విధంగా ఉశనుడికి శుక్రుడు అన్నపేరు ఏర్పడింది. మన్మథనామ సంవత్సర శుద్ధ చైత్రమాస మఘనక్షత్రం ఏకాదశితిథియందు శుక్రుడిగా అవతరించాడు ఉశనుడు. శివుడాతని స్తుతికి మెచ్చి ధన, వీర్యాలకు అధిపతిగానూ, రాక్షసులకు గురువుగానూ చేసి, గ్రహమండలంలో స్థానం కల్పించాడు. ఏకాక్షి. అక్షమాల, కమండలధారి. శుక్రాచార్యుడు దానవకుల పురోహితుడు. శుక్రాచార్యుడు అసురుల అభ్యున్నతికి చేసిన కఠోరమైన తపస్సు, అభివృద్ధికి పాటుపడినంతగా వేరెవరూ చేయలేదు. తన తపస్సుతో పరమశివుని మెప్పించి యుద్ధంలో దేవతలను జయించగల శక్తిని, మృత్యుంజయవిద్యను వరంగా సంపాదించుకున్నాడు. శుక్రుడు సర్వసంపదలకే కాక ఔషధులు, రసాలకూ అధిపతి. ఆయన శక్తిసామర్థ్యాలు అద్భుతం. ఇతడు తన సమస్తసంపదలను తన దానవశిష్యులకప్పగించి స్వయంగా తపోజీవనాన్ని స్వీకరించాడు.

బ్రహ్మప్రేరణతో శుక్రుడు గ్రహమై మూడులోకాలను కాపాడసాగాడు. ఈయన గ్రహరూపంలో బ్రహ్మసభలో కొలువై ఉంటాడు. ప్రాణులకు అనుకూలగ్రహం శుక్రుడు. అప్పుడప్పుడు వానలను, అనావృష్టిని, భయాభయాలను ప్రసాదిస్తూ, వర్షాలను నిరోధించే గ్రహాలను శాంతపరుస్తూ, ప్రాణుల యోగక్షేమాలను చూచే కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటాడు.

మహనీయుల బలహీనతలు సైతం మానవాళికి కనువిప్పు కలిగించే సంఘటనలు ప్రత్యక్షరసత్యములు.

నా వెనకున్నది నా వాళ్లే కదా అని మురిసిపోతే వారే వెన్నుపోటు పొడుస్తారని గుర్తించుకో

వృషపర్వుడను రాక్షసరాజుకొలువులో శుక్రుడు మంత్రిగా భాసిల్లుతున్నరోజుల్లో త్రికాలపూజలు, నిత్యాగ్నిహోత్రాలు, విధివిధానంగా వైదికకర్మలు నిర్వహిస్తూ రాక్షసరాజులచేత శుక్రాచార్యులవారు సేవించబడుతున్నారు.

భారద్వాజనగోత్ర మణిరత్నం శుక్రుడు. సమస్తధర్మశాస్త్రకోవిదుడు. సకలవిద్యాపారంగతుడు. వేద వేదాంగాలసారాంశమును శ్రద్ధతో గ్రహించినవాడు. ధనుర్విద్యాపారంగతుడు. తేజస్సులో బ్రహ్మతో సమానుడు. మహత్తరమైన తేజస్సును కలిగినవాడు శుక్రాచార్యుడు.

దానవసామ్రాజ్యనిర్మాణ, రక్షణదక్షుడైన దైత్యగురువు శుక్రుడు. వామన అవతారంలోని ఆంతర్యాన్ని గ్రహించాడు. దానం ఇవ్వడానికి సిద్ధమైన బలితో, శిష్యవాత్సల్యం కట్టలు తెంచుకోగా సర్వదర్శి, సంజీవనీవిద్యావేత్త శుక్రుడు మాయావటువు గుట్టు రట్టుచేస్తూ ఇలా పలికాడు.. శిష్యా! ఈ డింభకుడు సామాన్య బ్రహ్మచారి కాదు. దేవకార్యసాధనకై దేవమాత అదితిగర్భాన ఆవిర్భవించిన కశ్యపపుత్రుడు ఉపేంద్రుడు. ఆదిదేవుడు- సాక్షాత్ మాధవుడు. మూడడుగుల నెపంతో ముజ్జగాలు ఆక్రమిస్తాడు. తెలియక ఈ మరుగుజ్జుకు మాట ఇచ్చావు.

ఈ దానంవల్ల మీ దానవజాతికే చేటు వాటిల్లుతుంది. నిన్ను మోసగించి నీ సంపదను సంగ్రహించేస్తాడు. దాతకే దుర్గతి కలిగించే దానం దానమే కాదని పెద్దలంటారు. తనకు మించిన ధర్మం న్యాయం కాదు. అట్టి దానం ఇస్తానని వాగ్దానం చేసి ఇవ్వకపోయినా ఆ దానదోషం- అసత్యం అంటదు. కాదని మొండిగా 'నాకు సత్యమే మెండు' అని వాదించి ఇతనికి దానమిస్తే, నీ నిండు ఆధిపత్యమే కాదు, కనీసం ఉండటానికి కూడా ఆధారం లేకుండా పోతుంది. రాజా! అడిగిన వస్తువు ఉన్నా లేదని అబద్ధం చెప్పేవాడు అల్పుడు, పిరికిపంద, ప్రాణమున్నశవంతో సమానం, వాని బ్రతుకు వ్యర్థం. అయితే, అసురేంద్రా! ఇందులో ఒక విశేషార్థముంది. శ్రద్ధగా ఆలకించు.. ఆడవారివిషయంలోనూ, పెళ్లిళ్లలోనూ, ప్రాణమానాలకు విఘాతం కలిగేటప్పుడూ, భీతిల్లిన గో బ్రాహ్మణ జాతులను ఆదుకునేసమయంలోనూ అసత్యం ఆడవచ్చు. దానివల్ల పాపం అంటదు అని హెచ్చరించాడు. అయినా శుక్రాచార్యుని మాటలు వినకుండా తాను ఇచ్చినమాటకు కట్టుబడిన బలిని రక్షించడంకోసం చేసే ప్రయత్నంలో శుక్రుడు ఒక కన్నును సైతం కోల్పోయాడు.

గొప్పపండితుడు అయిన శుక్రుడు రచించిన ఒక అద్భుతగ్రంథం "శుక్రనీతి". మానవులు ఆచరింపవలసిన ఎన్నో నీతులను బోధించింది శుక్రనీతి. శుక్రనీతి అనేది శుక్రాచార్యుడు రచించిన ఒక పురాతన భారతీయగ్రంథం, ఇది రాజనీతి, రాజ్యపాలన, సైనికవ్యూహాలు మరియు సమాజంలో క్రమాన్ని ఎలా నిర్వహించాలనేదానిపై సూచనలు ఇస్తుంది. ఈ గ్రంథం రాజుల లక్షణాలు, పరిపాలన, సైనికవ్యూహాలు, గూఢచారివ్యవస్థ, విదేశీసంబంధాలు మరియు ఇతర ముఖ్యమైన అంశాలను వివరిస్తుంది. శుక్రనీతి సమాజంలో క్రమాన్ని మరియు సామ్రాజ్యాన్ని ఎలా నిర్వహించాలనే దానిపై మార్గదర్శకసూచనలు ఇస్తుంది. ఇది రాజులకు మార్గదర్శిగా మరియు పాలనలో సహాయపడే సాధనంగా ఉపయోగపడుతుంది.

జ్యోతిషశాస్త్రంప్రకారం శుక్రుడు ప్రేమ, శృంగారం, డబ్బు, అందం మరియు కళలకు సంబంధించిన గ్రహంగా పరిగణించబడతాడు. నవగ్రహాలలో అత్యంత ప్రకాశవంతమైన గ్రహం శుక్రుడు. శుక్రుడు సూర్యునికి దగ్గరగా ఉన్న రెండవ గ్రహం. జాతకంలో శుక్రుడు బలంగా ఉంటే, వివాహజీవితం సంతోషంగా మరియు సంతృప్తికరంగా ఉంటుంది. శుక్రుడు మన సంపదకు సంబంధించిన భౌతిక ఆనందాలు, వివాహ బంధానికి సంబంధించిన అంశాలను సూచిస్తాడు. శుక్రుడు అందం, కళ, విలాసాలకు సంకేతంగా పరిగణించబడతాడు. శుక్రగ్రహదోషాలను తొలగించుకోవడంకోసం లక్ష్మీదేవి ఆరాధన శ్రేయస్కరం.



## శ్రీవిఖనసాచార్య స్తోత్రం


శ్లో॥ శ్రౌతస్మార్తాదికం కర్మ।
నిఖిలం యేన సూత్రితం।
తస్మై సమస్త వేదార్థవిదే విఖనసే నమః॥



మనసులో కత్తులు దాచుకొని, మాటల్లో పువ్వులు రాల్చే మనుషులతో జాగ్రత్త

# గురు సేవా ఫలం

-శ్రీ యం.వి.యస్.రామశేషు



**"నదీ మూలం ఋషి మూలం"**

ఎప్పటికీ తెలుసుకోలేం అని పెద్దల ఉవాచ. కథలు ఎప్పుడు పుట్టాయో, ఎలా పుట్టాయో, ఎక్కడ పుట్టాయో తెలుసుకోవడం చాలాకష్టం. లిపిలేని కాలంలో ముఖతః పుట్టింది సాహిత్యం. అందునా జానపదకథల మూలాలు తెలుసుకోవడం మరీ కష్టం. పురాణాలలో ఉన్న విశేషాంశాలతో జనపదంలో నుంచి జానపదకథలు పుట్టాయి. ఈ కథలు అనుశ్రుతంగా, మౌఖికవాఙ్మయంగా ఒకరినుండి మరొకరికి చేరి ప్రసిద్ధి పొందాయి. ఆ తరువాత లిఖితరూపంలో పుస్తకంగామారి జనుల చేతులలోకి వచ్చాయి.

ఆ కోవకు చెందినవే ఈ **"పరమానందయ్య శిష్యుల కథలు."** వీరందరూ తెలివితక్కువతనానికి, మూర్ఖత్వానికి మరో పేరు. వీరి చేతలు, మాటలు అన్ని హాస్యస్ఫోరకంగా ఉండి నవ్వును పుట్టిస్తాయి. అయితే వారు తెలివితక్కువతనంతో చేసే పనులు అందరికీ క్షేమాన్ని కలుగజేస్తాయి.


ఈ కథలకు "బెస్కిన్" అను తమిళకవి రచించిన "పరమార్థగురువిన్ కథై" మూలమని పండితవాక్కు. ఈ కథలకు దేశకాల పరిమితులు లేవు. అటువంటి శిష్యులు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ఉంటారు. గురువులలో "శిక్షా గురుః, దీక్షా గురుః, ప్రేరక గురుః, బోధకగురుః, దర్శక గురుః" అని అనేక రకాలు. గురువు శిష్యుని మానసికస్థితిని అనుసరించి అవసరాన్ని బట్టి విద్యార్థులమనసును సంస్కరిస్తాడు.

పూర్వం అరుణకేశి అను మహర్షి ఉండేవారు. ఆయనవద్ద 12మంది శిష్యులు ఉండేవారు. వారందరూ మంచివారు, సత్యమునే వచించేవారు. దొంగతనంగాని, ఇతరులను వంచించడంగాని తెలియనివారు. గురుశుశ్రూష, విద్యాభ్యాసంతప్ప అన్యమెరుగని ఉత్తములు. అరణ్యాలలో ఉండి గురుఆజ్ఞ పాటించేవారే కానీ ఎన్నడు స్త్రీలను చూచి ఎరుగరు. గురువు చెప్పిన పాఠం తప్ప వారికి అన్యచింతనలేని పరమేశ్వరుని భక్తులు. వారొకసారి యజ్ఞార్థమై దర్భలసేకరణ కోసం అరణ్యానికి వచ్చారు. దప్పిగొని సమీపంలోని జలాశయం దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో కొందరు దేవకన్యలు భూలోకసౌందర్యాన్ని చూడటానికి వచ్చి, ఒక జలాశయంలో స్నానమాచరిస్తున్న ఆ దేవకన్యలను మునికుమారులు చూచారు. స్త్రీలను చూచి ఎరుగని వారు ఆశ్చర్యంతో వారినే చూడసాగారు. ఆ ఋషి కుమారులను చూచిన దేవకాంతలు వారిని బుద్ధిహీనులుకమ్మని శపించారు. అంతలో అక్కడికి వచ్చిన మహర్షి తన శిష్యుల అమాయకత్వాన్ని వారికి తెలిపి స్త్రీలైన మీరు ఆ విధంగా స్నానాలు చేయటం తప్పని శపించబోయాడు. అందుకు వారు ఆయనను ప్రార్థించగా, వారి ప్రార్థనను మన్నించి, ముందు వీరి శాపవిముక్తిని తెలియజేయమన్నాడు. వారప్పుడు తమచెలి వివాహమైన తరువాత వారు పరమేశ్వరానుగ్రహంతో శాపవిముక్తులౌతారని చెప్పారు. మహర్షి వారిని ఆశీర్వదించి, అరణ్యసమీపాన ఉన్న విజయదుర్గనగరమందున్న విప్రోత్తముడు, దయాశాలి, విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న పరమానందయ్యగారివద్దకు వెళ్ళమని శిష్యులకు చెప్పాడు. దేవకన్యల శాపంచేత తెలివికోల్పోయి, బుద్ధిహీనులైన ముని కుమారులు దారితెన్ను తెలియక అరణ్యాల్లో తిరుగుతూ పరమానందయ్యగారివద్దకు చేరుకున్నారు. ఆయనవద్దకు వెళ్లి తమ ఆకలిని తీర్చమని ప్రార్థించారు. పరమానందయ్యగారు వారి తేజస్సును, అమాయకత్వం చూచి వీరెవరో శాపగ్రస్తులైన తేజోమూర్తులని భావించాడు. తన శిష్యులుగా చేర్చుకున్నాడు. నాటినుండి వారు పరమానందయ్య శిష్యులుగా ప్రసిద్ధి పొందారు. ఆయనభార్య సైతం వారిని పుత్రులవలె ఆదరించింది.

ఈశ్వరభక్తుడైన పరమానందయ్య వీరికి భృంగి, నంది, గణపతి మొదలుగాగల పరమేశ్వరుని ప్రమథగణాలపేర్లను పెట్టాడు. ఈ విధంగా శాపగ్రస్తులైన మునికుమారులు పరమానందయ్యగారి ఆశ్రమంలోకి చేరుకున్నారు. ఐతే వీరు చేసే పనులన్నీ మొదట ఇబ్బందిని కలిగించినా చివరకు మేలు చేసేవి. శిష్యుల అమాయకత్వం, వారి తెలివితేటలు మంచికే దారి తీసేవి. దాంతో గురుశిష్యుల ప్రతిసంఘటన రసాత్మకంగా ఉండేదే తప్ప ఏ విధమైన అసభ్యతకు దారి తీయలేదు.

ఒకసారి పరమానందయ్యగారు గ్రామాంతరం వెళుతూ వారినికూడా తనవెంట తీసుకొని బయలుదేరారు. మధ్యలో ఏరు దాటవలసి వచ్చింది. అవతలిఒడ్డుకు చేరినతర్వాత ఎంతమంది ఉన్నామో లెక్క చూసుకుందాంలే అనుకున్నారు. పడవదిగిన తరువాత ప్రతివాడు తనను వదిలిపెట్టి లెక్క పెట్టుకోవడం మొదలుపెట్టారు. దాంతో ఎన్నిసార్లు లెక్కించినా ఒకడు తగ్గాడు. ఒకడు నదిలో కొట్టుకుపోయాడని ఏడవటం ప్రారంభించారు. చివరకు గురువుగారు అందరిని లెక్కపెట్టి చెప్పారు. అపుడు వారు అందరమూ బ్రతికే ఉన్నామని ఆనందించారు. అది వారి అమాయకత్వానికి పరాకాష్ఠ.

ఒకసారి గ్రామాంతరం వెళ్ళిన గురువుగారు తిరిగివచ్చి కాళ్లు పట్టమని శిష్యులను పిలిచాడు. శిష్యులందరూ పోటీపడి ఆయన కాళ్లు పట్టడం ప్రారంభించారు. చివరకు వాళ్లు ఆయనకాళ్ళను స్వాధీనం చేసుకొని ఇది నా కాలు, ఇది నా కాలు అని రెండుకాళ్ళను పంచుకున్నారు. వారిలోవారే నా కాలు బాగుంది, నీ కాలు బాగాలేదు అని చివరకు ఆయనకాళ్లు నరకటానికి సిద్ధపడ్డారు. పరమానందయ్యగారి కేకలు విన్న ఆయన భార్య అక్కడికి వచ్చి వాళ్ళందరిని పక్కకు నెట్టేసింది. అప్పుడు ఆయన పక్కమీదనుంచి లేచేసరికి ఆ పడకక్రింద నుంచి ఒక పాము జరజరప్రాకి పారిపోయింది. దానిని చూసిన భార్యాభర్తలు శిష్యుల హడావుడికి భయపడిన ఆ పాము చివరకు పారిపోయింది. లేకపోతే ఎంత ప్రమాదం జరిగేదోకదా! వారి మూర్ఖపు అల్లరికూడా తమకు మేలే చేసిందని ఆనందించారు. అలా ఎన్నోసార్లు ఆపదలనుంచి కాపాడటం జరిగింది. వారికుమార్తె వివాహవిషయంలో వీరు తెలివితక్కువతనంతో చేసిన చేతలుకూడా వారికి మేలే చేసింది. కానీ కూర్చున్న కొమ్మ నరుక్కోవటం, సూదిని దూలానికి గుచ్చి తేవటము, గుర్రం గుడ్డని ఏదోగుడ్డును తేవటం, పాలిచ్చేగోవు అని ఇతరులు చెప్పిన మాటవిని చచ్చిపోయిన ఆవును ఇంటికితేవడంవంటి పనులన్నీ వారి తెలివితక్కువతనానికి నిదర్శనం.




చివరకు శాపం ఇచ్చిన దేవకన్య వివాహం అయిన తరువాత పరమేశ్వరుని అనుగ్రహంతో శాపవిముక్తిని పొంది తిరిగి తమ తెలివితేటలను పొందారు. ఇన్నిరోజులు తమకు ఆశ్రయమిచ్చిన గురువు పరమానందయ్యకు నమస్కరించి తిరిగి తమ గురువు అయిన మహర్షిచెంతకు చేరుకున్నారు.

“ధ్యాన మూలం గురోర్మూర్తిః  
పూజా మూలం గురోః పదం!  
మంత్ర మూలం గురోర్వాక్యం  
మోక్ష మూలం గురోః కృపా”!!

శుభాన్ని కలుగచేస్తుందనటానికి పరమానందయ్య శిష్యుల కథే మనకు ఉదాహరణ.

“ఆచార్య శాస్త్రాయా జాతిః  
సానిత్యా సాఽజరాఽమరా”

గురుశుశ్రూష చేసి, గురుశిక్షణ శిక్షలను పొందిన ఏ జాతి అయినా చాలాకాలం అజరామరమై నిలుస్తుంది అన్నది వేదవాక్యం. అందుకు పరమోదాహరణం పరమానందయ్య శిష్యులకథయే.

యువత

# విజయసూత్రం

– డా॥ డి.ఊర్మిళాదేవి

డేగ చెట్టుమీదకానీ, కొండమీదకానీ కూర్చున్నప్పుడు చూశారా? దాని శరీరం కదలకుండా ఉంటుంది కానీ తల మాత్రం అటూఇటూ కదుపుతూ తన ఆహారాన్ని గుర్తించడానికి ప్రయత్నిస్తుంది. ఆకాశంలో ఎగురుతున్నప్పుడుకూడా డేగ తనదృష్టంతా తన ఆహారాన్ని గుర్తించడంమీదే కేంద్రీకరిస్తుంది. ఎల్లప్పుడూ లక్ష్యంమీదే దృష్టిని కేంద్రీకరిస్తే విజయం తప్పక సాధించవచ్చనే విజయసూత్రాన్ని మనం డేగనుండి నేర్చుకోవచ్చు. డేగ దేనికీ భయపడదు.

పెద్దప్రాణిని తనకాళ్ళతో తన్నుకుని ఎగరడానికి అవసరమైన శక్తినిపొందడానికి మరింత ఎక్కువ దూరంనుండి, మరింత ఎక్కువ ఎత్తునుండి ఎగురుతూ ఆ ప్రాణిమీదకు దాడిచేస్తుంది. అందుకే తనకంటే కొన్నిరెట్లు ఎక్కువబరువు ఉండే జీవినికూడా డేగ తనకాళ్ళతో తన్నుకెళ్తుంది.

బలమైన గాలులు వీచినప్పుడు డేగ తప్ప మిగిలిన పక్షులన్నీ భయపడి పారిపోయి చెట్లచాటున, పొదలచాటున దాక్కుంటాయి. కానీ అది మాత్రం తన రెక్కలు పూర్తిగా విప్పి బలంగా వీస్తున్న గాలి శక్తిని ఆధారంగా చేసుకుని మరింత ఎక్కువ ఎత్తుకి ఎగురుతుంది. సమస్యలు, కష్టాలు, అవరోధాలు ఎదురైనప్పుడు కొందరు భయపడి లక్ష్యసాధననుండి పారిపోతారు. కానీ మరికొందరు సమస్యలను, కష్టాలను, అవరోధాలను అవకాశాలుగా మార్చుకుంటారు. తద్వారా చిర స్మరణీయమైన విజయాలు సాధిస్తారు.


అత్యంత ఎక్కువకాలం (సుమారు డెబ్బై సంవత్సరాలు) జీవించే పక్షి డేగ. కానీ నలభైసంవత్సరాలు దాటేసరికి దాని ముక్కు పదునుపోయి బండగా తయారవుతుంది. దృఢమైన కాలిగోళ్ళు పటుత్వాన్ని కోల్పోతాయి. అందువలన డేగ వేటాడలేదు. ఆహారాన్ని తినలేదు. అప్పుడు దానికి రెండు మార్గాలుంటాయి. 1)వేటాడలేక, ఆహారాన్ని సంపాదించలేక, తినలేక చనిపోవడం. 2) తన శక్తి సామర్థ్యాలను మరింత మెరుగుపరచుకోవడం. డేగ రెండవమార్గాన్ని ఎంచుకుని ఏదైనా కొండశిఖరంపైకివెళ్ళి తన ముక్కుతో కొండని అదేపనిగా కొట్టుకుంటుంది. అలా ముక్కు ఊడిపోయేవరకు కొట్టుకుంటూనే ఉంటుంది. కొత్తముక్కు పెరిగేవరకు ఓపికగా వేచి ఉంటుంది. కొత్తముక్కు పెరిగాక ఆ ముక్కుతో తన కాళ్ళగోళ్ళని పీకేస్తుంది. కొంతకాలానికి కొత్తగోళ్ళు పెరుగుతాయి. కొత్తగోళ్ళు పెరిగాక తన రెక్కలకున్న ముసలి ఈకలన్నింటిని పీకేస్తుంది. కొన్నాళ్ళకు కొత్తఈకలు వస్తాయి. ఈ ప్రక్రియమొత్తం పూర్తికావడానికి ఐదునెలలు(150రోజులు) పడుతుంది. అలా తనను తాను మార్చుకుని డేగ మరో 30 సంవత్సరాలు బ్రతుకుతుంది. గ్లోబల్‌వార్మింగ్ మరియు పరిశ్రమలనుండి వెలువడుతున్న విషవాయువులమూలంగా ఏర్పడిన వాయుకాలుష్యంవలన కొన్ని పక్షులు ఊపిరాడక చనిపోతున్నాయి.

వ్యక్తిగతజీవితాలలో, వృత్తి మరియు వ్యాపారాలలో మార్పులు రావడం అనేది సహజం. ఆహారపు అలవాట్లవలనకానీ, శారీరకశ్రమ లేకపోవడంవలనకానీ ఒక వ్యక్తి ఉండవలసినదానికంటే రెట్టింపు బరువు పెరిగి తన పనులు తాను చేసుకోలేకపోతున్నాడు.ఆ వ్యక్తి డైట్‌కంట్రోల్ చేస్తూ కష్టపడి వ్యాయామం చేసి బరువు తగ్గితేనే సంతోషకరమైన, సౌకర్యవంతమైన జీవితం జీవించగలడు.

బాహ్యమార్పులకు, అంతర్గతమార్పులకు అనుగుణంగా మనల్ని మనం మార్చుకుని ముందుకు సాగితేనే మనం విజయం సాధించగలుగుతాం అనే విజయసూత్రాన్ని మనం డేగనుండి నేర్చుకోవచ్చు. అలాగే కష్టమనిపించినా మార్పుకోసం చేసే ప్రయత్నాన్ని మధ్యలోనే ఆపేయకుండా చివరివరకూ ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చనే విజయ సూత్రాన్నికూడా మనం డేగనుండి నేర్చుకోవచ్చు.



ధారావాహిక




*(గత సంచిక తరువాయి భాగం...)*

తిరుమల తిరుపతులందు నిత్యవాసులైన భగవద్రామానుజ సంబంధులెల్లరును, శ్రీవేంకటేశ్వరస్వామివారు పెద్ద తిరువధ్యయనోత్సవ (రాపత్తు) తిరునాళ్లలో ఆరవదినమున సాయంకాలమున శ్రీవీథియందు ఊరేగి శ్రీగోపురము వాకిలి ముంగిట ఆరుబయట విజయము చేసిన తరువాత శ్రీభూదేవులిరువురును దేవాలయమునుండి బయలువెడలి భగవంతునకు ఎదురుగా వచ్చి నిలువగ, అప్పుడు గాయకులు దేవేరుల సమీపమున నిలచియుండి, దేవేరులు చెప్పుచున్నట్లుగా మిన్నిడైమడవార్ (మెరుపుతీగవంటి నడుముగలవారు) ప్రణయ కలహప్రబంధమునందలి ప్రథమఘట్టమును (10 పాశురములు) స్వామివారిని చూచి చదువగ పిమ్మట స్వామివారి సమీపమున ఒక శ్రీవైష్ణవుడు నిలచియుండి రెండవ ఘట్టమును (కొన్ని పాశురములు) పఠింపగా, ఇట్లు దేవేరులును స్వామియు పరస్పరము ఉత్తర ప్రత్యుత్తరములు చెప్పుచున్నట్లుగా గాయకులు, శ్రీవైష్ణవులును పరస్పరము ఆయా ఘట్టములను శ్రీవైష్ణవులు వినునట్లుగ అనుసంధింతురు. పదపడి 'కూడల్‌వళైప్పు' అనెడు ద్రావిడ శాస్త్రసిద్ధమైన శకునపరీక్షను తండులములపై రేఖారూపమున గీచి, (కూడల్‌వళైప్పు) వీరి ప్రణయకలహమును తీర్చి పరస్పరము సంగతులనుగాచేసి మంగళాశాసనమొనర్చి ఉత్సవములను నెరవేర్తురు. దీనిని 'పందుం కళలుమ్ వతిప్పు' (బంతి గచ్చకాయలు అపహరించుట) అని పెద్దలు చెప్పుదురు. ఈ విధముగ ఉత్సవమును స్వామివారు స్వీకరించుటకు కారణమును పేర్పడిన స్వప్నవృత్తాంతము.

కాత్యాయనుడు –

**తృప్యంతి బ్రహ్మఘోషేణ పితరః సహ దేవతైః,**
**అతస్తద్దివసే విప్రః వేదపారాయణం చరేత్.**

(దేవతలు పితరులతోబాటు వేదఘోషముచేత తృప్తి నొందెదరు. కావున ఆ దినమునందు బ్రాహ్మణుడు వేదపారాయణము చేయవలెను.)

విష్వక్సేనసంహితయందు–

**పుష్పయాగేచ పూజాయాం దేవస్యోత్సవసంభవే,**
**వేదపారాయణం కుర్యాత్ దైవే పిత్రుదినే తథా.**

(పుష్పయాగమునందు పూజాసందర్భమున దేవునకు ఉత్సవము సంభవించినపుడు దేవసంబంధిదినమునందును, పితరులదినమునందును వేదపారాయణము చేయవలెను.)

### శ్రీవేంకటేశ్వరునకును, శ్రీగోవిందరాజస్వామికిని ఆరాధన చేయునపుడు వేదపారాయణ చేయవలసిన క్రమము

వేదచతుష్టయము, కల్పసూత్రము, శ్రీరామాయణము, శ్రీవిష్ణుపురాణము, శ్రీవేంకటాచలమాహాత్మ్యము, శ్రీచిత్రకూట మాహాత్మ్యము, ఇయల్ (దివ్యప్రబంధసంకలనము), ఆళవందార్ (యామునాచార్య) స్తోత్రము, శ్రీవైకుంఠస్తవము అనుసంధేయములు. ఆళ్వార్ శ్రీసూక్తియగు గీతమును రెండుమారులను సంధింపవలెను. శ్రీవైష్ణవుల గృహములందు పిత్ర్యాద్యుత్సవముల నుద్దేశించి శ్రీముఖసూక్తి యారంభించునపుడు 'తృప్యంతి బ్రహ్మఘోషేణ', 'పుష్పయాగే చ పూజాయామ్' మున్నగువానిచే వేదపారాయణము చేయవలెనని విధియున్నందువలన, నాలుగు వేదములను ఆరంభించి శ్రీముఖసూక్తియారంభింపవలయును.

*(ఇంకా ఉంది)*




**నా** పేరు బిట్రా వెంకటేశ్వరరావు. మాది మంగళగిరి. మాది పెద్దకుటుంబం మరియు బీదకుటుంబం. నాకు 14 సం॥ల వయస్సులో ఉన్నప్పుడు నా స్నేహితుడు కుటుంబరాజు వెంకటేశ్వరస్వామిపటం నాకిచ్చి ప్రతిరోజు సుప్రభాతం చదువుకోమన్నాడు. ఆ రోజునుంచి నిత్యం దీపారాధనచేసి సుప్రభాతం చదివిన తదుపరి కార్యక్రమాలు చేసేవాణ్ణి.

నేను వడ్రంగంపని, సైకిల్‌షాపుపని చేసేవాణ్ణి. అయినా పూట గడవడంకూడా కష్టంగా ఉండేది. మా పెద్దమ్మ కుమారుడు ఆర్.టి.సి.లో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఒకరోజు నేను మా తమ్ముణ్ణి ఆర్.టి.సి.లో నాకు కూడా ఏదైనా ఉద్యోగం ఇప్పించమని అడిగాను. ఆయన నన్ను తీసుకొనివెళ్లి 'ఎంప్లాయిమెంట్‌కార్డు' ఖమ్మంలో తీసుకొని ఆర్.టి.సి.లో నాకు రోజు కూలి ఉద్యోగం ఇప్పించాడు. మూడు సం॥ల తర్వాత 'కోచ్ బిల్డర్'గా చేస్తున్న నన్ను తీసివేసి హైదరాబాద్‌నుంచి నా ప్లేస్‌లో వేరే అతను చేరటానికి ఆర్డరు వచ్చింది. ఇక నన్ను తీసివెయ్యాలి. ఆ సమయంలో నేను డిపో చెకింగ్ ఇంజనీరుకి నా బాధ చెప్పుకున్నాను. దేవుని కృపవలన అయనమనస్సు మారి నన్ను ఖమ్మండిపోకి పంపించారు. 2 సం॥ల తర్వాత పర్మనెంట్ చేశారు.

నాకు వచ్చిన 'ఫస్ట్‌పాస్' తిరుమలకు పెట్టాను. అప్పటినుంచి నేను ప్రతి సంవత్సరము తిరుమలకు వెళ్లుతున్నాను. ఈ రోజుకి నేను రిటైర్ అయి పిల్లలతో సొంతఇంటిలో ఉంటూ సుఖంగా జీవనం గడుపుతున్నాను అంటే ఇది అంతా ఆపద్బాంధవుడు, కరుణామయుడు అయిన శ్రీనివాసునిలీల అని నేను ముమ్మాటికి నమ్ముతున్నాను.

# తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థాన మహోత్సవం

## జూలై 16, 2025న శ్రీవారి ఆణివరఆస్థానం & శ్రీవారి పుష్పపల్లకిసేవ సందర్భంగా...

**ఈ** ఉత్సవంరోజున ఉదయం బంగారువాకిలిముందున్న ఘంటామండపంలో సర్వభూపాలవాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరోపీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతోపాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో "పరివట్టం"(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యో భవ' అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు తిరుమల పెద్దజీయ్యర్‌స్వామివారికి, చిన్నజీయ్యర్‌స్వామివారికి, తి.తి.దే. తరఫున కార్యనిర్వహణాధికారికి 'లచ్చన' అను తాళపుచెవిగుత్తిని వరుసక్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపుచెవిగుత్తిని శ్రీవారి పాదాలచెంత ఉంచుతారు.



ఈ విధంగా సాలకట్ల ఆణివరఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి తిరుమలలో ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

సాయంత్రం శ్రీదేవి, భూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధులగుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు.

చిత్ర కథ

# బాల్యంలో బాగుందాం!!

కథ- శ్రీమతి వావిలాల నాగవల్లి
చిత్రాలు- డా॥ శ్రీధరన్ కౌలికి

హస్తినాపురంలో పాండవులు, కౌరవులు విద్యాభ్యాసంతో, వివిధ క్రీడావిలాసాలతో కాలం గడుపుతున్నారు. అందులో భీముడు తన ఆటపాటలతో కౌరవులను ఎప్పడూ బాధపెడుతూ, అపహాస్యం చేస్తూ, హింసిస్తూ ఉండేవాడు. ఆ భీముడిధాటికి తట్టుకోలేక తమ అన్న దుర్యోధనుడివద్దకెళ్ళి మొర పెట్టుకున్నారు అతని తమ్ముళ్లు. ఆ తర్వాత కథేంటంటే......






**నీతి** మొక్కైవంగనిది మానై వంగదు. బాల్యంలోనే పగలు, ప్రతీకారాలులాంటివి పెట్టుకుంటే అవి మనతోపాటే పెద్దయ్యాకకూడా పెరుగుతూపోతుంటాయి. కాబట్టి వాటిని బాల్యంలో తుంచేస్తేనే ఆ తర్వాత జీవితంలో శాంతి సౌఖ్యాలను పొందుతాం...

ఆయుర్వేదం

# నల్లజీలకర్ర

- డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ప్రకృతిలో లభించే వృక్షోత్పత్తుల్లో కొన్ని ప్రత్యేకంగా ఆహారంగాను, మరికొన్ని ఔషధంగాను ఉపయోగపడుతూ మన ఆరోగ్యాన్ని కాపాడుతూ అనారోగ్యసమస్యలనుండి రక్షిస్తుంటాయి.

వీటిలో ఎక్కువగా ఔషధంగా వినియోగింపబడే నల్లజీలకర్రని కృష్ణజీరక అని సంస్కృతంలో వ్యవహరిస్తారు. బ్లాక్‌కుమిన్‌సీడ్స్‌గా ఇంగ్లీషులో పిలువబడే ఈ నల్లజీలకర్రని పచారికొట్లలోకూడా విక్రయిస్తారు.

ఇందులో అపారఔషధగుణాలున్నాయి. ఏయే వ్యాధుల్లో ఈ నల్లజీలకర్రని మనం ఎలా సద్వినియోగం చేసుకోవాలో ప్రస్తుతం తెలుసుకుందాం.

నల్లజీలకర్రని వేయించి ఔషధప్రయోజనాలకు వాడుకోవాలి.

**చర్మవ్యాధులకు-** నల్లజీలకర్ర, పసుపు, ముద్దకర్పూరం చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకుని రోజూ రెండుసార్లు తగినంతపొడిలో తగినంత కొబ్బరినూనె కలిపి లేపనం చేస్తుంటే గజ్జి, తామర, దురదలు, సోరియాసిస్‌లాంటి చర్మవ్యాధులు తగ్గుతాయి.



**దీర్ఘకాలికజ్వరాలు, విషమజ్వరాలకు-** 50గ్రా॥ నల్లజీలకర్ర చూర్ణం, 50గ్రా॥ బెల్లం కలిపి మెత్తగా దంచి లేదా మిక్సీలో వేసి కలిపి నిల్వఉంచుకుని రోజూ మూడుపూటలా ఆహారానికి 15నిమిషాలముందు పూటకు 2గ్రా॥ ఔషధాన్ని సేవించి అనుపానంగా కప్పు గోరువెచ్చనిపాలు లేదా నీరు కలిపి సేవిస్తుంటే వివిధరకాలజ్వరాలు తగ్గుతాయి.

**నల్లమచ్చలు తగ్గేందుకు-** 100 గ్రా॥ తేనె మైనాన్ని ఒక గిన్నెలో తీసుకొని వేడిచేసి పొడిచేసి కరిగించి పావుటీస్పూనుచొప్పున నల్లజీలకర్ర, బావంచాలు, కస్తూరిపసుపుచూర్ణాలను కలిపి చల్లారాక నిల్వఉంచుకుని రోజూ ఒకసారి లేపనం చేస్తుంటే ముఖంపై వచ్చే నల్లమచ్చలు, మంగుమచ్చలతోపాటు ఒంటిపై వచ్చే వివిధరకాలమచ్చలు తగ్గుతాయి.

**ఎక్కిళ్ళు తగ్గేందుకు:** సమస్య తీవ్రతనుబట్టి రోజూ 2, 3సార్లు పూటకు ఒకగ్రాము నల్లజీలకర్రచూర్ణాన్ని 100మి.లీ. మజ్జిగలో కలిపి రెండుమూడు చిటికెలఉప్పుకూడా కలిపి సేవిస్తే త్వరగా బాధ నివారణ ఔతుంది.

**పక్షవాతం తగ్గేందుకు:** 50గ్రా. నల్లజీలకర్రచూర్ణంలో 25గ్రా. చొప్పున వచచూర్ణం, శుంఠిచూర్ణం కలిపిఉంచుకుని ఉదయం, రాత్రి ఆహారానికి 15నిమిషాలముందు పూటకు ఒకట్రెండు గ్రాములచొప్పున తగినంతనీరు లేదా ఒకటీస్పూన్ తేనెతో కలిపి తీసుకుంటుంటే త్వరగా ఆ సమస్యనుంచి బయటపడవచ్చు.

**దగ్గు, జలుబు, ఉబ్బసం తగ్గేందుకు:** రోజూ 2పూటలా పూటకు ఒకగ్రాము నల్లజీలకర్రచూర్ణాన్ని తగినంతతేనెతో కలిపి సేవిస్తుంటే అలర్జీలు, ఇన్ఫెక్షన్లు వగైరాలవల్ల కలిగే దగ్గు, జలుబు, ఆస్త్మాలాంటిసమస్యలు తగ్గుతాయి.

**షుగర్‌వ్యాధి నియంత్రణకు:** నల్లజీలకర్ర, మెంతులను వేయించి చేసిన చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకుని రోజూ రెండు పూటలా ఆహారానికి 15నిమిషాలముందు 2గ్రాములచొప్పున 50 మి.లీ.నీటిలో కలిపి సేవిస్తుంటే చక్కెరవ్యాధి నియంత్రణలో ఉంటుంది.

**సూచన:** ఈ వ్యాసంలో పేర్కొన్న దినుసులు పచారికొట్లలో దొరుకుతాయి.



మంచివాడికంటే మంచిగా నటించేవాడే ఈ ప్రపంచంలో అత్యంత ప్రమాదకారి

# క్విజ్ 36

01) మార్కండేయుని తండ్రి? జ)............

02) లోకం మొత్తానికి మొదటి పూజ్యురాలు? జ)............

03) గురుబలంకోసం పఠించాల్సిన స్తోత్రం? జ)............

04) బృహస్పతి వాహనం? జ)............

05) దేవగురువు? జ)............

06) శ్రీకృష్ణుడు సుభద్రతో చేయించిన వ్రతం? జ)............

07) 'మరకతమణి'కి మరో పేరు? జ)............

08) అన్నిరకాల జంతుజాతులకు జనకుడు? జ)............

09) రాక్షసులకు కులగురువు? జ)............

10) విద్యను ప్రసాదించే మాత? జ)............

11) చక్రధారి? జ)............

12) అపాయంపై జయం పొందే విధం? జ)............

13) నవ్వుని గురించి తెలిపే శాస్త్రం? జ)............

14) శ్రీకృష్ణబలరాముల గురువు? జ)............

15) మధురైకి దగ్గరగా ఉన్న ప్రసిద్ధ మురుగన్ ఆలయం? జ)............

16) శుక్రాచార్యుడు శివునివరంవల్ల పొందిన విద్య? జ)............

17) అత్యంత ఎక్కువకాలం జీవించే పక్షి? జ)............

18) నల్లజీలకర్రకి సంస్కృతపదం? జ)............

19) చాతుర్మాస్యదీక్ష ప్రారంభరోజు? జ)............

20) 'మృతసంజీవనివిద్య'ను శుక్రాచార్యుడు ఎవరికి నేర్పాడు? జ)............

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-07-2025.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ............ వయస్సు: ............

పాఠశాల: ............ తరగతి: ............

పేరు: ............

చిరునామా: ............

............

............

............ పిన్‌కోడ్: ............

ఫోన్ సంఖ్య: ............

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# కదంబం

## ద్వావింశతి(22) విష్ణుకళలు


01) వైష్ణవికళ
02) జారుకళ
03) పాలినీకళ
04) శాంతికళ
05) ఈశ్వరికళ
06) రతీకళ
07) కామినీకళ
08) వరదాకళ
09) హ్లాదినీకళ
10) ప్రీతికళ
11) దీఘానకళ
12) రుద్రకళ
13) తీక్షాకళ
14) రౌద్రకళ
15) భయాకళ
16) నిద్రాకళ
17) తంత్రీకళ
18) క్షుత్తుకళ
19) క్రోధినీకళ
20) క్రియాకళ
21) ఉద్గారీకళ
22) మృత్యుకళ

(సాంద్ర)

## జతపరచండి


| | |
|---|---|
| 01) ప్రతిమామండపం | అ) కల్యాణమండపం |
| 02) అద్దాలమండపం | ఆ) శిక్యోత్సవం |
| 03) మహామణి మండపం | ఇ) అంకురార్పణ మండపం |
| 04) రంగమండపం | ఈ)సాళువనరసింహ రాయలు |
| 05) తిరుమలరాయ మండపం | ఉ) రంగనాయక మండపం |
| 06) ధ్వజస్తంభ మండపం | ఊ)ఘంటా మండపం |
| 07) నాలుగుకాళ్ల మండపం | ఋ) అయినామహల్ |
| 08) నిత్యకల్యాణం పచ్చతోరణం | ౠ)శ్రీకృష్ణదేవరాయ మండపం |

జవాబు: 1)ఋ 2)ౠ 3)ఈ 4)అ 5)ఊ 6)ఇ 7)ఉ 8)ఆ



ఈ అక్కాచెల్లెళ్లు నాగులపుట్ట దగ్గరికెళ్లి పాముకు పాలు పోయాలంట. నాగులపుట్టకు దారి చూపుదామా మరి!!

## రంగులేద్దాం



# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం-** తలపెట్టిన పనులు సకాలంలో పూర్తౌతాయి. వ్యవహారజయం, ఉద్యోగ విషయాల్లో ముందంజ. అన్ని వృత్తులవారికి జీవనవృద్ధి, వ్యక్తిగతలాభం, స్థాయి పెరగడం, పుష్కలమైన ఆరోగ్యం కలుగుతాయి.

**వృషభం-** ఖచ్చితమైన ప్రణాళిక, ఆదాయమార్గాలు పెరగడం, ఆశయసిద్ధికోసం నిరంతరకృషి మరియు సత్ఫలితం పొందటం, శుభవార్తలు వింటారు.

**మిథునం-** వీరు పనిచేసేచోట కొన్ని ఒడిదుడుకులను ఎదుర్కొంటారు. నచ్చనిప్రదేశానికి వీరు బదిలీ చేయబడతారు. అధికధనం ఖర్చు చేస్తారు. ఇతరులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తారు.

**కర్కాటకం-** కొత్త పథకాలకు రూపకల్పన చేసుకోవలసి ఉంటుంది. స్థానచలనసూచన ఉన్నాయి. శుభకార్యాలనిమిత్తం ధనం ఖర్చు చేస్తారు. విషజ్వరాలబారినపడే అవకాశముంది.

**సింహం-** చురుకైన స్వభావం మరియు ఆత్మవిశ్వాసాన్ని కలిగిఉంటారు. అహం కారణంగా ఇతరులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. మీ వ్యక్తిగతజీవితం సమస్యలను కలిగిస్తుంది.

**కన్య-** అధికారుల అండదండలు కలుగుతాయి. మీకు వృత్తి వ్యాపారాలలో గుర్తింపు, కళాకారులకు ఉన్నతస్థాయి పురస్కారాలు వస్తాయి. వృత్తిపరమైనరంగంలో పేరు మరియు గుర్తింపు పెరుగుతుంది.

**తుల-** మద్యంవ్యాపారులకు, వడ్డీవ్యాపారుల కాళ్ళకు కళ్ళెం పడుతుంది. ప్రభుత్వంనుండి అవరోధాలు కల్గుతాయి. దీర్ఘకాలికప్రణాళికలు రూపొందిస్తారు. ముందుచూపుతో ప్రమాదాన్ని నివారిస్తారు.

**వృశ్చికం-** గౌరవ సన్మానాలు పొందుతారు. కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. సంప్రదాయవాదులుగా మీకు గుర్తింపు వస్తుంది. నామినేటెడ్ పదవి మిమ్ములను వరిస్తుంది.

**ధనుస్సు-** భార్యాభర్తలమధ్య సంబంధాలు బాగుంటాయి. గొప్ప మేధాసామర్థ్యాన్ని కలిగి కార్యక్రమాలు, ప్రణాళికలను పూర్తి చేయడానికి ప్రభుత్వ మరియు భాగస్వాముల మద్దతు కలిగి ఉంటారు.

**మకరం-** శ్రేయస్సు మరియు ఆరోగ్యసంబంధ ప్రతికూలతలను సమర్థవంతంగా అధిగమిస్తారు. సవాళ్లను స్వీకరించి ఆచరణలో విజయవంతంగా పూర్తి చేస్తారు.

**కుంభం-** మాటధోరణివలన ఇతరులతో కలహం వచ్చే సందర్భాలను నివారించుకోవాలి. ఆర్థికంగా ప్రయోజనం ఉంటుంది. ధనం నిల్వ చేస్తారు. కుటుంబసభ్యులు ఆనందంగా ఉంటారు.

**మీనం-** కీళ్లనొప్పులు, జ్వరంలాంటి అనారోగ్యానికి వైద్యుని సంప్రదించవలసి ఉంటుంది. మానంలో మొదటిపక్షం అనుకూలత లేదు. స్థానచలనం అయ్యి కుటుంబానికి దూరంగా వేరే ప్రాంతాల్లో గడపాల్సి వస్తుంది.

భరిస్తున్నారు కదా అని ఇతరులను ఎక్కువగా బాధపెట్టకు. బంధాలు పుటుక్కుమని తెగిపోతాయి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.................................................................... తేది :...................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 114



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం**

1)ఆషాఢశుద్ధఏకాదశి. ఈ రోజున చాతుర్మాసదీక్ష ప్రారంభమవుతుంది(6); 6)సరస్వతీనది సముద్రంలో కలిసేచోటున ఉన్న పుణ్యతీర్థం(4); 7)యాగాశ్వమును విడిపించుటకై వెళ్ళిన అర్జునుడు ఈమెను వివాహం చేసుకొన్నాడు(3); 9)రఘువంశపురాజు(5); 10)గద్యభేదము(3); 11)సుగ్రీవునిభార్య(2); 12)వ్యాసునికి దాసియందు పుట్టిన కుమారుడు(4); 15)ప్రమతికి ఘృతాచియందు పుట్టిన కుమారుడు(3); 16)ఇందులో వత్తివేసి నూనెపోసి దీపం వెలిగిస్తారు(3); 19)వసంతపంచమికిగల మరియొకపేరు(6); 20)కాలునిసోదరి, హేతిభార్య(2); 21)శ్రీకృష్ణునిభక్తుడు(5); 22)జనకమహారాజు నగరం(3)

**నిలువు**

2)ఈ వీరుడు ద్రోణునికి తన కుడిచేతిబొటనవ్రేలుకోసి ఇచ్చాడు(5); 3)శంభువునందు ధ్రువునకు పుట్టిన కుమారుడు(2); 4)అష్టావక్రునిభార్య(3); 5)ఆషాఢశుద్ధపూర్ణిమరోజును ఈ మహర్షిపేరుతో పిలుస్తారు(5); 8)జనకమహారాజు పురోహితుడు(5); 13)శ్రావణశుద్ధపంచమిని ఇలా పిలుస్తారు(6); 14)ఆషాఢకృష్ణ ఏకాదశి(3); 17)మన్మథుడు(4); 18)శ్రీకృష్ణునిచెల్లెలు(3)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



హైదరాబాదు, హిమాయత్‌నగర్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి
ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా జూన్ 05, 2025న
గరుడసేవకు హాజరైన తి.తి.దే. పాలకమండలి
అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు దంపతులు



తిరుపతి, స్విమ్స్‌లో ఉన్న భవనాలను మే 28, 2025న సందర్శించిన
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., మరియు
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,



ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 05, 2025న
తిరుమలలోని గోగర్భండ్యామ్‌సమీపంలో మొక్కలు నాటుతున్న
తి.తి.దే., అదనపు కార్యనిర్వహణాధికారి
శ్రీ సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.,



తి.తి.దే. పాలకమండలి ఎక్స్‌అఫిషియో సభ్యునిగా మే 23, 2025న
ప్రమాణస్వీకారం చేసిన తిరుపతి, తుడ ఛైర్మన్ శ్రీ సి.దివాకర్‌రెడ్డి
దంపతులకు తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందిస్తున్న తి.తి.దే.,
అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.,



తి.తి.దే. ముఖ్యనిఘా మరియు భద్రతాధికారిగా జూన్ 05, 2025న
పదవీబాధ్యతలు చేపట్టిన తర్వాత తిరుమల శ్రీవారి దర్శనార్థం
విచ్చేసిన శ్రీ కె.వి.మురళీకృష్ణ, ఐ.పి.ఎస్.,



మే 31, 2025న
తి.తి.దే. 'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రికకు
ప్రధాన సంపాదకులు(ఎఫ్.ఏ.సి.)గా నియమితులైన
సంపాదకులు డా॥ వి.జి.చొక్కలింగం

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams Printing on 25-06-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.

